



# ఈనాడు







విజయవాడ 7-2-2020 శుక్రవారం సిటీ సంపుటి 46 . సంచిక 178

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 14+20 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi


# కియా కలకలం

**కార్ల పరిశ్రమ ఏపీ నుంచి తరలిపోతోందంటూ 'రాయిటర్స్' సంచలన కథనం**

**ప్రచారాన్ని ఖండించిన మంత్రులు**

**తాము చర్చించలేదన్న తమిళనాడు**

**తమ రాష్ట్రానికి రావాలంటూ పంజాబ్ ఆహ్వానం**

ఈనాడు – అమరావతి

రాష్ట్ర పారిశ్రామిక రంగానికే తలమానికంగా చెప్పుకొంటున్న అంతర్జాతీయ కార్ల తయారీ సంస్థ కియా.. మన రాష్ట్రం నుంచి తమిళనాడుకు తరలిపోనుందా? రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వ విధానాలతో అసంతృప్తిగా ఉన్న కియా సంస్థ ప్రతినిధులు ఇప్పటికే తమిళ తంబిలతో చర్చలు మొదలుపెట్టారా? అవునంటూ.. అంతర్జాతీయ వార్తాసంస్థ రాయిటర్స్ కథనం వెలువరించడం, దాన్ని పలు జాతీయ ఆంగ్ల పత్రికలు ప్రముఖంగా ప్రచురించడంతో సంచలనం రేగింది. దీనిపై గురువారం ఇటు రాష్ట్రంలోనూ, దిల్లీ సహా దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లోనూ పెద్ద ఎత్తున చర్చ జరిగింది. వైకాపా నేతల బెదిరింపు వల్లే ఈ దుస్థితి తలెత్తిందని, అంతర్జాతీయ (మిగతా 12లో)

## రాయిటర్స్ కథనం సారాంశం ఇదీ..




రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రభుత్వ విధానాల్లో మార్పులు రావడంతో ప్లాంటును తమిళనాడుకు తరలించాలన్న యోచనలో కియా ఉన్నట్టు రాయిటర్స్ తన కథనంలో పేర్కొంది. ఆ కథనం ఇలా సాగింది.. 'కియా ఇటీవల మార్కెట్‌లోకి తీసుకొచ్చిన మొదటి మోడల్ సెల్టోస్ ఎస్‌యూవీ విజయవంతమైంది. రాష్ట్రంలో ఏర్పాటయ్యే పరిశ్రమల్లో స్థానికులకే 75% ఉపాధి కల్పించాలని ప్రభుత్వం చెప్పడంతో నిపుణులైన సిబ్బంది దొరకడం కష్టమవుతోంది. ప్రోత్సాహకాల విషయంలో గత ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాలను సమీక్షించాలని ప్రస్తుత ప్రభుత్వం భావిస్తోంది. ఇది కియాకి ఇబ్బందికరంగా మారినట్టు సమాచారం. ఆంధ్రప్రదేశ్‌లో కియా సమస్యలు ఎదుర్కొంటోందని, తమ రాష్ట్రంతో ప్రాథమిక చర్చలే జరిగాయని, వచ్చే వారం కార్యదర్శుల స్థాయి సమావేశం ఉందని, దాని తర్వాత మరింత స్పష్టత వస్తుందని తమిళనాడు ప్రభుత్వ అధికారి ఒకరు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక గతంలో వివిధ కంపెనీలతో చేసుకున్న ఒప్పందాలను సమీక్షించాలని నిర్ణయించింది. వాటిలో పీపీఏలు కూడా ఉన్నాయి. దీనివల్ల రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి జపాన్‌కు చెందిన పారిశ్రామికవేత్తలు ఆసక్తి ఉన్నా.. వెనక్కి వెళ్తున్నారని 2019 ఆగస్టు 7న జపాన్ రాయబారి రాసిన లేఖలో ప్రస్తావించారు.'

## తరలిపోతున్న పెట్టుబడులు

**పార్లమెంటులో ప్రస్తావించిన రామ్మోహన్ నాయుడు**

**అడ్డుకున్న వైకాపా ఎంపీ మాధవ్.. సభ్యుల అభ్యంతరం**

ఈనాడు, దిల్లీ: రాష్ట్రంలో పెట్టుబడులు పక్క రాష్ట్రాలకు తరలిపోతున్నాయని తెదేపా లోక్‌సభా పక్ష నేత కె.రామ్మోహన్ నాయుడు అన్నారు. లోక్‌సభ శూన్యగంటలో గురువారం ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం విశాఖపట్నంలో మిలీనియమ్‌టవర్స్ ఏర్పాటుచేసిందని, అందులో 18 వేల మంది పని చేస్తున్నారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అందులోని కంపెనీలకు మార్చి 13 లోగా ఖాళీ చేయాలని నోటీసులు ఇచ్చిందన్నారు. రాయలసీమకు గత ప్రభుత్వం కియా మోటార్స్ తీసుకొచ్చిందన్నారు. ప్రభుత్వ వైఖరితో ఇప్పటికే కియా అనుబంధ పరిశ్రమలు పక్క రాష్ట్రాలకు పోయాయని, ప్రధాన పరిశ్రమనూ తరలించే యోచన ఉన్నట్లు పత్రికల్లో వార్తలు వచ్చాయన్నారు. ఈ విషయంలో కేంద్రం జోక్యం చేసుకోవాలని కోరారు. (మిగతా 12లో)



## కియాను బెదిరించారు..

- రాయితీలు ఎత్తేస్తామన్నారు
- వైకాపా వచ్చాకే వారికి కష్టాలు
- అనుబంధ పరిశ్రమలూ వెళ్లిపోయాయి
- ఇది సులభతర వాణిజ్యానికే గొడ్డలిపెట్టు
- తెదేపా అధ్యక్షుడు చంద్రబాబు ధ్వజం

ఈనాడు, అమరావతి: "కియా పరిశ్రమ తరలింపు ఆలోచన రాష్ట్రానికే కాదు.. కేంద్రానికీ చాలా నష్టం కలిగించేలా ఉంటుంది. సులభతర వాణిజ్యానికి ఇది గొడ్డలిపెట్టు" అని తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్థిక మంత్రి రాజేంద్రనాథ్‌రెడ్డి కథలు చెప్పడం కాదని.. కియా ప్రతినిధులకు వేలు చూపించింది, బెదిరించింది, రాయితీలు ఇవ్వబోమని చెప్పింది (మిగతా 12లో)



## వేర్వేరుచోట్ల ఉంటే పనిపై ప్రభావం

- అందుకే కార్యాలయాలన్నింటినీ ఒకేచోటకు తీసుకొస్తున్నాం
- కేంద్రమంత్రి స్పష్టీకరణ

ఈనాడు, దిల్లీ: కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు దిల్లీలోని విభిన్న ప్రాంతాల్లో ఉండటం మంత్రిత్వశాఖల పనితీరుపై ప్రభావం చూపుతోందని, అందుకే వాటన్నింటినీ ఒకచోటకు తెస్తూ కేంద్ర సచివాలయం నిర్మిస్తున్నామని కేంద్రమంత్రి (మిగతా 12లో)



## ఉరే సరి

- హాజీపూర్ వరుస హత్యాచారాల కేసుల్లో శ్రీనివాస్‌రెడ్డికి మరణశిక్ష
- 3 కేసుల్లో రెండింటిలో ఉరి, ఒక దాంట్లో యావజ్జీవ శిక్ష
- నల్గొండలోని పోక్సో కోర్టు సంచలన తీర్పు
- 8 నెలల్లోనే తుది తీర్పు

3లో

**జంట హత్యల కేసులో ఉరిశిక్ష**



## రికార్డు యాత్ర

**భూమికి తిరిగొచ్చిన మహిళా వ్యోమగామి**

రికార్డు స్థాయిలో దాదాపు 11 నెలల పాటు అంతరిక్షంలో గడిపిన అమెరికా మహిళా వ్యోమగామి క్రిస్టీనా కోచ్ భూమికి తిరిగొచ్చారు. ఆమెతోపాటు ఐరోపాకు చెందిన లూకా పార్మిటానో, రష్యా వ్యోమగామి అలెగ్జాండర్ స్కోవ్ర్‌ట్సోవ్‌లు గురువారం సోయజ్ వ్యోమనౌక ద్వారా కజకిస్థాన్‌లోని గడ్డి నేలల్లో దిగారు. 2లో

# నెహ్రూ కోసమే

## దేశాన్ని విభజించారు

- పార్లమెంటులో ప్రధాని తీవ్ర ఆరోపణ
- మైనారిటీల రక్షణపై నెహ్రూ ఒప్పందాన్నే అమలు చేస్తున్నామని స్పష్టీకరణ
- సీఏఏపై అభిప్రాయాలు చెప్పొచ్చు అబద్ధాలు మాత్రం తగవని వ్యాఖ్య

ఈనాడు – దిల్లీ

పండిత్ జవహర్‌లాల్ నెహ్రూను భారతదేశానికి ప్రధానమంత్రిని చేయడానికే దేశాన్ని విభజించారని ప్రధాని నరేంద్రమోదీ ఆరోపించారు. నెహ్రూ చేసుకున్న ఒప్పందాన్ని తాము అమలు చేస్తుంటే కాంగ్రెస్ తప్పు పడుతుండడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్రపతి చేసిన ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై గురువారం లోక్‌సభలో, రాజ్యసభలో కలిపి దాదాపు మూడు గంటలపాటు మోదీ సుదీర్ఘ ప్రసంగం చేశారు. ఇటీవలి కాలంలో విపక్షాలు చేస్తున్న అనేక విమర్శలకు సవివరంగా సమాధానాలు ఇచ్చారు. పలు ప్రశ్నల్ని సంధించారు. జాతీయ పౌరపట్టికను సమర్థించుకున్నారు. (మిగతా 12లో)



### తెలంగాణ బిల్లును ఎలా ఆమోదించారో గుర్తు చేసుకోండి

పార్లమెంటులో చర్చించకుండా జమ్మూ-కశ్మీర్ బిల్లును ఆమోదించినట్లు విపక్ష నేత గులాంనబీ ఆజాద్ అంటున్నారు. ఆ అంశంపై సభలో రోజంతా జరిగిన చర్చలను దేశం మొత్తం చూసింది. తొలుత కొంతమంది వ్యక్తులు వెల్‌లోకి వచ్చినా, తర్వాత బయటి నుంచి సమాచారం రావడంతో వెనక్కు వెళ్లడం మంచిదని అర్థం చేసుకున్నారు. సభ్యులంతా ఓటు ద్వారా నిర్ణయాన్ని వెల్లడించారు. పాత విషయాలను ప్రజలు అంత త్వరగా మరిచిపోరు. తెలంగాణ ఏర్పాటు చేసినప్పుడు సభలో పరిస్థితి ఎలా ఉంది? తలుపులు మూసేసి, టీవీ ప్రసారాలు బంద్ చేశారు. (మిగతా 12లో)

# 21వేల కోట్ల రుణం

- ఏఐఐబీ సిద్ధం
- ముఖ్యమంత్రితో బ్యాంకు ప్రతినిధుల భేటీ



సచివాలయంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన ఏసియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ ప్రతినిధులు

ఈనాడు – అమరావతి

ఆంధ్రప్రదేశ్‌కు 3 బిలియన్ డాలర్ల (సుమారు రూ.21వేలకోట్లకు పైగా) ఆర్థిక సహాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు (ఏఐఐబీ) సంసిద్ధత వ్యక్తం చేసినట్లు ప్రభుత్వం వెల్లడించింది. గతంలో ఇచ్చిన రుణానికి ఈ మొత్తాన్ని అదనంగా ఇస్తామని పేర్కొంది. ఆ బ్యాంకు ప్రతినిధులు గురువారం ముఖ్యమంత్రి జగన్‌తో సమావేశమై చర్చించారు. అనంతరం ఈ విషయాలను పేర్కొంటూ ప్రభుత్వం ఒక ప్రకటన జారీచేసింది. సచివాలయంలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో గురువారం సాయంత్రం ఏఐఐబీ (మిగతా 12లో)

### పంట కొన్న వెంటనే డబ్బు అందాలి

- లేకుంటే అధికారులదే బాధ్యత
- సమీక్షలో సీఎం ఆదేశాలు

ఈనాడు డిజిటల్, అమరావతి: కొనుగోలు కేంద్రాల్లో పంట కొన్న వెంటనే రైతులకు డబ్బు అందాలని, లేనిపక్షంలో సంబంధిత అధికారులను బాధ్యుల్ని చేస్తామని సీఎం జగన్ పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రకటించిన ధరల కన్నా తక్కువకు కొంటే వెంటనే జోక్యం చేసుకోవాలని, రైతుల నుంచి ప్రభుత్వమేనేరుగా (మిగతా 12లో)

### చంద్రబాబు మాజీ పీఎస్ ఇంట్లో ఐటీ సోదాలు

- ప్రస్తుతం జీఏడీలో పనిచేస్తున్న శ్రీనివాసరావు
- రాత్రి వరకూ కొనసాగిన తనిఖీలు

11లో

### 'స్థానిక' రిజర్వేషన్లపై తీర్పు వాయిదా

- సర్వే చేయాలన్న నిబంధన పాటించడం తప్పనిసరి
- అభిప్రాయం వ్యక్తం చేసిన ధర్మాసనం

3లో

## ఇదీ సంగతి!




మా పదవులు తొలగించినా, మా పనిలో కలుగజేసుకున్నా మళ్లీ మా మాతృసంస్థలోకి దూకుతామని ప్రమాణం చేశాం.

**రాజధాని పరిధి నుంచి**

# 5 గ్రామాలు బయటకు

**మంగళగిరి, తాడేపల్లి పురపాలక సంఘాల్లో విలీనం**

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతి నగర పరిధిలోని ఐదు గ్రామ పంచాయతీలను మంగళగిరి, తాడేపల్లి పురపాలక సంఘాల్లో విలీనం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు వెలువరించింది. రాజధాని నగర పరిధిలోని 25 గ్రామ పంచాయతీలతోపాటు (శివారు గ్రామాలతో కలిపి మొత్తం 29 గ్రామాలు) కొత్తగా మరో 3 పంచాయతీలను కలిపి అమరావతి కేపిటల్ సిటీ మున్సిపల్ కార్పొరేషన్ (ఏసీసీఎంసీ) ఏర్పాటుకు ప్రతిపాదనలు ఉండగానే... మరోవైపు వీటిలోని నవులూరు, బేతపూడి, ఎర్రబాలెం, పెనుమాక, ఉండవల్లి పంచాయతీలను మంగళగిరి, తాడేపల్లి పురపాలక సంఘాల్లో విలీనం చేస్తూ ప్రభుత్వం గురువారం రాత్రి వేర్వేరుగా జీవోలు ఇచ్చింది. తాడేపల్లి మండలంలో ఎనిమిది, మంగళగిరి మండలంలో ఐదు పంచాయతీలను తాడేపల్లి, మంగళగిరి పురపాలక సంఘాల్లో విలీనం కోసం గుంటూరు కలెక్టర్ నుంచి వేర్వేరుగా వచ్చిన ప్రతిపాదనలను పురపాలకశాఖ (మిగతా 12లో)



తుళ్లూరు దీక్షా శిబిరంలో జై అమరావతి అని నినదిస్తున్న మహిళా రైతులు

# అమరావతే మన భవిష్యత్తు

- 51వ రోజుకు చేరిన నిరసనలు
- కొనసాగుతున్న నిరాహారదీక్షలు

5లో

### అనంతలో అమ్మకానికి ప్రభుత్వ భూములు

కియాకు దగ్గరలోనే 490 ఎకరాలు 6లో

### విశాఖలో ప్రైవేటు బస్సులు నడుపుతారా?

యాజమాన్యాలతో ఆర్టీసీ అధికారుల భేటీ 5లో

### వివేకా హత్య కేసులో పిటిషన్ ఉపసంహరణ

తన వ్యాజ్యంలో ఎలాంటి ఉత్తర్వులు అవసరం లేదన్న జగన్ 5లో

# న్యాయాధికారుల వేతనాలు 2.81 రెట్లు పెంపు

- జస్టిస్ పీవీరెడ్డి నేతృత్వంలోని వేతన సవరణ సంఘం సిఫార్సు

**ఈనాడు, దిల్లీ:** కిందిస్థాయి కోర్టుల్లో సేవలందిస్తున్న న్యాయాధికారుల వేతనాలను 2.81 రెట్లు పెంచుతూ జస్టిస్ పీవీరెడ్డి నేతృత్వంలోని రెండో జాతీయ న్యాయవేతన కమిషన్ సిఫార్సు చేసింది. భత్యాల్లోనూ మార్పులు చేయాలని పేర్కొంది. సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి, పాత పద్ధతినే పునరుద్ధరించాలంది. ఆలిండియా జడ్జెస్ అసోసియేషన్ కేసులో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 2017లో ఏర్పాటైన ఈ కమిషన్... జీతాలు, పింఛన్లు, భత్యాలకు సంబంధించి ప్రధాన నివేదికను జనవరి 29న సుప్రీంకోర్టు రిజిస్ట్రీకి సమర్పించింది. ప్రస్తుతమున్న జీతాలను 2.81 రెట్లు పెంచడంతోపాటు, ఏటా 3% ఇంక్రిమెంట్ ఇవ్వాలని చెప్పింది. 2016 జనవరి 1 నుంచి ఈ కొత్త వేతన సవరణను అమలు చేయాలని స్పష్టం చేసింది. మధ్యంతర ఉపశమనాన్ని సర్దుబాటుచేసిన తర్వాత మిగిలిన బకాయిలను 2020 క్యాలెండర్ సంవత్సరంలోనే చెల్లించాలని కమిషన్ సిఫార్సు చేసింది. భాగస్వామ్య పక్షాలందరి అభిప్రాయాలు స్వీకరించిన తర్వాత సుప్రీంకోర్టు వీటి అమలుపై ఆదేశాలిస్తుంది. త్వరలోనే ఈ ఉత్తర్వులు వెలువడతాయని సంబంధిత అధికారులు తెలిపారు. కమిటీ సిఫార్సుల ప్రకారం...

## వేతనాలు

- ప్రస్తుతం రూ.27,700 ఉన్న జూనియర్ సివిల్ జడ్జి/ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్‌ల ప్రారంభ వేతనం రూ.77,840కి పెరుగుతుంది. సీనియర్ సివిల్ జడ్జి ప్రారంభ జీతం రూ.1,11,000కి, జిల్లా జడ్జి జీతం రూ.1,44,840కి చేరుతుంది. జిల్లా న్యాయమూర్తి గరిష్ఠంగా (సూపర్‌టైం స్కేల్) రూ.2,24,100 పొందుతారు. అంతకుమించి పెరగదు.
- హైకోర్టు న్యాయమూర్తులయ్యే అవకాశం ఉండీ, కాలేకపోయిన సెలెక్షన్ గ్రేడ్, సూపర్‌టైమ్ స్కేల్ జిల్లా జడ్జిలకు వరుసగా 10%, 5% వేతనం పెంచాలని సూచించింది.

## భత్యాలు

- ప్రస్తుతం అమల్లో ఉన్న భత్యాలను తాజా పరిస్థితులకు తగ్గట్టు పెంచడంతోపాటు, కొన్ని నిర్దిష్టమైన అంశాలను కొత్తగా జోడించాలి. సీసీఏని తొలగించాలి.
- వైద్య సేవలను మెరుగుపరచాలి. రీఎంబర్స్‌మెంట్ సరళీకృతం చేయాలి. పింఛనుదారులతోపాటు కుటుంబ పింఛనుదారులకూ వైద్యసేవలు కొనసాగించాలి.
- పిల్లల చదువు, ఇంట్లో పనివాళ్లు, ట్రాన్స్‌పోర్ట్ భత్యాలను కొత్తగా అమల్లోకి తేవాలి. హెచ్ఆర్ఏను అన్ని రాష్ట్రాల్లోనూ ఒకేలా పెంచాలి. అధికారిక గృహసముదాయాలను సరిగా నిర్వహించాలి.

## పింఛన్లు

- ఉద్యోగి పింఛను తన సర్వీసు చివరి నెలలో తీసుకున్న వేతనంపై 50%, కుటుంబ పింఛను చివరి వేతనంపై 30% ఉండాలి. అదనపు పింఛను ఇప్పుడున్న 80 ఏళ్లకు బదులు 75 ఏళ్లకే ఇవ్వాలి. ఆ తర్వాత వివిధ దశల్లో ఆ శాతాన్ని పెంచుకుంటూ పోవాలి. డీఏ 50%కి చేరినప్పుడు రిటైర్మెంట్ గ్రాట్యుటీ, డెత్‌గ్రాట్యుటీపై ప్రస్తుతమున్న సీలింగ్‌ను 25% మేర పెంచాలి.
- పింఛనుదారులకు సహకరించడానికి జిల్లా న్యాయమూర్తులు నోడల్ ఆఫీసర్లను నియమించాలి.
- 2004 తర్వాత చేరినవారికి కొత్త పింఛను విధానం రద్దుచేసి, పాత పింఛను విధానాన్ని పునరుద్ధరించాలి.






**JAWAHARLAL NEHRU TECHNOLOGICAL UNIVERSITY, KAKINADA**
KAKINADA-533003, Andhra Pradesh, India

**VIII CONVOCATION**

The VIII Convocation of Jawaharlal Nehru Technological University Kakinada, Kakinada is tentatively scheduled to be held in the month of April'2020 for the students who have completed degree programmes in the academic year 2018-19. The date and venue of Convocation, Gold Medalist details, fee and other details can be viewed from www.jntuk.edu.in. The application can be submitted ONLINE from 06-02-2020 through the web link www.jntuk.edu.in. The last date for the submission of online application is 29.02.2020.

Sd/- **Registrar**

# ఇంద్రప్రస్థ ఎవరిది?

- గెలుపుపై ఆమ్ ఆద్మీ, భాజపా ఎవరి ధీమా వారిదే

దిల్లీ గద్దెను ఎక్కేది ఎవరు? అధికార ఆమ్ ఆద్మీ పార్టీని 'సంక్షేమం' గట్టెక్కిస్తుందా? విపక్ష భాజపాను 'హిందూత్వ వ్యూహం' గెలిపిస్తుందా? మూడో పక్షం కాంగ్రెస్ పరిస్థితి ఏమిటి? మరో 24 గంటల్లో దిల్లీ ఓటరు తన మనోగతాన్ని ఆవిష్కరించనున్న తరుణంలో అందరి మదినీ తొలుస్తున్న ప్రశ్నలివి.




ఆప్, భాజపా మధ్య ద్విముఖ పోరు విస్పష్టంగా కనిపిస్తున్న ఈ ఎన్నికల్లో.. గెలుపు తమదంటే తమదని ఈ రెండు పార్టీలూ ధీమాగా చెబుతున్నాయి.

### భాజపా శక్తి ఎంత?

గత ఏడాది లోక్‌సభ, 2017లో జరిగిన మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ఫలితాల్ని విశ్లేషిస్తే.. అదే ఊపు కొనసాగితే.. ఈ ఎన్నికల్లో భాజపా కచ్చితంగా గెలిచి తీరాలి. లోక్‌సభ ఎన్నికల్లో భాజపా 57% ఓట్లతో దిల్లీలోని మొత్తం 7 లోక్‌సభ సీట్లనూ తన ఖాతాలో వేసుకుంది. 22.46% ఓట్లతో కాంగ్రెస్ రెండో స్థానంలో, 18% ఓట్లతో ఆప్ మూడోస్థానంలో నిలిచాయి. 2017లో దిల్లీలోని 3 మున్సిపల్ కార్పొరేషన్లనూ భాజపా క్లీన్‌స్వీప్ చేసింది. అదే ఫలితాలు ఇప్పుడూ వస్తాయని, షాహీన్‌బాగ్ నిరసనలకు వ్యతిరేకంగా తమకు నిశ్శబ్ద మెజారిటీ వస్తుందని కమలనాథులు ఆశిస్తున్నారు. అయోధ్యలో రామాలయ నిర్మాణం కోసం ట్రస్టును ఏర్పాటుచేస్తూ తీసుకున్న నిర్ణయంతో హిందువుల ఓట్లన్నీ గంపగుత్తగా తమకే పడతాయని నమ్ముతున్నారు.

### గణాంకాలు ఏం చెబుతున్నాయ్

దేశంలోని ఇతర రాష్ట్రాలకు, దిల్లీకి సంపదపరంగా తేడాలున్నాయి. 2015-16 జాతీయ కుటుంబ, ఆరోగ్య సర్వే ప్రకారం- దిల్లీలో అత్యల్ప ఆదాయం ఉన్న వారు(దేశంలోని 20% మంది నిరుపేదల్లో) కేవలం 0.2%.

ఈ కారణం వల్ల మోదీ సర్కారు అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు ఇక్కడ పెద్దగా ప్రభావం చూపడం లేదు. ఉదాహరణకు ప్రధానమంత్రి ఉజ్వల యోజన(పేద మహిళలకు ఉచిత వంటగ్యాస్ కనెక్షన్ల పథకం) కింద కేవలం 77 వేల కనెక్షన్లు ఇచ్చారు. దిల్లీలోని మొత్తం నివాసుల్లో ఇది 2.2 శాతం. ఈ కనెక్షన్ల పరంగా 19 రాష్ట్రాల కన్నా దిల్లీ వెనుకబడి ఉంది. భాజపా హిందూత్వ రాజకీయాలకు తాము సైద్ధాంతిక ప్రత్యామ్నాయం కాదని, ఐదేళ్ల తమ పరిపాలనను చూసి ఓటేయాలని ఆప్ చేస్తున్న ప్రచారం కమలనాథుల్ని కొంత ఇరుకున పెడుతోంది.

### ఆప్ బలాలేమిటి?

ఐదేళ్లుగా అమలుచేస్తున్న సంక్షేమ పథకాలపై ఆప్ బాగా ఆశలు పెట్టుకుంది. 20 వేల లీటర్ల నెలవారీ వినియోగానికి ఎలాంటి నీటి పన్నును విధించకపోవడం, నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు, 400 యూనిట్ల వరకు రాయితీలు, పాఠశాలలు, ఆసుపత్రుల్లో పరిస్థితుల్ని మెరుగుపరచడం, మొహల్లా క్లినిక్‌ల ఏర్పాటు, మహిళలకు డీటీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులపై నియంత్రణలు, అవినీతి రహిత పాలన ఇలాంటివన్నీ తమను గెలిపిస్తాయని ఆప్ నమ్ముతోంది. అవినీతి విషయంలో జాతీయ స్థాయిలో నరేంద్రమోదీ ఎంత స్వచ్ఛంగా ఉన్నారో.. దిల్లీలో కేజ్రీవాల్ అంతే స్వచ్ఛంగా ఉన్నారన్న ప్రచారమూ సాగుతోంది.




### కాంగ్రెస్ వైపు ముస్లింల చూపు!

ఆప్‌ను ప్రత్యామ్నాయ లౌకిక పార్టీగా ముస్లింలు ఇప్పటికీ నమ్మడం లేదని, అందుకే కాంగ్రెస్‌వైపు చూస్తున్నారనే ప్రచారం ఉంది. ఆర్టికల్ 370 రద్దుకు ఆప్ మద్దతిచ్చింది. సీఏఏకు వ్యతిరేకంగా జేఎన్‌యూ, షాహీన్‌బాగ్‌లలో జరుగుతున్న నిరసనల్లో ఆప్ ముఖ్య నేతలెవరూ పాల్గొనడం లేదు. ఆప్ అనుసరిస్తున్న ఈ తటస్థ వైఖరిని భాజపా అందిపుచ్చుకుంటూ.. ఆ పార్టీలోని హిందువుల్ని తనవైపునకు లాక్కొంటోంది. సరిగ్గా ఎన్నికలకు మూడు రోజుల ముందు ప్రధాని నరేంద్ర మోదీ 'అయోధ్య' అస్త్రాన్ని బయటికి తీశారు. ఆలయ ట్రస్టు ఏర్పాటును ప్రకటించారు. దేశ విభజనకు నెహ్రూయే కారణమని, పాకిస్థాన్‌లో హిందువులు, సిక్కుల్ని చంపేస్తున్నారని.. ఇలా హిందూ భావోద్వేగ అంశాల్ని తెరపైకి తెచ్చి.. ఓట్లు రాబట్టే ప్రయత్నం చేశారు.

### కాంగ్రెస్ పరిస్థితి ఏమిటి?

షీలాదీక్షిత్ నేతృత్వంలో దాదాపు 15 ఏళ్ల పాటు దిల్లీని పాలించిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు భాజపా, ఆప్‌ల నుంచి గట్టి పోటీని ఎదుర్కొంటూ.. మూడో స్థానంలో ఉంది. కాంగ్రెస్ సంప్రదాయ ఓటర్లు చాలా మంది ఆప్ వైపు చూస్తున్నారు. హస్తం పార్టీకి బలమైన అభ్యర్థులు దొరకడమే గగనమైపోయింది. పార్టీ సీనియర్ నేత అజయ్ మాకెన్ పోటీచేయకుండా కుటుంబ సభ్యుల్ని బరిలో నిలిపారు. కాంగ్రెస్ అగ్రనేతలు దిల్లీ ఎన్నికల్లో పెద్దగా ప్రచారం చేయడం లేదు. ఇది ఆప్‌కు కలిసివస్తోందనే వాదన ఉంది. అయితే గాంధీనగర్, బద్లీ, శీలంపుర్, ముస్తఫాబాద్, బల్లిమరాన్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ గట్టిపోటీనిస్తోంది. ఈ ఎన్నికల్లో ఆప్ మళ్లీ అధికారాన్ని చేజిక్కించుకుంటే ప్రజలు అచ్చంగా కేజ్రీవాల్ పాలనను విశ్వసించి ఓటేసినట్లు. భాజపా గెలిస్తే మాత్రం.. హిందూత్వ వాదాన్ని ఒడిసిపట్టడంలో ఆప్ విఫలమైనట్లు లెక్క అని రాజకీయ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

### ముగిసిన ప్రచారం

శనివారం జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు గురువారం సాయంత్రంతో ప్రచారం ముగిసింది. 70 అసెంబ్లీ నియోజకవర్గాలకు 672 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. 1.47 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

- ఈనాడు ప్రత్యేక విభాగం

### గందరగోళ పెడుతున్న ఓటర్ల నాడి

ఆప్‌కున్న ప్రజా మద్దతు స్థిరమైనది కాదన్న విషయం 2017 కార్పొరేషన్ ఎన్నికలు, 2019 లోక్‌సభ ఎన్నికల్లో స్పష్టంగా రుజువైంది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ముస్లింలు ఆప్ పక్షాన కాకుండా కాంగ్రెస్ వైపు నిలబడ్డారు. ఉదాహరణకు మతియా మహల్, బల్లిమరాన్, ఓఖ్లా, శీలంపుర్, బాబర్‌పుర్, ముస్తఫాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో 2013 అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్‌కు 17% ఓట్లు వచ్చాయి. 2014 లోక్‌సభ ఎన్నికల్లో ఇది 39%కి పెరిగింది. 2015 అసెంబ్లీ ఎన్నికల్లో 52% ఓట్లు పడ్డాయి. 2019 లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం కేవలం 13% ఓట్లకు ఆ పార్టీ పరిమితమైంది. ఇక్కడ కాంగ్రెస్ ఓట్లు 28 నుంచి 47%కు పెరిగాయి. ఈ ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 2019లో భాజపాకు 37% ఓట్లు వచ్చాయి.

## పార్టీ ఫిరాయింపుల రోతకు పరిష్కారం కనుక్కోవాలి: ఉపరాష్ట్రపతి

**దిల్లీ:** చట్టసభ్యులు అనైతికంగా పార్టీ ఫిరాయింపులకు పాల్పడుతున్నారని, ఈ రోత ప్రక్రియకు ముగింపు పలకాల్సిన అవసరముందని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. ఈ సమస్యకు పరిష్కారం కనుగొనాలని కేంద్రానికి సూచించారు. గురువారం రాజ్యసభలో డీఎంకే సభ్యుడు పి.విల్సన్ ఈ అంశాన్ని ప్రస్తావించారు. సభ ఛైర్మన్ వెంకయ్యనాయుడు కలుగజేసుకుని- "పార్టీ ఫిరాయింపు అన్నది నీతిమాలిన, రోత చర్య. దీన్ని అరికట్టేందుకు పార్టీలకు అతీతంగా అందరూ ముందుకొచ్చి ప్రత్యామ్నాయాన్ని సూచించాలి. ఇలాంటి అంశాల్లో ప్రిసైడింగ్ అధికారులు, కోర్టులు తదితర వ్యవస్థల వద్ద సమయం పడుతోంది" అని అన్నారు.

## చాన్నాళ్ల తర్వాత భూమికి..

**అల్మాటీ:** రికార్డు స్థాయిలో దాదాపు 11 నెలల పాటు అంతరిక్షంలో గడిపిన అమెరికా మహిళా వ్యోమగామి క్రిస్టీనా కోచ్ భూమికి తిరిగొచ్చారు. ఆమెతోపాటు ఐరోపాకు చెందిన లూకా పార్మిటానో, రష్యా వ్యోమగామి అలెగ్జాండర్ స్కోవ్‌ర్త్సోవ్‌లు గురువారం సోయజ్ వ్యోమనౌక ద్వారా కజకిస్థాన్‌లోని గడ్డి నేలల్లో దిగారు. అంతకుముందు వారు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో విధులు నిర్వర్తించారు. రోదసిలో ఎక్కువ కాలం గడిపిన మహిళగా అమెరికా వ్యోమగామి పెగ్గీ విట్సన్ పేరిట ఉన్న రికార్డును గత ఏడాది డిసెంబర్ 28న క్రిస్టీనా బద్దలుకొట్టారు. పెగ్గీ 289 రోజుల పాటు ఐఎస్ఎస్‌లో ఉన్నారు. క్రిస్టీనా 328 రోజులు అక్కడ గడిపారు. క్రిస్టీనా గత ఏడాది మార్చి 19న ఐఎస్ఎస్‌కు పయనమయ్యారు. గత ఏడాది అక్టోబర్‌లో నిర్వహించిన 'మహిళా స్పేస్‌వాక్'లోనూ పాలుపంచుకున్నారు.



స్పేస్ క్యాప్సుల్ నుంచి క్రిస్టీనా కోచ్‌ను బయటకు తీస్తున్న సిబ్బంది





శ్రీవారి మెట్టుమార్గంలో వేసిన గాల్వలూమ్ షీట్లు

## అలిపిరి మార్గంలో కొత్త పైకప్పు

### రూ.30 కోట్లు సమకూర్చనున్న రిలయెన్స్

**ఈనాడు, తిరుపతి:** అలిపిరి-తిరుమల మెట్ల మార్గాన్ని ఆధునికీకరించాలని తితిదే నిర్ణయించింది. అవసాన దశకు చేరుకుంటున్న ప్రస్తుత కాంక్రీట్ స్లాబును పూర్తిగా తొలగించి గాల్వలూమ్ షీట్లతో కొత్త రూపు తీసుకురానుంది. ఈ ఖర్చును భరించేందుకు రిలయెన్స్ సంస్థ ముందుకు రాగా... ఈ నెలాఖరులోగా పనులు ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు. తిరుమలేశుడి చెంతకు నడిచి వస్తామని మొక్కుకున్న భక్తులు అలిపిరి, శ్రీవారిమెట్టు మార్గాల్లో తిరుమలకు చేరుకోవచ్చు. అలిపిరి దారిలోనే రోజుకు సుమారు 20 వేల మంది నడిచి వెళ్తుంటారు. వీరిపై వర్షం, ఎండ ప్రభావం పడకుండా 30 ఏళ్ల క్రితం ఈ దారిలో తితిదే కాంక్రీటు స్లాబు నిర్మించింది. ప్రస్తుతం అది దెబ్బతిని, పలుచోట్ల పెచ్చులు ఊడుతున్నాయి. ఆ స్లాబును పూర్తిగా తొలగించి.. గాల్వలూమ్ షీట్లు వేయాలని తితిదే ఉన్నతాధికారులు యోచిస్తున్నారు. ఇందుకు సుమారు రూ. 30 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేయగా.. ఈ మొత్తాన్ని భరించేందుకు రిలయెన్స్ ముందుకొచ్చింది. శ్రీవారి మెట్టు మార్గంలో నాలుగేళ్ల క్రితమే ఈ షీట్లు వేయగా.. .. అవి మంచి ఫలితాన్నిస్తున్నట్లు గుర్తించారు. అలిపిరి మార్గం 7.8 కి.మీ దూరం కాగా.. 3550 మెట్లు ఉన్నాయి. సిమెంటు స్లాబు 20 మీటర్లు వేసే సమయంలో గాల్వలూమ్ షీట్లను 1 కి.మీ వరకు పరచవచ్చని ఇంజినీర్లు చెబుతున్నారు. ఈ ప్రాజెక్టుకు ప్రాయోజకకర్తగా వ్యవహరిస్తున్న రిలయెన్స్ సంస్థే.. నేరుగా గుత్తేదారుకు పనులు అప్పగించనుంది. తితిదే పర్యవేక్షించనుంది.

## రెరా ఛైర్మన్, సభ్యుల భర్తీకి అన్వేషణ కమిటీ

**ఈనాడు, అమరావతి:** స్థిరాస్తి వ్యాపార నియంత్రణ సంస్థ (రెరా) ఛైర్మన్, సభ్యుల భర్తీ కోసం సెర్చ్ కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులిచ్చింది. కమిటీ ఛైర్మన్‌గా భూపరిపాలన ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్, సభ్యులుగా వెనుకబడిన తరగతుల సంక్షేమ, వైద్య, ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు కరికల్ వలవన్, డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డిని నియమించారు. గత ప్రభుత్వ హయాంలో నియమించిన ఛైర్మన్, కొందరు సభ్యులు ఇప్పటికే ఉన్నప్పటికీ భర్తీ పేరుతో సెర్చ్ కమిటీని వేయడం అధికార వర్గాల్లో చర్చనీయాంశమవుతోంది.

## ఉపాధి కూలీలకు వేసవిలో అదనపు భత్యం

**ఈనాడు, అమరావతి:** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (నరేగా)లో ఫిబ్రవరి నుంచి జూన్ వరకు చేపట్టే పనులకు వేసవి దృష్ట్యా అదనపు వేతన భత్యం చెల్లించనున్నారు. ఇందుకోసం ప్రభుత్వం గురువారం జీవో విడుదల చేసింది. ఉపాధి కూలీలకు ఫిబ్రవరి, జూన్ నెలల్లో చేసే పనులపై 20 శాతం, మార్చిలో 25, ఏప్రిల్, మే నెలల్లో 30 శాతం అదనపు వేతన భత్యం చెల్లించనున్నారు.

# హాజీపూర్ నిందితుడికి ఉరి శిక్ష

- 8 నెలల్లోనే నల్గొండలోని పోక్సో కోర్టు సంచలన తీర్పు

ఈనాడు - నల్గొండ

తెలంగాణ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం హాజీపూర్‌లో అత్యాచారం, వరుస హత్యల కేసులో నిందితుడు మర్రి శ్రీనివాస్‌రెడ్డికి మరణదండన ఖరారైంది. ఈ కేసులను విచారించిన నల్గొండలోని మొదటి అదనపు జిల్లా సెషన్స్ కోర్టు గురువారం తీర్పును వెలువరించింది. బాధితులు ముగ్గురూ బాలికలు అయినందున నిందితుడిపై చిన్న పిల్లలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం (పోక్సో) కింద పోలీసులు కేసులు నమోదు చేశారు. దీంతో నల్గొండలోని మొదటి అదనపు జిల్లా సెషన్స్ కోర్టునే పోక్సో కోర్టుగా మార్చి ఈ కేసులను త్వరితగతిన విచారించారు. కిక్కిరిసిన కోర్టుహాల్‌లో మొత్తం మూడు కేసుల్లో రెండింటిలో మరణదండన విధించిన న్యాయమూర్తి... ఒక కేసులో యావజ్జీవ శిక్ష విధిస్తూ ఉత్తర్వులిచ్చారు.

### భయాందోళనకు గురి చేసిన వరుస హత్యలు

★ హాజీపూర్‌కు చెందిన ఓ విద్యార్థిని కీసరలో పదోతరగతి చదువుతోంది. పాఠశాలలు ప్రారంభం కంటే ముందే ప్రత్యేక తరగతులు ఉండటంతో గతేడాది ఏప్రిల్ 25న ఉదయం బడికి వెళ్లింది. సాయంత్రం ఇంటికి తిరిగి రాకపోవడంతో బొమ్మలరామారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

★ గ్రామానికి దగ్గరగా ఉన్న ఒక పెద్ద బావిలో దుర్వాసన రావడంతో కొంత మంది యువకులు ఏప్రిల్ 26న సమాచారమిచ్చారు. పోలీసులు బావిలో నుంచి ఆ బాలిక మృతదేహాన్ని వెలికితీశారు. పక్కనే ఉన్న మరో బావిలో పాఠశాల బ్యాగు కనిపించడంతో దానిని తీసేందుకు లోపలికి దిగిన పోలీసులకు అక్కడే కప్పిపెట్టిన ఓ మృతదేహం తాలూకు అస్థిపంజరం కనిపించింది. ఈ బావులు హాజీపూర్‌కు చెందిన మర్రి బాల్‌రెడ్డికి చెందినవిగా పోలీసులు గుర్తించారు.

★ ఏప్రిల్ 27 ఉదయం నుంచి మర్రి బాల్‌రెడ్డి కుటుంబ సభ్యులు కనిపించకపోవడం, అతడి చిన్న కొడుకు శ్రీనివాస్‌రెడ్డి గతంలో కర్నూలులో ఓ మహిళను హత్య చేసి బెయిల్‌పై ఉండటంతో పోలీసులు అనుమానంతో అతడిని ఏప్రిల్ 28న రంగారెడ్డి జిల్లా బండరావిరాలలో అదుపులోకి తీసుకుని విచారించి మే 1న భువనగిరి కోర్టులో హాజరుపర్చారు.

### మరో రెండు కేసులు వెలుగులోకి..

★ హాజీపూర్‌కే చెందిన మరో బాలిక రంగారెడ్డి జిల్లా కీసర మండల కేంద్రంలో డిగ్రీ చదువుతోంది. కళాశాలకు వెళ్లిన ఆమె గతేడాది మార్చి 9 నుంచి కనిపించకుండా పోయింది. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడంతో ఎవరికీ తెలియలేదు. మొదటి కేసుకు సంబంధించిన మృతదేహాన్ని వెలికితీస్తున్నప్పుడు మరో బావిలో కనిపించిన అస్థిపంజరం ఈమెదే.

★ మైసిరెడ్డిపల్లికి చెందిన ఆరో తరగతి అమ్మాయి 2015 ఏప్రిల్ 22 నుంచి అదృశ్యమైంది. తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు.

మొదటి కేసులో అదుపులోకి తీసుకుని విచారించడంతో ఈ రెండు హత్యలను తానే చేసినట్లు శ్రీనివాస్‌రెడ్డి పోలీసుల వద్ద ఒప్పుకున్నాడు. దీంతో పక్కనే ఉన్న బావిలో తవ్వకాలు చేపట్టడంతో మైసిరెడ్డిపల్లి బాలిక అస్థిపంజరం కూడా బయటపడింది. వరుస హత్యలు చేయడంతో ఆగ్రహించిన హాజీపూర్ గ్రామస్థులు శ్రీనివాస్‌రెడ్డి ఇంటిని, అందులోని సామగ్రిని దహనం చేశారు. ఆనాటి నుంచి ఇప్పటి వరకు శ్రీనివాస్‌రెడ్డి కుటుంబ సభ్యుల ఆచూకీ లేదు.

★ అన్ని శిక్షలు ఏక కాలంలో అమలు చేయాలని జడ్జి ఆదేశించారు.

## జంట హత్యల కేసులో మరణదండన

**నెల్లూరు(లీగల్), న్యూస్‌టుడే:** నెల్లూరులో తల్లి, కూతురిని హత్య చేసిన కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడు షేక్ ఇంతియాజ్‌కు ఉరిశిక్ష విధిస్తూ 8వ అదనపు జిల్లా సెషన్స్‌కోర్టు న్యాయమూర్తి బి.సత్యనారాయణ గురువారం సంచలన తీర్పు ఇచ్చారు. బంగారు నగలకోసం నిందితుడు ఇంతియాజ్‌తో పాటు మరో ఇద్దరు మైనర్లు 2013లో ఈ హత్యలకు పాల్పడ్డారు. ప్రాసిక్యూషన్ వివరాల మేరకు.. స్థానిక హరనాథపురానికి చెందిన దినకర్‌రెడ్డికి భార్య శకుంతల, కుమార్తె భార్గవి ఉన్నారు. అప్పట్లో భార్గవి నెల్లూరులోని ఓ వైద్య కళాశాలలో 3వ సంవత్సరం వైద్య విద్య అభ్యసించేది. 2013 ఫిబ్రవరి 12న ఇంటి పనుల నిమిత్తం వచ్చి.. శకుంతల, భార్గవిని మారణాయుధాలతో బెదిరించి దొంగలు నగలు దోచుకునేందుకు ప్రయత్నించారు. వారు తిరగబడటంతో విచక్షణారహితంగా దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే వారు మృతిచెందారని డాక్టర్లు ధ్రువీకరించారు. విచారణలో నేరం రుజువు కావడంతో ఇంతియాజ్‌కు ఉరిశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పుచెప్పారు. ఈ కేసులో నిందితులైన మైనర్లను 2018లో బాలల న్యాయస్థానం తీర్పు మేరకు పరిశీలనా గృహానికి తరలించారు.



తీర్పు అనంతరం నిందితుడిని జైలుకు తరలిస్తున్న పోలీసులు

# 'స్థానిక' రిజర్వేషన్లపై తీర్పు వాయిదా

- సర్వే చేయాలన్న నిబంధన పాటించడం తప్పనిసరి
- అభిప్రాయం వ్యక్తం చేసిన ధర్మాసనం

**ఈనాడు, అమరావతి:** స్థానికసంస్థల ఎన్నికల్లో బీసీలకు 34% రిజర్వేషన్లు కల్పిస్తూ జారీ అయిన జీవోను సవాలు చేస్తూ దాఖలైన వ్యాజ్యాలపై తీర్పును హైకోర్టు ధర్మాసనం వాయిదా వేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ ఎన్.జయసూర్యతో కూడిన ధర్మాసనం గురువారం ఈ మేరకు ఆదేశాలు జారీచేసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ (19.08%), ఎస్టీ (6.77%), బీసీ (34%) రిజర్వేషన్లు 59.85%గా పేర్కొంటూ రాష్ట్రప్రభుత్వం 2019 డిసెంబరు 28న జీవో 176ని జారీచేసింది. ఆ జీవోను, బీసీ రిజర్వేషన్లపై ఏపీ పంచాయతీ రాజ్ చట్టంలో ఉన్న సెక్షన్లను సవాలు చేస్తూ కర్నూలుకు చెందిన బి.ప్రతాప్‌రెడ్డి హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేశారు. ఇదే వ్యవహారంపై మరికొన్ని వ్యాజ్యాలు దాఖలయ్యాయి.

### సర్వే చేయకుండా రిజర్వేషన్లు సరికాదు: పిటిషనర్లు

ప్రతాప్‌రెడ్డి తరపున న్యాయవాది ప్రణతి వాదనలు వినిపించారు. 'బీసీ జనాభా సామాజిక, ఆర్థికసర్వే నిర్వహించాకే రిజర్వేషన్లు పెంచే అధికారం ప్రభుత్వానికి ఉంది. రిజర్వేషన్లు ఖరారు చేసే ముందు సర్వే తప్పనిసరి. సర్వే చేయకుండా 34% రిజర్వేషన్లు నిర్ణయించడం సరికాదు. రిజర్వేషన్లు 50% దాటకూడదన్న సుప్రీం కోర్టు తీర్పునకు విరుద్ధంగా 59.85% రిజర్వేషన్లు ఖరారుచేశారు' అని అన్నారు. మరో పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది వీరారెడ్డి వాదించారు. 'ప్రభుత్వానివి ఊహాజనిత లెక్కలు. ఏపీ బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ బీసీ జనాభా సర్వే చేయాలి. ఆ డేటా ఆధారంగా రిజర్వేషన్లు నిర్ణయించాలి' అన్నారు.





### బీసీ ఓటర్లతో పోలిస్తే తక్కువే: ఏజీ

ప్రభుత్వం తరపున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపించారు. బీసీ జనాభా విషయంలో గతంలో ఉన్న సమాచారం ఆధారంగా 34% రిజర్వేషన్లు కల్పించామన్నారు. ప్రస్తుతం బీసీ ఓటర్లు 48.13% ఉన్నారన్నారు. ఓటర్ల సంఖ్యతో పోలిస్తే ప్రస్తుతం కల్పిస్తున్న 34% తక్కువేనన్నారు. ఈఏడాది మార్చిలోపు ఎన్నికలు నిర్వహించకపోతే కేంద్రం నుంచి రావాల్సిన సుమారు రూ.3వేల కోట్లు నిలిచిపోతాయన్నారు. ఆ వాదనలపై ధర్మాసనం స్పందిస్తూ.. సర్వే చేసి రిజర్వేషన్లు నిర్ణయించాలి కదా అని ఏజీని ప్రశ్నించింది. సర్వే చేయాలన్న నిబంధనలున్నప్పుడు వాటిని అనుసరించడం తప్పనిసరని వ్యాఖ్యానించింది. ఇరువైపు వాదనలు విన్న తర్వాత తీర్పును వాయిదావేసింది.

## రోహత్గీని నియమించుకోవడం బీసీఐ నిబంధనలకు విరుద్ధం

### హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం

**ఈనాడు, అమరావతి:** రాజధాని అంశంపై వ్యాజ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున వాదనలు వినిపించేందుకు మాజీ అటార్నీ జనరల్, సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీని రాష్ట్రప్రభుత్వ నియమించుకోవడాన్ని సవాలు చేస్తూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యంపై గురువారం హైకోర్టు విచారణ జరిపింది. రోహత్గీకి ఫీజు చెల్లింపు నిమిత్తం రూ. 5కోట్లు కేటాయించడంతో పాటు, అడ్వాన్స్‌గా రూ.కోటి చెల్లింపు కోసం ప్రభుత్వం జారీచేసిన జీవోను సవాలు చేస్తూ ఇప్పటికే దాఖలైన వ్యాజ్యంతో కలిపి దీన్ని విచారణ చేస్తామని పేర్కొంటూ వాయిదా వేసింది. రోహత్గీని రాష్ట్రప్రభుత్వం నియమించుకోవడాన్ని సవాలు చేస్తూ న్యాయవాదులు ఆర్.శివాజీ, ఎం.సాయిప్రవీణ్‌కుమార్ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. వారి తరపున న్యాయవాది ప్రభునాథ్ వాసిరెడ్డి వాదనలువినిపిస్తూ.. సీనియర్ న్యాయవాదులను నియమించుకోవడానికి కొన్నిపరిమితులుఉన్నాయన్నారు. రోహత్గీని నియమించుకోవడం బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిబంధనలకు విరుద్ధమన్నారు.

## జగన్ పిటిషన్లపై హైకోర్టులో విచారణ వాయిదా

**ఈనాడు, హైదరాబాద్:** అక్రమాస్తుల వ్యవహారంలో సీబీఐ కోర్టుకు వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపునిస్తూ, తన తరపున న్యాయవాదిని అనుమతించాలంటూ ఏపీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ ఈ నెల 12కి వాయిదా పడింది. వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు నివ్వాలంటూ సీఆర్‌పీసీ సెక్షన్ 205 కింద దాఖలు చేసిన పిటిషన్లను సీబీఐ కోర్టు కొట్టివేసింది. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ జగన్ హైకోర్టును ఆశ్రయించిన విషయం విదితమే. దీనిపై గురువారం మంగళవారం జస్టిస్ గండికోట శ్రీదేవి విచారణ చేపట్టారు. కౌంటర్లు దాఖలు చేయడానికి గడువివ్వాలని సీబీఐ తరపు ప్రత్యేక న్యాయవాది కె.సురేందర్ కోరారు. దీనికి న్యాయమూర్తి అనుమతిస్తూ విచారణను వాయిదా వేశారు.

## అనర్హత జాబితాలోని 4.81 లక్షల పింఛన్లు తనిఖీ

**ఈనాడు డిజిటల్, అమరావతి:** రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్ పింఛను కానుక పథకం కింద అనర్హత జాబితాలో ఉన్న 4.81 లక్షల సామాజిక భద్రత పింఛన్లను శుక్రవారం నుంచి ప్రభుత్వం మరోమారు తనిఖీ చేయనుంది. గతంలో పింఛను తీసుకుంటూ ప్రభుత్వం నిర్వహించిన నవశకం సర్వేలో అనర్హత జాబితాలో చేరిన వాటిని, కొత్తగా పింఛను కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో అనర్హత జాబితాలో చేరిన వారి వివరాలు తనిఖీ చేయనుంది. మండల స్థాయిలో ఎంపీడీవోలు, పురపాలకల్లో కమిషనర్లకు తనిఖీ బాధ్యత అప్పగించింది. వారం రోజుల్లో తనిఖీ పూర్తి చేయాలని ఆదేశించింది.

# విశాఖలో ఐటీ ఉద్యోగులను ఖాళీ చేయిస్తున్నారా?

- అందుకు సంబంధించిన పత్రాలివ్వండి
- పిటిషనర్‌కు సూచించిన హైకోర్టు

**ఈనాడు, అమరావతి:** విశాఖ మిలీనియం టవర్స్‌లో ఐటీ ఉద్యోగులను ఖాళీ చేయిస్తున్నారనే వాదనలకు సంబంధించిన పత్రాలను ప్రజాహిత వ్యాజ్యంతో జతచేస్తూ అనుబంధ వ్యాజ్యం వేయాలని పిటిషనర్‌కు హైకోర్టు సూచించింది. విచారణను వారం రోజులకు వాయిదా వేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ ఎన్.జయసూర్యతో కూడిన ధర్మాసనం గురువారం ఈమేరకు ఆదేశాలు జారీచేసింది. విజిలెన్స్ కమిషనర్, కమిషనర్ ఆఫ్ ఎంక్వైరీస్ కార్యాలయాలను కర్నూలుకు తరలించేందుకు జారీచేసిన జీవోతో పాటు, విశాఖలోని మిలీనియం టవర్స్-బీ నిర్మాణ పనుల కోసం రూ. 19.73 కోట్లు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవోలను సవాలు చేస్తూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఎం.రమేశ్ హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలుచేశారు. పిటిషనర్ తరపున న్యాయవాది ఉన్నం మురళీధరరావు వాదనలు వినిపిస్తూ.. పాలనా వికేంద్రీకరణ, సీఆర్‌డీఏ చట్టం రద్దు బిల్లులు పెండింగ్‌లో ఉండగా కార్యాలయాల తరలింపునకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. మిలీనియం టవర్స్‌లో పనిచేస్తున్న 24వేల మంది ఐటీ ఉద్యోగులను ఖాళీ చేయిస్తున్నట్లు తనకు వాట్సాప్‌లో సమాచారం వచ్చిందన్నారు. దీనిపై స్టే ఇవ్వాలని కోరగా, ధర్మాసనం స్పందించలేదు. ఉద్యోగులను ఖాళీ చేయిస్తున్నారనే వివరాల్ని పిల్‌తో జతచేయాలని సూచిస్తూ విచారణను వారం రోజులకు వాయిదా వేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు వ్యక్తిగత హోదాలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి కె.నారాయణస్వామి, మంత్రులు బొత్స సత్యనారాయణ, బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, కె.కన్నబాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సాహ్ని, సీఎం ప్రధాన సలహాదారు అజేయ కల్లం తదితరులను ప్రతివాదులుగా పేర్కొన్నారు.

# రంగులు వేయడంపై మీరేమంటారు?

- ప్రభుత్వ కార్యాలయాలకు పార్టీ రంగులపై కేంద్రం వైఖరి తెలపాలన్న హైకోర్టు
- తెలంగాణ తరహా నిర్ణయం ఏపీ ముఖ్యమంత్రి తీసుకుంటారేమోనని వ్యాఖ్య

**ఈనాడు, అమరావతి:** ప్రభుత్వ భవనాలకు వైకాపా రంగులు వేస్తున్న నేపథ్యంలో 'ప్రభుత్వ భవనాల నిర్వహణ' విషయమై కేంద్రప్రభుత్వ వైఖరి తెలుసుకోవాలని హైకోర్టు నిర్ణయించింది. సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలు, నేషనల్ బిల్డింగ్ కోడ్ వివరాలు అధ్యయనం చేసి రావాలని సహాయ సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ) కృష్ణమోహన్‌కు సూచించింది. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాల్సిన సమయంలో ప్రభుత్వ కార్యాలయాలపై ముఖ్యమంత్రి బొమ్మ పెట్టడం సరికాదని తెలిపింది. ఆర్టీసీ కార్గో బస్సులపై తన బొమ్మ వద్దని తెలంగాణ ముఖ్యమంత్రి కోరిన విషయం పత్రికల్లో చూశామని.. అలాగే ఏపీలోనూ ప్రభుత్వ కార్యాలయాలపై తన బొమ్మ వద్దని ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకుంటారేమో చూద్దామని వ్యాఖ్యానించింది. విచారణను ఈనెల 11కు వాయిదా వేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ ఎన్.జయసూర్యతో కూడిన ధర్మాసనం గురువారం ఈ మేరకు ఆదేశాలు జారీచేసింది.



## ఈనాడు

### స్వాహాకారానికి కళ్లెం!

ఎంత చెట్టుకు అంత గాలి అన్నట్లు ఎవరి స్థాయికి తగ్గట్లు వారు భావి అవసరాల దృష్ట్యా పొదుపు చెయ్యడం మన జాతి జీవన విధానం. మట్టి ముంతలు, కిడ్డీ బ్యాంకుల ద్వారా పిల్లలకు పొదుపు అలవాటు చేసే సమాజంలో- బ్యాంకు అన్నమాటే విశ్వసనీయతకు పర్యాయపదం. కొద్దిపాటి అధిక వడ్డీపై ఆశతో, అది కూడా బ్యాంకే కదా అన్న నమ్మకంతో కష్టార్జితాల్ని సహకార బ్యాంకుల్లో మదుపు చేసిన లక్షలమంది ఖాతాదారుల కొంపలు కొల్లేరయ్యేలా పంజాబ్ మహారాష్ట్ర సహకార బ్యాంకు (పీఎంసీ) బాగోతం రచ్చకెక్కి- ఆర్‌బీఐ సహా పలు నిఘా యంత్రాంగాల నిష్ప్రయోజకత్వాన్నే కళ్లకు కట్టింది. అలాంటి దురాకృతాల్ని పునరావృతం కానివ్వరాదన్న సంకల్పం మొన్నటి కేంద్ర బడ్జెట్ ప్రసంగంలో వెలుగు చూసింది. సహకార బ్యాంకుల్లో వృత్తి నైపుణ్యాల్ని పెంచి, పెట్టుబడులకు అవకాశం కల్పించి, ఆర్‌బీఐ నిశిత పర్యవేక్షణ ద్వారా నిర్వహణ తీరుతెన్నుల్ని పెంచేందుకు 'బ్యాంకింగ్ రెగ్యులేషన్ యాక్ట్'కు సవరణలు చెయ్యనున్నట్లు విత్తమంత్రి నిర్మల ప్రస్తావించారు. అందుకు తగ్గట్లే, దేశీయంగా 1,540 సహకార బ్యాంకులకుగల 8.6 కోట్లమంది ఖాతాదారుల ప్రయోజనాల్ని పరిరక్షించేందుకు వీలుగా ఆర్‌బీఐకి వాటి క్రమబద్ధీకరణ అధికారాలు దఖలుపరచే కీలక చట్టసవరణను మోదీ సర్కారు ఆమోదించిందిప్పుడు! సహకార బ్యాంకుల యాజమాన్య అంశాల్ని లోగడ మాదిరే కో ఆపరేటివ్ రిజిస్ట్రార్ చూస్తారని, బ్యాంకుల క్రమబద్ధీకరణకు ఆర్‌బీఐ వెలువరించే మార్గదర్శకాల్ని ఇకపై సహకార బ్యాంకులు ఔదలదాల్చాల్సి ఉంటుందని చెబుతున్నారు. వాణిజ్య బ్యాంకుల తరహాలోనే ఇకపై ముఖ్య కార్య నిర్వహణాధికారి (సీఈఓ) నియామకానికి సహకార బ్యాంకులకు ఆర్‌బీఐ అనుమతి తప్పనిసరి! ఆర్‌బీఐ మార్గదర్శకాల ప్రకారం క్రమంతప్పక ఆడిటింగ్ ప్రక్రియా చేపట్టాల్సి ఉంటుంది. బలహీన సహకార బ్యాంకుల అజమాయిషీని చేపట్టేందుకూ ఆర్‌బీఐకి అధికారం దఖలుపడనుంది. అక్రమార్కుల స్వాహాకారంగా దిగజారి పరువుమాస్తున్న సహకార బ్యాంకులకు తాజా సంస్కరణల చికిత్స, అసలు ఏనాడో జరగాల్సింది!

నగరాలు పట్టణ ప్రాంతాల్లోని చిన్నతరహా పరిశ్రమలు, చిల్లర వర్తకులు, చోటా పారిశ్రామికవేత్తలు, వృత్తి నిపుణులు, స్థిరాదాయ వర్గాలకు ఆర్థిక సేవలందించడానికి అర్బన్ సహకార బ్యాంకుల్ని లక్షించారు. సరైన మార్గంలో నడిస్తే వాణిజ్య బ్యాంకుల పొడ పడని చోటా ఆర్థిక నవోత్తేజానికి ఊపిరులూదగల వ్యవస్థ స్వార్థపర శక్తుల చేతిలో చిక్కి- అభాగ్య మదుపరుల పుట్టిని నిలువునా ముంచుతోంది. తగినంత మూలధనం లేకపోవడం, బోగస్ సభ్యత్వం, రుణ మంజూరు అధికారాల కేంద్రీకరణ, అస్మదీయులకు అడ్డగోలుగా రుణ పందేరాలు, వసూళ్లపై దృష్టిసారించకపోవడం వంటివి అర్బన్ సహకార బ్యాంకుల అవ్యవస్థకు మూల హేతువులని నరసింహమూర్తి కమిటీ ఏనాడో విశ్లేషించింది. ఒకవంక ఆ జాడ్యాలు అలా కొనసాగుతుండగానే, బ్యాంకుల సంఖ్య, డిపాజిట్ల పరిమాణం ఊహాతీతంగా విస్తరించాయి. 1991లో దేశవ్యాప్తంగా పట్టణ సహకార బ్యాంకుల సంఖ్య 1,307, డిపాజిట్లు రూ. 8,600 కోట్లు! 2004 నాటికి బ్యాంకులు 2,105కు, డిపాజిట్లు ఏకంగా లక్ష కోట్ల రూపాయలకు చేరాయి. వరస వైఫల్యాలతో బ్యాంకుల సంఖ్య నేడు 1,540కి దిగి వచ్చినా డిపాజిట్లు త్రివిక్రమావతారం దాల్చి అయిదు లక్షల కోట్ల రూపాయలకు పెరిగాయి. అందుకు తగ్గట్లే కుంభకోణాల ఉరవడీ భీతిల్లజేస్తోంది. రూ. 11,600 కోట్ల పైచిలుకు డిపాజిట్లతో ఏడు రాష్ట్రాలకు విస్తరించిన పీఎంసీ బ్యాంకు తన ఆస్తుల్లో 70శాతానికిపైగా, అంటే రూ. 6,500 కోట్ల మొత్తాన్ని హౌసింగ్ డెవలప్‌మెంట్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్‌కు దోచిపెట్టడానికి 21వేల పైచిలుకు నకిలీ ఖాతాలు సృష్టించిన వైనం దిగ్భ్రాంతపరచింది. ఇప్పటికే ఆర్‌బీఐ ప్రత్యక్ష పర్యవేక్షణలో ఉన్న బ్యాంకుల సంఖ్య పాతికకు చేరిన నేపథ్యంలో- అక్రమాల ఉరవడికి అడ్డుకట్ట పడాలంటే, చట్టబద్ధంగానే పటిష్ఠ బిగింపులు ఉండి తీరాలి!

సహకార బ్యాంకింగ్ రంగాన్ని పట్టి పల్లారుస్తున్న రుగ్మతలకు అసలు కారణం- ఉమ్మడి నియంత్రణ వ్యవస్థేనని కేంద్రం ఏనాడో 2002లోనే గుర్తించింది. రాత్రికి రాత్రి బ్యాంకులు బోర్డులు తిప్పేసిన సందర్భాల్లో- తమ బాధ్యత ఏమీ లేదన్నట్లుగా అటు కో ఆపరేటివ్ రిజిస్ట్రార్, ఇటు రిజర్వ్ బ్యాంక్ పరస్పరం వేలెత్తి చూపడమూ పరిపాటిగా మారింది. ఫైనాన్స్ బ్యాంకింగ్, ఆడిట్ రంగాలకు చెందిన నిపుణులతో ఆయా బ్యాంకుల మేనేజిమెంట్ బోర్డులు పరిపుష్టం కావాలని, షెడ్యూలు బ్యాంకుల కన్నా రెండు శాతానికి మించి వడ్డీ ఇవ్వకుండా కట్టడి చేయాలని, డిపాజిట్ బీమాను రెండున్నర లక్షల రూపాయల దాకా విస్తరించాలన్న మేలిమి సూచనలు పదహారేళ్లుగా పోగుపడి ఉన్నాయి. డిపాజిట్ బీమాను తాజా బడ్జెట్లో లక్షనుంచి అయిదు లక్షల రూపాయలకు పెంచిన కేంద్ర ప్రభుత్వం- సహకార బ్యాంకులపై చెదురుతున్న ఖాతాదారుల విశ్వాసాన్ని గాడిన పెట్టేందుకు వడివడిగా అడుగులు కదుపుతోంది. సహకార సంఘాల చట్టానికి నేరుగా రాజ్యాంగం దన్ను ఉన్నందున- దాన్ని మీరలేం కాబట్టి, వాణిజ్య బ్యాంకుల బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌కు ఉన్న అధికారాలను సహకార బ్యాంకులు తమ 'బోర్డ్ ఆఫ్ మేనేజిమెంట్'కు దఖలుపరచాలని రిజర్వ్ బ్యాంకు మాజీ డిప్యూటీ గవర్నర్ ఆర్ గాంధీ నేతృత్వంలోని కమిటీ మొన్నా మధ్య సూచించింది. వందకోట్ల రూపాయల డిపాజిట్లు పైబడిన సహకార బ్యాంకులు బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌తో పాటు మేనేజిమెంట్ బోర్డునూ ఏర్పాటు చేయాలని రిజర్వ్ బ్యాంక్ ఈ ఏడాది మొదట్లో మార్గదర్శకాలు వెలువరించింది. పటిష్ఠ విధివిధానాలు, పటుతర వ్యవస్థల కూర్పుతోపాటే, నిఘా వ్యవస్థనూ బలోపేతం చేసినప్పుడే సహకార బ్యాంకుల్లో 'కాయ తొలుచు పురుగుల చీడ' విరగడ అయ్యేది!

# ఖాళీల భర్తీకి కార్యాచరణేదీ?



దేశవ్యాప్తంగా వివిధ మంత్రిత్వ శాఖల్లో 6.83 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం తాజాగా లోక్‌సభలో నిగ్గు తేల్చింది. ఉద్యోగాల భర్తీలో ఏళ్లుగా కొనసాగుతున్న నిర్లక్ష్య ధోరణికి ఇది నిదర్శనం. కేంద్రంతోపాటు రాష్ట్రాల్లోనూ ఉద్యోగ ఖాళీలు పెద్దయెత్తున ఉన్నా- వాటికి అన్నివిధాలా అర్హులైన నిరుద్యోగులున్నా, నియామకాల ప్రక్రియ సజావుగా సాగడం లేదు. ప్రభుత్వాల విధాన వైఫల్యాలే ఇందుకు కారణం. ఇది ప్రభుత్వ పరిపాలన, ప్రజాసేవలతోపాటు యువత అవకాశాలపైనా ప్రతికూల ప్రభావం చూపుతోంది. దేశవ్యాప్తంగా ఏటా 40 లక్షల మంది నిరుద్యోగులు పెరుగుతున్నారు. దేశంలో 997 ప్రభుత్వ ఉపాధి కల్పన కార్యాలయాల్లో నమోదైన నిరుద్యోగుల సంఖ్య 5.2 కోట్లుగా ఉంది. నమోదు కాని వారి సంఖ్య మరో ఏడు కోట్లకు పైగా ఉంటుందని అంచనా. జాతీయ నమూనా సర్వే సంస్థ (ఎన్‌ఎస్‌ఎస్‌వో) తాజాగా నిర్వహించిన సర్వే నివేదికలను రహస్యంగా ఉంచారు. నిరుద్యోగిత తీవ్రరూపం దాలుస్తోందని సదరు నివేదిక పేర్కొన్న సమాచారం బయటకొచ్చింది. ప్రైవేటుతోపాటు ప్రభుత్వ రంగంలోనూ ఉద్యోగాలు పొందలేని పరిస్థితులు నెలకొందేశంలోని కేంద్ర ప్రభుత్వ శాఖల్లో మంజూరైన ఉద్యోగాల సంఖ్య 38,02,779 కాగా, 2018 మార్చి నాటికి 31,18,956 మంది ఉద్యోగులున్నారు. 6,83,823 కొలువులు ఖాళీగా ఉన్నాయి. గడచిన ఏడాదిన్నరలో పదవీ విరమణలు, మరణాలు, పదోన్నతులు, రాజీనామాలు తదితర కారణాలతో మరో లక్షన్నరదాకా ఖాళీలు ఏర్పడ్డాయి. వీటిలో రైల్వే శాఖకు చెందినవే 1,16,391 ఉద్యోగాలున్నాయి. దేశంలో ప్రధాన రవాణా వ్యవస్థగా ఉన్న రైల్వేల్లో భారీ సంఖ్యలో ఖాళీలు ఉండటంతో సేవలపై ప్రభావం పడుతోంది. కీలకమైన రక్షణ శాఖలోనూ నియామకాలు సరిగా లేవు. ఆర్మీలో 6,867 అధికారుల ఉద్యోగాలు, నౌకాదళంలో 1,500 ఉద్యోగాలు, వైమానిక దళంలో 425 అధికారుల ఉద్యోగాలు భర్తీ కావాల్సి ఉంది. ఆర్మీలో 36,517 జూనియర్ అధికారులు, నౌకాదళంలో 15,590 నావికుల ఉద్యోగాలు, వైమానిక రంగంలో 10,425 ఎయిర్‌మెన్ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. 48 కేంద్ర విశ్వవిద్యాలయాలలో అయిదు వేలకుపైగా ఖాళీలు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల్లోనూ ఉద్యోగాలు ఏటా 22 వేల చొప్పున తగ్గుతున్నాయి. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వాల్లోనూ ఖాళీల సంఖ్య భారీగానే ఉంది. 2019 వరకు రాష్ట్రాల్లో ఖాళీలు 16 లక్షలు. యూపీ వంటి పెద్ద రాష్ట్రాలతోపాటు నాగాలాండ్ వంటి చిన్న రాష్ట్రాల్లోనూ ఖాళీలు వేల సంఖ్యలో ఉన్నాయి. అత్యవసర విభాగాల్లోనూ ఖాళీలు కొనసాగుతున్నాయి. దిల్లీలోని కేంద్ర కేబినెట్ సచివాలయం, ఇతర కేంద్ర ప్రభుత్వ శాఖల్లో దస్త్రాలు, సేవలు తీవ్ర ఆలస్యం కావడానికి వాటిలో సరిపడా ఉద్యోగులు లేకపోవడమే ప్రధాన కారణంగా గుర్తించారు. రాష్ట్రాల్లోనూ పాలన సమస్యలు దీనివల్లే ఉత్పన్నమవుతున్నాయి. బ్యాంకుల విలీనం వల్ల భవిష్యత్తు నియామకాలు ప్రశ్నార్థకంగా మారాయి.

### ఆర్థిక పరిస్థితితో లంకె

ప్రస్తుతం ఉద్యోగాల భర్తీకి కేంద్రంలో, రాష్ట్రాల్లో ఆర్థిక స్థితిగతులను పరిగణనలోకి తీసుకుంటున్నారు. వాస్తవానికి ఉద్యోగ నియామకాలు అనివార్యమయినవి. పొదుపుతో, ఆర్థిక నియంత్రణలతో సంబంధం లేనివి. వాటిని కుదించాల్సిన అవసరం లేదు. నియామకాలను కొనసాగిస్తూ శాఖాపరమైన అవసరాలకు వినియోగించుకోవాల్సి ఉంటుంది. పాలన సంస్కరణలు, సమీక్షలు వంటి వాటి ద్వారా ఉద్యోగుల సేవలను క్రమబద్ధీకరించుకోవచ్చు. ఈ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రయత్నాలు సాగడం లేదు. ప్రభుత్వ ఉద్యోగుల వేతనాల పెంపు, సౌకర్యాల కల్పనకు కేంద్రంలో పే కమిషన్, రాష్ట్రాల్లో వేతన సవరణ కమిషన్లు ఉన్నాయి. ఉద్యోగాల అవసరాలు, ఇతర అంశాలను ఈ కమిషన్లు ప్రస్తావించకుండా వేతన సవరణకు పూనుకోవడం వల్ల నియామకాలు సజావుగా జరగడం లేదు. నియామకాల ప్రక్రియ క్రమం తప్పకుండా జరగాల్సి ఉన్నా ఏళ్ల తరబడి జాప్యం నెలకొంటోంది.

### ఉద్యోగ నియామకాల్లో దేశవ్యాప్తంగా నిర్లిప్తత

ప్రతి శాఖలో ఆరు నుంచి ఎనిమిదేళ్లపాటు నియామకాలు ఆగిపోతున్నాయి. ఉద్యోగాల భర్తీకి ఇప్పటిదాకా కేంద్రంలోగానీ, రాష్ట్రంలోగానీ స్పష్టమైన విధానం లేదు. నియామకాలు కేంద్రీకృతంగా లేవు. కేంద్ర, రాష్ట్రాల స్థాయుల్లో వేర్వేరు సంస్థలు చేపడుతున్నాయి. ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను గుర్తించి ప్రభుత్వానికి నివేదించే పనులు సక్రమంగా సాగడం లేదు. కేంద్ర, రాష్ట్ర ఆర్థిక శాఖలు బడ్జెట్ ప్రవేశపెట్టే సందర్భాల్లో ఇతర శాఖల నుంచి వివరాల్ని సేకరిస్తున్నాయి. కార్మిక శాఖ పరిధిలో ఉపాధి కల్పన కార్యాలయాలు పని చేస్తున్నాయి. వాటిల్లో నిరుద్యోగుల నమోదు మాత్రమే జరుగుతోంది. ఉద్యోగాలు ఇప్పించే బాధ్యతలను తీసుకోవడం లేదు. వాటివద్ద ఉండే సమాచారాన్ని ప్రభుత్వ శాఖలు పరిగణనలోనికి తీసుకోవడం లేదు.

అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో ఆరు నెలలకు ముందే ప్రభుత్వ శాఖల్లో ఏర్పడే ఖాళీలను గుర్తించి, భర్తీ చేసే ప్రక్రియ సాగుతోంది. ఖాళీల భర్తీకి ప్రత్యేక వ్యవస్థలున్నాయి. ప్రతీ నెలా నియామకాల సమీక్ష జరుగుతుంది. అన్ని వర్గాలకు సమాన అవకాశాలను కల్పిస్తున్నారు. ఏ ఉద్యోగ నియామకమైనా ఆరు నెలల్లోపే భర్తీ చేయాలనే నిబంధన ఉంది. ఉద్యోగ ఖాళీలపై ప్రసారమాధ్యమాలు, వెబ్‌సైట్లు, సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం చేస్తున్నారు. మౌఖిక పరీక్షలు నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తున్నారు. మన దేశంలో ఇలాంటి పద్ధతి లేదు. ఉద్యోగ నియామకాలను ఎక్కువగా ఎన్నికల సమయంలోనే ప్రకటిస్తున్నారు. కేంద్రంలో యూపీఎస్సీ నియామకాలు పరిమితంగా ఉంటున్నాయి. స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ఎంపిక సుదీర్ఘ కాలం సాగుతోంది. రైల్వే నియామకాలు ఇష్టారాజ్యంగా ఉన్నాయి. రాష్ట్రాల్లో పబ్లిక్ సర్వీసు కమిషన్ నియామకాలు ఎప్పుడో ఒకసారి ఉంటున్నాయి. యూపీఎస్సీకి, రాష్ట్రాల్లోని పీఎస్సీలకు, ప్రభుత్వ శాఖలకు మధ్య సమన్వయం ఉండటం లేదు. ఉద్యోగాలకు అర్హతల ఖరారు ప్రక్రియల్లోనే సమస్యలు తలెత్తుతున్నాయి. దరఖాస్తుల విధానంలోనూ లోపాలు ఉంటున్నాయి. పరిశీలన ప్రక్రియ నెలలకొద్దీ సాగుతోంది. ప్రశ్నపత్రాల లీకేజీలు గందరగోళాన్ని సృష్టిస్తున్నాయి. తుది జాబితాల ఖరారులోనూ ఇక్కట్లు తప్పడం లేదు. రిజర్వేషన్లకు తోచిన రకంగా భాష్యం చెబుతూ ఎంపిక చేస్తున్నారు. రోస్టర్ విధానం నిక్కచ్చిగా అమలు కావడం లేదు. ఉద్యోగ పత్రాల కోసమూ నిరీక్షించాల్సి వస్తోంది. నియామక ప్రక్రియలో లోపాలు, చిన్నపాటి కారణాలతో న్యాయస్థానాల్లో పిటిషన్లు దాఖలవుతున్నాయి. సత్వర పరిష్కారం కోసం ప్రభుత్వాలు కృషి చేయడం లేదు. నియామకాల ప్రక్రియకు బదులు తాత్కాలికంగా ఒప్పంద, పొరుగు సేవల విధానాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్నాయి. ఈ విధానాల ద్వారా నియమితులై దేశవ్యాప్తంగా తొమ్మిది లక్షల మంది పని చేస్తున్నారు. చాలామంది కీలక బాధ్యతల్లో ఉన్నారు. శాశ్వత ఉద్యోగులకు దీటుగా పని చేస్తున్నారు. ఇందులో కొంతమంది సాధారణ నియామక విధానం కింద చేరినా- వారిని ప్రభుత్వాలు క్రమబద్ధీకరించడం లేదు. పొరుగుసేవల వారి పరిస్థితి మరీ దయనీయం. ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న సంస్థలు లాభాలు పొందుతూ, ఉద్యోగులకు అరకొర వేతనాలిస్తున్నాయి. వారి ఇక్కట్లను ప్రభుత్వాలూ పట్టించుకోవడం లేదు.

### ప్రత్యేక శాఖ అవసరం

ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా దేశంలో ప్రభుత్వ ఉద్యోగాల నియామకాల పంథా మారాలి. నియామకాలపై ప్రత్యేక విధానం రావాలి. ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలి. అన్ని నియామక సంస్థలను దాని పరిధిలోకి తేవాలి. ఖాళీల భర్తీకి కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలి. అమలుకు పటిష్ఠ యంత్రాంగం ఉండాలి. ఆరు నెలల వ్యవధిలో నియామక ప్రక్రియ పూర్తి కావాలి. సత్వరమే అన్ని ఉద్యోగ ఖాళీలను గుర్తించి, యుద్ధ ప్రాతిపదికన భర్తీ చేసేందుకు కృషిచేయాలి. తాజాగా కేంద్ర ప్రభుత్వం నాన్ గెజిటెడ్ ఉద్యోగాల భర్తీకి జాతీయ నియామక సంస్థను ఏర్పాటు చేస్తామని ప్రకటించడం స్వాగతించదగిన పరిణామం. ఆన్‌లైన్ పరీక్షల నిర్వహణకు అన్ని జిల్లాల్లో కేంద్రాలు ఏర్పాటు చేయడం అభ్యర్థులకు సౌలభ్యం కలిగించే నిర్ణయం. ప్రస్తుతం యువత వివిధ ప్రభుత్వ ఉద్యోగాలకు పరీక్షలు రాయడానికి ఇబ్బందులు పడుతున్నారు. నియామక ప్రక్రియను సులభతరం చేయాలి. అవసరమయితే ప్రభుత్వాలు సేవా నిబంధనలను మార్చాలి. రోస్టర్, రిజర్వేషన్ విధానం పక్కాగా ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, మహిళలు, దివ్యాంగుల కేటగిరీలోని బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీని వెంటనే చేపట్టాలి. ఏటా పొడిగింపు విధానం సరికాదు. ఉద్యోగ నియామకాల పరీక్షల నిర్వహణలో పకడ్బందీ జాగ్రత్తలు తీసుకోవాలి. అక్రమాలకు ఏ మాత్రం ఆస్కారం ఇవ్వరాదు. ప్రశ్నపత్రాల లీకేజీలను అరికట్టాలి. మౌఖిక పరీక్షలను నిష్పాక్షికంగా, నిక్కచ్చిగా జరపాలి. రాజకీయ, అధికారిక ఒత్తిళ్లకు తలొగ్గరాదు. ఉద్యోగ నియామక ప్రక్రియలో దళారుల అరాచకాలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ ఉద్యోగాలకు పట్టణాలతోపాటు నగరాల నుంచి అభ్యర్థులు ఎంపికయ్యేందుకు వీలుగా వారికి ప్రభుత్వాల తరపున శిక్షణ ఇవ్వాలి. ఇందుకు ప్రైవేటు సంస్థల సాయం తీసుకోవాలి. ఆర్మీ, పోలీసు నియామకాలకు ఇప్పుడు కొన్ని జిల్లాల్లో ఈ సౌకర్యం ఉంది. మరోవైపు రైల్వేలు, ఇతర సంస్థల్లో, శాఖల్లో ఉద్యోగాలకు విస్తృతంగా శిక్షణ సౌకర్యాలు లేవు. రాష్ట్రాల్లో స్టడీ సర్కిళ్లు ప్రారంభమైనా అవి పరిమిత సంఖ్యలోనే ఉన్నాయి. దేశవ్యాప్తంగా ఉన్న ఉపాధి కల్పన కార్యాలయాలు క్రియాశీలకంగా మారితేనే ప్రయోజనకరం.

**– ఆకారపు మల్లేశం**

### తెలుగు రాష్ట్రాల్లో...




తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ప్రభుత్వ శాఖల్లో భారీయెత్తున ఖాళీలున్నాయి. తెలంగాణ ప్రభుత్వం లక్ష ఉద్యోగాల భర్తీకి పూనుకోగా- ఆ ప్రక్రియ ఇంకా సాగుతోంది. ఎప్పటికప్పుడు ఖాళీల సంఖ్య పెరుగుతూనే ఉంది. ఆంధ్రప్రదేశ్‌లోనూ ప్రభుత్వ శాఖల్లో నియామకాలు పూర్తిస్థాయిలో లేవు. పబ్లిక్ సర్వీసు కమిషన్ల ద్వారా నియామక ప్రక్రియలో మరింత వేగం అవసరం.

# సాహసోపేత నిర్ణయాలకు దూరం

ఆర్థిక మందగతిని అధిగమించడానికి రెండే మార్గాలున్నాయి. ఒకటి- వస్తుసేవల వినియోగాన్ని పెంచడం, రెండు- పెట్టుబడులను పెంచడం. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన బడ్జెట్‌లో రెండో మార్గాన్ని ఎంచుకున్నారు. ఆమె చేసిన పని సరైనదని నేనూ భావిస్తున్నా. మొదటి మార్గంలో వినియోగాన్ని పెంచడానికి ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా జనం చేతికి ఎక్కువ డబ్బు అందిస్తుంది. వారు ఆ డబ్బుతో వస్తువులు, సేవలు కొనుగోలు చేయడం వల్ల గిరాకీ పెరుగుతుంది. దాన్ని తీర్చడానికి ఉత్పత్తి, తద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. ఉద్యోగిత పెరిగినప్పుడు వినియోగం-ఉత్పత్తి ఇంకా పెరుగుతాయి. మందగతికి రెండో మందు- పెట్టుబడులు పెంచడం. దీనివల్ల ఉద్యోగాలు, వినియోగం పెరుగుతాయి. గిరాకీ-ఉత్పత్తి-ఉపాధి ఇనుమడిస్తాయి.

వినియోగంకన్నా పెట్టుబడులు పెంచడమే భేషైన మార్గం. పెట్టుబడులు పెరిగితే రహదారులు, ఆస్పత్రులు, గృహాలు, తాగు నీటి పైపులైన్లు, రేవుల వంటి మౌలిక వసతులు విరివిగా ఏర్పడతాయి. వాటివల్ల ఉద్యోగాలు పెరుగుతాయి. ఈ ఏటి బడ్జెట్ మౌలిక వసతుల నిర్మాణానికి రూ.103 లక్షల కోట్ల పెట్టుబడులను వాగ్దానం చేస్తోంది. అసలు నిర్మలా సీతారామన్ మన ఆర్థిక వ్యవస్థ మందగమనంలో పడిందని ముందే ఒప్పుకొని, దాన్ని అధిగమించడానికి నిర్దిష్ట కార్యాచరణను బడ్జెట్‌లో ప్రకటిస్తే ఎంతో బాగుండేది. ఉపాధి కల్పనకు ఆమె కొన్ని పథకాలను ప్రకటించిన మాట నిజమే కానీ, ఆయా పథకాల వల్ల ఎన్నెన్ని ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు లభించగలవో అంచనా వేసి ఉంటే సముచితంగా ఉండేది. మందగతిని అధిగమించాలంటే ఆర్థిక సంస్కరణలు తప్పనిసరి. వాటిని బడ్జెట్‌లోనే కాకుండా ఇతర సందర్భాల్లోనూ ప్రకటించవచ్చుననే మాట నిజం. కానీ, సంక్షోభ సమయాల్లో సంస్కరణలను స్వీకరించడానికి జనం మానసికంగా సిద్ధమవుతారు. గడ్డు పరిస్థితి నుంచి గట్టెక్కాలంటే స్వల్పకాలంలో కొంత బాధాకరమైన నిర్ణయాలను భరించక తప్పదని వారు గ్రహిస్తారు.

ఉదాహరణకు వ్యవసాయంలో చాలా కీలకమైన సంస్కరణ గురించి ఆర్థిక మంత్రి ప్రస్తావించారు. అదేమంటే- రైతుల నుంచి దీర్ఘకాలిక లీజుపై భూములు తీసుకుని ఒప్పంద వ్యవసాయం చేయడం. దీనివల్ల వ్యావసాయిక ఉత్పాదకత అద్భుతంగా మెరుగుపడుతుంది. ఒప్పంద లేదా కాంట్రాక్టు సేద్యం చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం చాలా రోజుల నుంచి సూచిస్తున్నా, రాష్ట్రాలు వేగంగా స్పందించడం లేదు. ఈ సంస్కరణను చేపట్టే రాష్ట్రాలకు గణనీయ ప్రయోజనాలను అందించి, చేపట్టని రాష్ట్రాలకు చురుకు కలిగించే పనిని ఆర్థిక మంత్రి చేపడతారని ఆశించాను. కానీ, ఆమె ఆ పని చేయకుండా ఓ గొప్ప అవకాశాన్ని జారవిడుచుకున్నారు. వ్యవసాయంతోపాటు స్వదేశీ, విదేశీ పెట్టు



**భూ సంస్కరణలకు తావివ్వని బడ్జెట్**

బడులను ఆకట్టుకోవడానికి భూ, కార్మిక సంస్కరణలను బడ్జెట్‌లో చేపట్టి ఉంటే, దేశంలో పారిశ్రామిక వాతావరణానికి గొప్ప ఊపు వచ్చేది.

స్వీయ వాణిజ్య రక్షణ విధానాలతోపాటు, దిగుమతులకు స్వదేశంలోనే ప్రత్యామ్నాయాలను తయారుచేసుకోవాలన్న విఫల విధానాన్నీ విడనాడుతున్నట్లు బడ్జెట్‌లో ప్రకటించకపోవడం చాలా నిరుత్సాహం కలిగించింది. ఆర్థిక సర్వేను చూశాక ఈ ఏటి బడ్జెట్ ఎగుమతుల వృద్ధికి అత్యంత ప్రాముఖ్యమివ్వబోతుందని ఆశలు రేకెత్తాయి. చైనాలో సమస్యల కారణంగా అంతర్జాతీయ సరఫరా వ్యవస్థలు ప్రత్యామ్నాయాల కోసం అన్వేషిస్తున్నాయి. ఇంతకాలం చైనాలో సాగిస్తూ వచ్చిన ఉత్పత్తి ప్రక్రియను పూర్తిగానో, పాక్షికంగానో ఇతర దేశాలకు మళ్లించాలని చూస్తున్నాయి. చైనాలో కార్మిక వ్యయం పెరగడం కూడా దీనికి ఒక కారణం. దీన్ని భారతదేశం ఒక మహదావకాశంగా తీసుకుంటుందని ఆశించాం. తాజా బడ్జెట్‌లో సుంకాలను తగ్గించి, దేశాన్ని విదేశీ సంస్థలకు ఆకర్షణీయ గమ్యస్థానంగా మలుస్తారని అంచనా వేసుకున్నాం. అది జరగకపోగా కొన్ని వస్తువులపై సుంకాలు పెరిగాయి. ఏ దేశమూ కేవలం సొంత మార్కెట్‌పై ఆధారపడి సుసంపన్నం కాలేదని గుర్తుంచుకోవాలి. విదేశాలకు ఎగుమతులు చేయడం ద్వారా అమూల్య విదేశీ మారక ద్రవ్యం ఆర్జించాలి. దాన్ని పెట్టుబడులుగా మార్చి స్వదేశంలో పరిశ్రమలను విస్తరించుకోవాలి. కానీ, ఈ ప్రభుత్వం ఎగుమతి మార్కెట్లను జయించడంలో విఫలమవడంతో అది ఉద్యోగాల కల్పనలో వైఫల్యానికి దారితీసింది. గడచిన ఏడు సంవత్సరాలలో వియత్నాం ఎగుమతులు 300 శాతం పెరగ్గా, భారత ఎగుమతులు ఎదుగూబొదుగూ లేకుండా 'ఎక్కడ వేసిన గొంగడి...' చందంగా మిగిలిపోయాయి.

ఈ బడ్జెట్ శీఘ్ర ఆర్థిక ప్రగతికి దోహదం చేయదు కానీ, మొత్తం మీద ఇది వివేకవంతమైన, వాస్తవికమైన బడ్జెట్ అని చెప్పాలి. భారీ ఉద్దీపనలు ప్రకటించడానికి మనకు ఆర్థిక స్తోమత ఎటూ లేదు. 2008లో ఆర్థిక సంక్షోభం సంభవించినప్పుడు భారత్ సాహసిక నిర్ణయాలు తీసుకుంది. వాటివల్ల కొన్ని చేదు ఫలితాలు సిద్ధించడం వేరే సంగతి. ఈసారి ఆర్థిక మంత్రి సాహసాలు చేయడానికి ఇష్టపడలేదు. వ్యయాన్ని అదుపులో పెట్టుకొంటూ జీడీపీని పెంచుకోవడానికి ప్రాధాన్యమిచ్చారు. ఈ బడ్జెట్‌లో నాకు వ్యక్తిగతంగా నచ్చిన అంశాలు మూడు ఉన్నాయి. అవి పారిశుద్ధ్య పనులకు మానవులను నియమించకూడదని కట్టుబాటు ప్రదర్శించడం, కంపెనీల చట్టంలో పూర్వం పౌర నేరాలుగా పరిగణించినవాటిని కొత్త బడ్జెట్ నేరాలుగా పరిగణించకపోవడం. పాత పద్ధతి వల్ల వ్యాపార వర్గానికీ ప్రభుత్వానికీ మధ్య పొరపొచ్చాలు ఏర్పడేవి. వాటిని ఇప్పుడు తొలగించడం మంచి పని. ప్రభుత్వం పన్ను చెల్లింపుదారులను వేధించరాదంటూ చట్టబద్ధమైన నియమావళిని రూపొందించడం మూడో మంచి మార్పు. ఈ మూడు అంశాలను సక్రమంగా అమలుచేస్తే గణనీయ పురోగతి సిద్ధిస్తుంది.

**– గురుచరణ్ దాస్**

(రచయిత– ప్రముఖ రాజకీయ, ఆర్థిక విశ్లేషకులు)

## ఈనాడు లేఖలు

### పటిష్ఠ వ్యవస్థలు అవసరం

కరోనా వైరస్ చైనాతో పాటు మరో 12 దేశాల్లో ఉనికి చాటుకొంది. వ్యాధి కనపడగానే స్పందించకుండా చైనా కొంత జాప్యం చేయడంవల్లే పరిస్థితి తీవ్రస్థాయికి చేరినట్లు తెలుస్తోంది. అయితే, ఆలస్యంగానైనా చైనా చేపట్టిన చర్యలు శ్లాఘనీయం. భారత్‌లోనూ కరోనా వైరస్ సోకింది. ఇక్కడ స్క్రీనింగ్, ఐసోలేషన్, చికిత్స వంటివి బాగానే ఉన్నా, ఆకస్మికంగా పెద్ద సవాలు ఎదురైతే తట్టుకునే వ్యవస్థలు లేవు. రాష్ట్రానికో వైరాలజీ ల్యాబొరేటరీ అవసరం కాగా, దేశం మొత్తంమీద అయిదే ఉన్నాయి. పారిశుద్ధ్యం, మంచినీరు, పౌష్టికాహారం విషయంలో మన నగరాలు వెనకబడి ఉన్నాయి. అంటురోగాల్ని ఎదుర్కొనే చర్యలు తీసుకోవడంతో పాటు ప్రభుత్వం దీర్ఘకాలికంగా ఎలాంటి సవాలునైనా ఎదుర్కొనే వ్యవస్థల్ని ఏర్పాటు చేయాల్సిఉంది.

- డాక్టర్ డీవీజీ శంకరరావు, మాజీ ఎంపీ, పార్వతీపురం

### విద్యార్థి స్వేచ్ఛను హరించకూడదు

తెలుగువారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత తెలుగురాష్ట్రాల్లో ప్రజాప్రతినిధులందరికీ ఉంది. నేడు తెలుగు ప్రజలు మాతృభాషను కాపాడుకోవాల్సిన అవసరం వచ్చింది. ఆంగ్లభాష ప్రపంచ భాష అయినా, పదో తరగతి లేదా ఇంటర్ వరకు మాతృభాషలోనే విద్యాబోధన కొనసాగినప్పుడే విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి పునాదులు పడతాయని ఎన్నో అధ్యయనాలు తేల్చి చెప్పాయి. అయినా, ఆంధ్రప్రదేశ్‌లో పాలకులు తెలుగు మాధ్యమాన్ని తొలగించే సన్నాహాల్లో ఉండటం బాధాకరం. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్లం బోధిస్తున్నారు. అటువంటప్పుడు తెలుగు మాధ్యమాన్ని తొలగించి- పూర్తిగా ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టాల్సిన అవసరం ఏమిటో అర్థం కావడంలేదు. ఇది విద్యార్థులు వారి మాతృభాషలో చదివే స్వేచ్ఛను హరించడమే అవుతుంది. నేడు ఎంత ఉన్నత స్థానాల్లో ఉన్నవారిలో అధికశాతం చిన్నప్పుడు మాతృభాషలో చదివినవారేనని విస్మరించకూడదు.

- కాయల నాగేంద్ర, హైదరాబాద్

## ప్రాణదీపం

సూర్యాస్తమయం అయింది. వెలుగు రేఖలు అంతరించాయి. చిమ్మచీకట్లు కమ్ముకున్నాయి. ఒక సాధువు ఆ చీకట్లో నడుచుకుంటూ వెళుతున్నాడు. ఆయన చేతిలో దీపం ఒకటుంది. అది గాలికి అప్పుడప్పుడూ అటు ఇటు కదలుతోంది. ఆ దారినపోతున్న యువకుడు సాధువును ఇలా ప్రశ్నించాడు- 'స్వామీ! మీరు పట్టుకున్న దీపంలో వెలుగు ఎక్కడి నుంచి వస్తున్నదో చెప్పండి'. సాధువు సమాధానం చెప్పకుండా నిర్వికారంగా తన దారిన తాను పోతున్నాడు. యువకుడు మళ్ళీ అదే ప్రశ్న వేశాడు. ఇంతలో గాలి విసురుగా వచ్చింది. సాధువు చేతిలోని దీపం టపటప కొట్టుకొని పుటుక్కున ఆరిపోయింది. సాధువు 'నాయనా! ఈ దీపం వెలుగు ఇప్పుడు ఎక్కడకు వెళ్లిందో చెప్పగలవా? అది నువ్వు చెప్పగలిగితే వెలుగు ఎక్కడ నుంచి ఎలా వచ్చిందో చెప్పగలుగుతా' అని సమాధానమిచ్చాడు.

దోసపాదు పెద్ద ఆకులతో పూలతో పిందెలతో ఎదుగుతుంది. ఒక పిందె అనతి కాలంలోనే కాయగా మారుతుంది. మరికొంత కాలంలోనే 'దోసపండు' సిద్ధమవుతుంది. దోసపండును ఎవరూ తుంచనక్కరలేదు. చెట్టు నుంచి అదే ఊడిపోతుంది. ఈ క్రమం అంతా అత్యంత సహజంగా జరుగుతుంది. మానవుడికి మరణం అలా సిద్ధించాలని ఆధ్యాత్మికవేత్తలు భావిస్తారు. కాలం ప్రాణులను పక్వం చేస్తూ ఉంటుంది. కాలమే ప్రజలను సంహరిస్తూ ఉంటుంది. అందరూ నిద్రపోయేటప్పుడు సైతం కాలం మేలుకొనే ఉంటుంది. కాలమహిమను ఎవరూ అతిక్రమించలేరు.

తెలుగులో 'కాలం చేయడం' ఒక జాతీయం. అర్థం 'మరణించడం'. కాలాన్ని ఎవరూ దాటిపోలేరు కాబట్టి మరణాన్నీ ఎవరూ తప్పించుకోలేరు. జీవన పోరాటంలో ఎవరు ఎప్పుడు ఎక్కడ పడిపోతారో ఆ దేవుడికే తెలియాలి. ఆరాటమే తప్ప పోరాటం, ప్రయత్నం



అంతర్యామి

అసలు చేయని బలహీనులు; ఎంతో కాలం పోరాటం చేసి అలసిసొలసిన బలవంతులు... అందరూ కాలం చేయవలసిందే! చివరి క్షణాల్లోనైనా భగవంతుడు గుర్తుకు వస్తే అదృష్టవంతులే! 'బలం కొంచెం కూడా లేదు, అవయవాలు పనిచేయడం లేదు, ప్రాణాలు ఉంటాయా ఊడతాయా అన్నట్లుంది. శరీరం పూర్తిగా అలసిపోయింది, ఇప్పుడు నా మనసునిండా దేవుడొక్కడే నిండి ఉన్నాడు. ఈ దీనుడిపై దయ చూపాలి! రావే ఈశ్వర! కావవే వరద! సంరక్షింపు భద్రాత్మకా!' అని గజేంద్రుడిలా ఆ జగద్రక్షకుని ప్రార్థించి మోక్షం పొందవచ్చు. ఆ జగద్రక్షకుడు ఎవరో, ఆయన రూపురేఖలు ఎలా ఉంటాయో ఊహకు అందవు. అయినా ఫరవాలేదు. 'సర్వేశ్వరుడు భక్త రక్షకుడు. ఆపదుద్ధారకుడు, ఏం జరిగినా ఆయనే దిక్కు నాకు' అనే భావన కలిగితే చాలు, వాళ్ళు అదృష్టవంతులే! ఇక మరణ భయం ఉండదు! హరి నామస్మరణ తప్పక ముక్తినిస్తుంది. పూర్వం ఖట్వాంగుడు అనే రాజు దేవతలను 'నా ఆయువు ఎంత?' అని అడిగాడు. 'నీ ఆయుష్షు ఇంకా ఒక్క ముహూర్తకాలం మాత్రమే' అన్నారు దేవతలు. వెంటనే రాజు తన సంపదను దానం చేసి, వైరాగ్యంతో శ్రీహరిని మనసులో నిలుపుకొని ముక్తిని పొందాడు.

ప్రాణం ఒక దీపం. అది ఎప్పటికైనా ఆరిపోక తప్పదు. ఈ సంగతి మనసులో స్థిరంగా ఉంటే- లోకంలో ఇన్ని దుర్మార్గాలు, దౌర్జన్యాలు ఉండవు. ఈ ఆరిన దీపం పోయి పరమేశ్వరుడి పాదాల దగ్గర వెలుగునిస్తుంది. తెలుగు భాగవతం పన్నెండో స్కంధంలో వెలిగందల నారయ మహాకవీంద్రుడు శుకయోగితో చెప్పించిన మాటలు- సర్వమానవాళికి సర్వకాలాలకు పనికివచ్చే రతనాల మూటలు...

'ఓ రాజా! మరణిస్తానేమో అనే భయాన్ని మనసులో నుంచి వదిలిపెట్టు! పుట్టుకగల మానవజాతికి చావూ తప్పదు. కాబట్టి హరిని నిత్యమూ స్మరిస్తూ ఉండు. ఇక మళ్ళీ భూమిపై జన్మ అంటూ నీకు ఉండదు! వైకుంఠంలో సుఖంగా ఉంటావు!'

**– డాక్టర్ పులిచెర్ల సాంబశివరావు**

## విశాఖ భూకబ్జాలపై తెదేపా నిజనిర్ధారణ కమిటీ

**ఈనాడు డిజిటల్, అమరావతి:** విశాఖలో భూకబ్జాలతో పాటు నాగార్జున వర్సిటీ వీసీ వ్యవహార శైలిపై వాస్తవాలు తెలుసుకునేందుకు తెదేపా రెండు నిజనిర్ధారణ కమిటీలను ఏర్పాటు చేసింది. తెదేపా అధ్యక్షుడు చంద్రబాబు వీటిని ఏర్పాటుచేశారు. విశాఖ భూకబ్జాలపై ఏర్పాటుచేసిన కమిటీలో సభ్యులుగా ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, మాజీ మంత్రి నక్కా ఆనంద్ బాబు, మాజీ ఎమ్మెల్యే కూన రవికుమార్, పార్టీ అధికార ప్రతినిధి పంచుమర్తి అనూరాధను నియమించారు. నాగార్జున వర్సిటీ విద్యార్థులపై వీసీ అనుసరిస్తున్న కక్షపూరిత వైఖరిపై అధ్యయనానికి ఏర్పాటుచేసిన కమిటీలో ఎమ్మెల్యే బాలవీరాంజనేయస్వామి, మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్సీ ఎ.ఎస్.రామకృష్ణలను నియమించారు.

## లోకేశ్ భద్రత కుదింపు

**ఈనాడు, అమరావతి:** తెదేపా ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ నారా లోకేశ్ భద్రతను రాష్ట్ర ప్రభుత్వం కుదించినట్లు తెదేపా వర్గాలు తెలిపాయి. 8నెలల వ్యవధిలో రెండు సార్లు ఆయన భద్రతను కుదించారని ఆ వర్గాలు పేర్కొన్నాయి. గతంలో జెడ్ కేటగిరిలో ఉన్న భద్రతను వై ప్లస్ కేటగిరికి కుదించారని, తాజాగా ఎక్స్ కేటగిరికి తగ్గించారని పార్టీ వర్గాలు తెలిపాయి.

## ఏఎన్‌యూ వీసీపై గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తాం

- దేవినేని ఉమామహేశ్వరరావు

**ఏఎన్‌యూ, న్యూస్‌టుడే:** గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎఫ్ఏసీ వీసీ ఆచార్య రాజశేఖర్ అవినీతిపై గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తామని తెదేపా మాజీ మంత్రి దేవినేని ఉమా అన్నారు. వర్సిటీలో బుధవారం మూడు రాజధానులపై జరిగిన సదస్సులో సందేహాలు అడిగిన విద్యార్థిని నందను నెట్టేయడమే కాకుండా, అతిథి గృహానికి రమ్మనడాన్ని నిరసిస్తూ గురువారం విశ్వవిద్యాలయం ప్రధాన ద్వారం వద్ద విద్యార్థులు నిరాహార దీక్షకు దిగారు. ఈ సందర్భంగా దేవినేని మాట్లాడుతూ వీసీ సాక్షి పత్రికకు సంబంధించిన వారిని లోపలికి అనుమతించి, స్థానిక ప్రజా ప్రతినిధులను ఎందుకు రానివ్వలేదని ప్రశ్నించారు. విశ్వవిద్యాలయంలో రాజకీయాలు చేస్తే ఊరుకోబోమని స్పష్టం చేశారు.

## తెదేపా చీలిపోతుందని చంద్రబాబుకు ఆందోళన

- ప్రభుత్వ చీఫ్‌విప్ శ్రీకాంత్‌రెడ్డి

**ఈనాడు, అమరావతి:** 'తెదేపాలో చీలిక రాబోతుంది. ఆ ఆందోళన చంద్రబాబులో స్పష్టంగా కనిపిస్తోంది. శాసనమండలి రద్దుతో ఉన్న ఎమ్మెల్సీ పదవిని పోగొట్టారంటూ లోకేశ్ రూపంలో చంద్రబాబుకు ఇంటిపోరు కూడా మొదలైంది. అందువల్లే చంద్రబాబులో అసహనం పెరిగి ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడుతున్నారు' అని ప్రభుత్వ చీఫ్‌విప్ శ్రీకాంత్ రెడ్డి విమర్శించారు. గురువారం వైకాపా కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు.

## దిగజారుడు వ్యాఖ్యలు: ఆళ్ల

**ఈనాడు, అమరావతి:** ప్రతిపక్ష నేత చంద్రబాబు తన స్థాయిని మూడు గ్రామాలకు దిగజార్చుకున్నారని వైకాపా ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి విమర్శించారు. తుళ్లూరులో ఎంపీటీసీ సభ్యుడుగా పోటీ చేస్తారేమో? అని వ్యాఖ్యానించారు. 'మాతోపాటు ముఖ్యమంత్రిని మంగళగిరి ప్రాంత రైతులు కలిస్తే.. వారిని పెయిడ్ ఆర్టిస్టులంటూ చంద్రబాబు దిగజారుడు వ్యాఖ్యలు చేశారు. ఆర్‌కే తన లాయర్‌ను తీసుకెళ్లారంటూ మాట్లాడుతున్నారు. లాయరు అయితే భూమి ఉండకూడదా? ఆ రైతులు, కూలీల ఆధార్ నంబర్లతో పూర్తి వివరాలను వెల్లడిస్తున్నాం చూసుకోండి' అని పేర్కొన్నారు.

## వివేకా హత్య కేసులో

# పిటిషన్ ఉపసంహరణ

- తన వ్యాజ్యంలో ఎలాంటి ఉత్తర్వులు అవసరం లేదన్న సీఎం జగన్
- విచారణను వాయిదా వేసిన హైకోర్టు



**ఈనాడు, అమరావతి:** మాజీ మంత్రి వివేకానంద రెడ్డి హత్య కేసు వ్యాజ్యాలపై గురువారం హైకోర్టులో కీలక పరిణామం చోటు చేసుకుంది. వివేకా హత్య కేసు సీబీఐకి ఇచ్చేలా ఆదేశించాలంటూ ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వేసిన వ్యాజ్యంలో ఇకపై ఎలాంటి ఉత్తర్వులు అవసరం లేదని ఆయన తరపు న్యాయవాది వివేక్ చంద్రశేఖర్ హైకోర్టుకు విన్నవించారు. తమ పిటిషన్‌ను మూసేయాలని అభ్యర్థించారు. దీనికి లిఖిత పూర్వక కారణాలు తెలియజేస్తూ మెమో దాఖలు చేయాలని న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు ఆదేశించారు. విచారణను ఈనెల 13కు వాయిదా వేశారు. వివేకా హత్య కేసు దర్యాప్తును రాష్ట్ర ప్రభుత్వ నియంత్రణలో లేని స్వతంత్ర సంస్థకు లేదా సీబీఐకి అప్పగించాలని మృతుడి భార్య సౌభాగ్యమ్మ, అప్పటి ప్రతిపక్ష నేత.. ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్ లోగడ హైకోర్టులో వ్యాజ్యాలు వేశారు. ఇదే అంశంపై తెదేపా ఎమ్మెల్సీ బీటెక్ రవి, మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి.. తాజాగా వివేకా కుమార్తె సునీత, అల్లుడు రాజశేఖర్‌రెడ్డి వ్యాజ్యాలు దాఖలు చేశారు. వ్యాజ్యాలపై విచారణను వాయిదా వేయాలని కోర్టు పని గంటల ప్రారంభంలోనే ఏజీ శ్రీరామ్ కోరగా న్యాయమూర్తి నిరాకరించారు. ఆ తర్వాత వ్యాజ్యాలు విచారణకు వచ్చినప్పుడు.. వివేకా కుమార్తె, అల్లుడు తాజాగా వేసిన వ్యాజ్యంలో ప్రమాణపత్రం దాఖలు చేయాల్సి ఉందని ప్రభుత్వ న్యాయవాది కోర్టుకు తెలిపారు. వేరే వ్యాజ్యాల్లో ఇప్పటికే దాఖలు చేశారు కదా.. అని న్యాయమూర్తి పేర్కొనగా, సునీత పలు ఆరోపణలు లేవనెత్తినందున వాటికి సమాధానమివ్వాల్సిన అవసరం ఉందని అన్నారు. దీంతో కౌంటర్ వేసేందుకు న్యాయమూర్తి అవకాశమిచ్చారు. దర్యాప్తును సీబీఐకి ఎందుకివ్వరాదని వ్యాజ్యాల విచారణ సందర్భంగా న్యాయమూర్తి మరోమారు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

## భూములిచ్చి మేమెక్కడికి పోవాలి

- అధికారులను నిలదీసిన విశాఖ జిల్లా రైతులు



భూములు లాక్కుంటే మేమెలా బతకాలంటూ ప్రశ్నిస్తున్న రైతులు

**విశాఖపట్నం, న్యూస్‌టుడే:** సాగు చేసుకుంటున్న భూములిచ్చేసి మేమెక్కడికి పోవాలో అధికారులే చెప్పాలంటూ విశాఖ జిల్లా పద్మనాభం మండలం, తునివలస పంచాయతీ నరసాపురం గ్రామ రైతులు అధికారులను నిలదీశారు. గ్రామంలోని సర్వే సంఖ్య 74, 91లలో ఉన్న 181.65 ఎకరాల భూమిని సేకరించడానికి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.వి.సూర్యకళ నేతృత్వంలోని అధికారుల బృందం గురువారం భూసమీకరణ గ్రామసభ నిర్వహించారు. సన్న, చిన్నకారు రైతులంతా ఈ ప్రక్రియను తీవ్రంగా వ్యతిరేకించారు. భూములను ఇచ్చేదిలేదని తేల్చి చెప్పారు. అధికారులు నచ్చజెప్పాలని ప్రయత్నించినా.. వినకుండా సభ నుంచి వెళ్లిపోయారు.

# అమరావతే మన భవిష్యత్తు

- 51వ రోజూ కొనసాగిన దీక్షా శిబిరాలు
- కృష్ణానదిలో మహిళల జలదీక్ష
- పలు ప్రాంతాల రైతులు, మహిళల సంఘీభావం

అమరావతిని రక్షించుకుందాం...అదే మన భవిష్యత్తు అంటూ రాజధాని గ్రామాల ప్రజలు ముక్తకంఠంతో నినదిస్తూ ఉద్యమాన్ని కొనసాగిస్తున్నారు. ప్రజా రాజధాని అమరావతిని ఏకైక రాజధానిగా కొనసాగించాలని కోరుతున్నారు. 'మీకిచ్చిన మెజారిటీ అభివృద్ధికా? వినాశనానికా? ప్రజా సమస్యలు పట్టనప్పుడు దిగిపోండి' 'పారిశ్రామికవేత్తలారా...ఆర్థిక కష్టాల్లో రాష్ట్రం..కన్నీరులో అమరావతి రైతు.. మీ ఆదరణ ఎటు...ప్రభుత్వమా...ప్రజలా?' 'పాలకులారా...రద్దులు వద్దు...అభివృద్ధి ముద్దు' అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. చేసిన తప్పులు సరిదిద్దుకుని...అభినందనలు అందుకోవాలని ముఖ్యమంత్రికి సూచించారు.



రాజధానిగా అమరావతినే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ రైతులు ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేయనున్నారు. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని రాజధాని గ్రామాల్లో దీక్షా శిబిరాల కోసం తాటాకు చలువ పందిళ్లను సిద్ధం చేస్తున్నారు.

**ఈనాడు, ఈనాడు డిజిటల్, అమరావతి:** రాజధాని ఉద్యమం గురువారం నాటికి 51వ రోజుకు చేరింది. ఐదుకోట్ల మంది ఆంధ్రుల భవిష్యత్తుతో ముడిపడిన అమరావతిని సాధించేదుకు ప్రాణాలైనా అర్పిస్తామంటూ ఉద్యమకారులు ప్రతినబూనారు. రాయపూడిలో ముస్లింలు పెద్దఎత్తున దీక్షల్లో పాల్గొన్నారు. తాడేపల్లి మండలం పెనుమాకలో బస్సులు, కార్లు తుడిచి రైతులు నిరసన తెలిపారు. మంగళగిరి మండలం కృష్ణాయపాలెం, ఎర్రబాలెం, నిడమర్రులో, తాడికొండ మండలం అడ్డరోడ్డు వద్ద రిలే నిరాహారదీక్షలు కొనసాగాయి. తుళ్లూరు మహాధర్నాలో రైతులు, మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు. హైదరాబాద్ నుంచి కొంతమంది మహిళలు వచ్చి దీక్షల్లో కూర్చున్నారు. ఓపీడీఆర్ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు చిగురుపాటి భాస్కరరావు, చిత్తూరు జిల్లాకు చెందిన పద్మనాభనాయుడు సంఘీభావం తెలిపారు. రిలే నిరాహారదీక్షలో కూర్చున్న మహిళలు ఎమ్మెల్సీ అర్జునుడికి సన్మానం చేశారు. నారాకోడూరు నుంచి వచ్చిన రైతులు కూరగాయలు అందజేశారు. ఒంగోలు నుంచి వచ్చిన విశ్రాంత ఉద్యోగి సత్యసావిత్రి దంపతులు.. దీక్షలలో పాల్గొంటున్న మహిళలకు నమస్కరించారు. తుళ్లూరులో ఇప్పటికీ ఉద్యమంలోకి రానివారి ఇళ్లకు మహిళలు వెళ్లి బొట్టుపెట్టి పిలిచారు. మందడంలో నిరసన శిబిరం కొనసాగింది. కృష్ణా జిల్లా ఘంటసాల మండలం చిన్న కళ్లేపల్లి నుంచి వచ్చిన రైతులు, మహిళలు సంఘీభావం ప్రకటించారు. రూ.5వేలు విరాళం అందించారు. గుంటూరు నగరం నుంచి విశ్రాంత ప్రిన్సిపల్ ఆధ్వర్యంలో పలువురు మహిళలు, బళ్లారి నుంచి రైతులు వచ్చి సంఘీభావం తెలిపారు. వెలగపూడిలో 24గంటల నిరాహారదీక్షను రైతులు చేపట్టారు. కృష్ణా జిల్లా తాడిగడప, గొల్లపూడికి చెందిన మహిళలు వచ్చారు. గుంటూరు నుంచి వచ్చిన కల్లూరి వాణికుమార్, హరిప్రసాద్, కృష్ణప్రసాద్ సంఘీభావం తెలిపారు. తాళ్లాయపాలెం రేవులో అమరావతిని ఏకైక రాజధానిగా కొనసాగించాలని కోరుతూ మందడం, మల్కాపురం గ్రామానికి చెందిన మహిళలు, చిన్నారులు కృష్ణా నదిలో జలదీక్ష చేశారు.

### అణచివేసేందుకు కుట్ర

అమరావతికి మద్దతు తెలపాలని అడిగిన యువకులపై వైకాపా ఎంపీ నందిగం సురేష్ అక్రమ కేసులు పెట్టించారు. అమరావతి ఉద్యమాన్ని అణచివేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. చంద్రబాబును, నన్ను జైలుకు పంపేందుకు జగన్ ప్రయత్నిస్తున్నారు. శాసనమండలిలో మూడు రాజధానుల బిల్లు ఆమోదింపజేసుకునేందుకు వైకాపా అడ్డదారులు తొక్కింది. ఒక్కో తెదేపా ఎమ్మెల్సీని కొనేందుకు రూ.25 కోట్లు, ఛైర్మన్‌కు రూ.50కోట్లకుపైగా ఎర చూపారు. ప్రలోభాలకు లొంగకుండా ఛైర్మన్ షరీఫ్ సహా ఎమ్మెల్సీలు ప్రజల పక్షాన నిలిచారు. రైతుల్లో చీలిక తెచ్చేందుకు ఎంపీ శ్రీకృష్ణదేవరాయలను జగన్ అమరావతికి పంపారు. హైదరాబాద్‌లో తన రియల్‌ఎస్టేట్ వ్యాపారం పెంచుకునేందుకు, పొలాలు అమ్ముకునేందుకు జగన్ అమరావతిని చంపేశారు. తెలంగాణకు ప్రయోజనం చేకూర్చేలా జగన్ వ్యవహరిస్తున్నారు. వైకాపా నేతలు విశాఖలో కబ్జా చేసిన భూములతో రూ.కోట్లు కొల్లగొడుతున్నారు.

– దేవినేని ఉమ, మాజీ మంత్రి

### రాజధానికి విరాళాలు

రాజధాని అమరావతి పరిరక్షణ జేఏసీకి హైదరాబాద్ వాసులు, కర్ణాటక, చిలకలూరిపేట రైతులు రూ.2,81,826 నగదు, 2 గాజులు, 2 ఉంగరాలు విరాళాలుగా అందించారు. గురువారం ఎన్టీఆర్ భవన్‌లో తెదేపా అధినేత చంద్రబాబు సమక్షంలో విరాళాలిచ్చి రాజధాని పోరాటానికి సంఘీభావం తెలిపారు. చిలకలూరిపేటకు చెందిన పలువురు రూ.66 వేలు, నరసింహరావు రూ.20 వేలు, నాగేశ్వరరావు రూ.10 వేలు, వెంకట్రావు రూ.2 వేలు, కర్ణాటకకు చెందిన సాయికృష్ణ రూ.5 వేలు విరాళమిచ్చారు. హైదరాబాద్ మోతీనగర్ వాసులు తాము సేకరించిన రూ. 1,53,826 రాజధాని పోరాటానికి సాయంగా ఇచ్చారు. చిలకలూరిపేటకు చెందిన ప్రమీల, శేషమాంబ చెరో బంగారు గాజు, రత్నకుమారి, నాగేశ్వరమ్మ చెరో ఉంగరాన్ని విరాళంగా ఇచ్చారు.

- అమరావతి పరిరక్షణ జేఏసీకి గుంటూరు జిల్లా తెదేపా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు రూ.2 లక్షలు విరాళం అందజేశారు. గురువారం ఎన్టీఆర్ భవన్‌లో చంద్రబాబు చేతుల మీదుగా చెక్కును జేఏసీ నేతలకిచ్చారు.



తనపై దాడి గురించి చంద్రబాబుకు వివరిస్తున్న బాధితుడు వెంకయ్య

## వైకాపా నేతలు బతకనిచ్చేలా లేరు

- పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేస్తామన్నందుకు గొడ్డళ్లతో దాడి
- చంద్రబాబుకు మొరపెట్టుకున్న కంభంపాడు గ్రామస్థుడు వెంకయ్య

**ఈనాడు డిజిటల్, అమరావతి:** వైకాపా నేతలు మమ్మల్ని బతకనిచ్చేలా లేరని, చంపేస్తామంటూ బెదిరిస్తున్నారని గుంటూరు జిల్లా మాచర్ల మండలం కంభంపాడు గ్రామానికి చెందిన దండు పెద వెంకయ్య కన్నీటిపర్యంతమయ్యారు. పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేస్తామనడంతో బుధవారం రాత్రి వైకాపా నేతలు తన తల, భుజంపై గొడ్డళ్లతో నరికారని ఆరోపించారు. గురువారం తెదేపా కార్యాలయంలో చంద్రబాబును వెంకయ్య కలిసి రక్తమోడిన గాయాలను చూపించారు. "వైకాపా నాయకులు ఎలాంటి తగాదా లేకుండానే నా కుమారుడు గురవయ్యపై దాడికి దిగారు. అడ్డుకోబోయిన నా తల, భుజంపై గొడ్డళ్లతో నరికారు. తలపై గాయానికి 10 కుట్లు, చేతిపై 4 కుట్లు పడ్డాయి. ఊళ్లో ఉండలేకపోతున్నాం.. ఈ ఐదేళ్లు ఎక్కడికైనా వెళ్లిపోవాలనిపిస్తోంది. దాడి చేశారని బుధవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేసి గురువారం ఉదయం మా ఊరు వెళ్లాం. మమ్మల్ని కొట్టినవారు బయట తిరుగుతున్నారు. పోలీసులకు చెప్పినా పట్టించుకోవడం లేదు" అని వెంకయ్య కన్నీటి పర్యంతమయ్యారు. చంద్రబాబు స్పందిస్తూ.. అధికారం ఉందని వైకాపా నాయకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తామంటే సహించబోమని పేర్కొన్నారు. వెంకయ్యపై దాడిని ఖండిస్తున్నామని, ఆయన కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని చెప్పారు. ఘటనపై డీజీపీ, ఎస్పీకి లేఖలు రాస్తామన్నారు. మరోవైపు.. తెదేపా కార్యకర్తలపై దాడులు చేసిన వారిని అరెస్టు చేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య డీజీపీ గౌతం సవాంగ్‌కు గురువారం లేఖ రాశారు.

### అభివృద్ధిలో అట్టడుగున

తెదేపా హయాంలో అభివృద్ధిలో నంబర్ వన్‌గా ఉన్న రాష్ట్రం ఇప్పుడు అట్టడుగుకు చేరిందని చంద్రబాబు అన్నారు. 'వైకాపా ప్రభుత్వ చేతగానితనం వల్ల రాష్ట్ర రాబడి పడిపోయింది. అప్పులు 16% పెరిగిపోయాయి. పెట్రోలు, డీజిల్, ఆర్టీసీ ఛార్జీలను పెంచి ప్రజలపై రూ.1200 కోట్ల భారం మోపారు. ఇప్పటికే రూ.1.80 లక్షల కోట్లు పెట్టుబడులు వెనక్కి వెళ్లాయి. వీటన్నింటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి' అన్నారు.

### పింఛన్ల తొలగింపుపై 10న ఆందోళన

రాష్ట్రవ్యాప్తంగా 7 లక్షల సామాజిక భద్రత పింఛన్ల తొలగింపు అన్యాయమని ప్రతిపక్షనేత చంద్రబాబు పేర్కొన్నారు. దీనికి నిరసనగా ఈ నెల 10న అన్ని మండలాల్లో ఆందోళనలు నిర్వహించాలని పార్టీ శ్రేణులను ఆదేశించారు. స్పందన కార్యక్రమంలో వినతులు అందించాలని సూచించారు. తొలగించిన వారందరికీ మళ్లీ పింఛన్లు వచ్చేవరకు పోరాడాలన్నారు. తెదేపా నేతలతో గురువారం నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో చంద్రబాబు మాట్లాడుతూ 'బతికున్న వాళ్లనే చనిపోయినట్లు చూపడం, లక్షలాది పింఛన్లు తొలగించడం అమానుషం. రాష్ట్రంలో ఒక్క పింఛను తొలగించినా ఒప్పుకోం. పింఛను పంపిణీలో వృద్ధులు, వికలాంగుల నుంచి వాలంటీర్లు డబ్బులు వసూలు చేస్తే సహించం' అన్నారు.



ఈ నెల 4న తెనాలిలో నిర్వహించిన సంఘీభావ సభ సందర్భంగా అమరావతి ఉద్యమానికి డబ్బు, బంగారం రూపంలో వచ్చిన విరాళాలను మంగళగిరిలోని తెదేపా కార్యాలయంలో చంద్రబాబు చేతులమీదుగా అమరావతి ఐకాస నాయకులు వై.వి.రమణారావు, గద్దె తిరుపతిరావులకు అందిస్తున్న తెదేపా నేతలు ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఆనంద్‌బాబు, ప్రత్తిపాటి పుల్లారావు

## లేఖలు రాస్తే హోదా వస్తుందా..?

- సీఎంపై కాంగ్రెస్ నేత మస్తాన్‌వలీ విమర్శలు

**ఈనాడు డిజిటల్, అమరావతి:** కేంద్ర ప్రభుత్వంపై పోరాటం చేయకుండా తూతూమంత్రంగా లేఖలు రాస్తే ప్రత్యేకహోదా వస్తుందా అని ఏపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మస్తాన్‌వలీ ప్రశ్నించారు. కేంద్రం మెడలు వంచి ప్రత్యేకహోదా సాధిస్తామన్న సీఎం జగన్.. ఇప్పుడెందుకు మాట్లాడడం లేదని విమర్శించారు. కేంద్రం మెడలు వంచకపోగా ప్రధాని మోదీ ముందు తలవంచుతున్నారని విమర్శించారు.

## జాతీయ ప్రతిభా పరీక్ష ఫలితాల విడుదల

**ఈనాడు, అమరావతి:** జాతీయ ప్రతిభా పరీక్ష స్టేజీ-1 ఫలితాలను విడుదల చేసినట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు సుబ్బారెడ్డి తెలిపారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు వెబ్‌సైట్‌లో పెట్టిన నమూనా ప్రకారం ధ్రువపత్రాలను 25వ తేదీలోపు సమర్పించాలని సూచించారు. ఫలితాలను www.bseap.org వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. స్టేజీ-2 వచ్చే మే 10న నిర్వహించనున్నట్లు తెలిపారు.

## జనాభా గణన సంచాలకుడిగా సత్యనారాయణ

ఆంధ్రప్రదేశ్‌లో జనాభాగణన విభాగం సంచాలకుడిగా (డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ ఆపరేషన్స్/డైరెక్టర్ ఆఫ్ సిటిజన్ రిజిస్ట్రేషన్) ఐఏఎస్ అధికారి ఎస్.సత్యనారాయణను కేంద్ర ప్రభుత్వం నియమించింది. ఆయన 2023 మార్చి 31 వరకు ఆ పోస్టులో కొనసాగుతారు.

## విశాఖలో ప్రైవేటు బస్సులు నడుపుతారా?

- యాజమాన్యాలతో ఆర్టీసీ అధికారుల భేటీ

**ఈనాడు, విశాఖపట్నం, అమరావతి:** విశాఖపట్నంలో సిటీ బస్సు మార్గాల్లో ప్రైవేటు బస్సులనూ అనుమతిస్తామని.. నడుపుతారా అంటూ ప్రైవేటు బస్సుల యజమానులను ఆర్టీసీ అధికారులు కోరారు. పలువురు యజమానులతో, ఆర్టీసీ విజయనగరం కార్యనిర్వాహక సంచాలకులు (ఈడీ), విశాఖ రీజనల్ మేనేజర్ (ఆర్ఎం) గురువారం విశాఖలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సిటీలో ప్రైవేటు బస్సులు నడపడంపై చర్చ జరిగింది. నగర పరిధిలోనే నడపాలని, ఆర్టీసీ ఛార్జీల్లాగే వసూలు చేయాలని అధికారులు చెప్పినట్లు తెలిసింది. తర్వాత బస్సుల యజమానులు స్పందించారు. నగరంలో ట్రాఫిక్ వల్ల మైలేజి రాక నష్టపోతామని.. దూర ప్రాంతాల మార్గాల్లో అనుమతి ఇస్తే బస్సులు నడుపుతామని పలువురు చెప్పినట్లు తెలిసింది. చుట్టుపక్కల రూట్లలో అనుమతిచ్చే ఆలోచన లేదని అధికారులు పేర్కొన్నట్లు సమాచారం.





ఇప్పుడే బుక్ చెయ్యండి

| మోడల్ | తిన్నగా వచ్చే ప్రయోజనం (₹) | ఎక్స్ఛేంజ్ ప్రయోజనం (₹) | కార్పొరేట్ ప్రయోజనం (₹ వరకు) | మొత్తం ప్రయోజనం (₹ వరకు) |
|---|---|---|---|---|
| M8 | 1 39 000 | 25 000 | 7 000 | 1 71 000 |
| M6 | 77 000 | 25 000 | 7 000 | 1 09 000 |
| M4 | 36 000 | 15 000 | 7 000 | 58 000 |

CHOOSE TOGETHER. CHOOSE RIGHT.
MARAZZO

ఇతర డీజెల్ MPVలతో పోలిస్తే. ఇంజన్ ఐడిల్‌గా ఉన్నప్పుడు డ్రైవర్ చెవి దగ్గర 43dB. ఎయిర్ స్పీడ్ 36m/s. షోల్డర్ రూమ్ 1వ మరియు 2వ వరుసలలో మరియు లెగ్ రూమ్ 3వ వరుసలో. షరతులు, నిబంధనలు వర్తిస్తాయి. వెహికల్ రంగు చూపబడిన చిత్రాల కన్నా వేరుగా ఉండవచ్చు.మరింత సమాచారానికై మీకు దగ్గరలో ఉన్న మహీంద్రా డీలర్‌షిప్‌కి రండి.

AUTOMOTIVE MANUFACTURERS PVT. LTD: VIZAG, ANAKAPALLI: 7799739104; NEON MOTORS: VIZAG: 7799739110; PIONEER AUTO WORLD PVT. LTD: GUNTUR: 7799739107; BALAJIAGENCIES & INDUSTRIES: NELLORE, KAVALI, NAYUDUPETA, SULLURPETA, ATMAKUR, PODHALAKUR: 7799739099

## తథాగతుడా.. మన్నించు!



పురాతన అవశేషాలు కలిగిన దంతపురి ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా గతంలో పురావస్తుశాఖ గుర్తించింది. 2002లో బుద్ధుని విగ్రహాన్ని నెలకొల్పింది. ఆ తర్వాత అభివృద్ధికి ఎటువంటి చర్యలూ చేపట్టలేదు. ఈ ప్రాంతం శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస నియోజకవర్గంలోని రొట్టవలస కూడలి సమీపంలో ఉంది. ఇక్కడ కొంతకాలంగా అసాంఘిక కార్యకలాపాలు సాగుతున్నాయి. చీకటి పడితే చాలు తాగుబోతులు, తిరుగుబోతులు పేట్రేగుతున్నారు. పెచ్చులూడిపోయిన బుద్ధ విగ్రహం దగ్గర ఖాళీ మద్యం సీసాలు గురువారం ఇలా దర్శనమిచ్చాయి.
–న్యూస్‌టుడే, సరుబుజ్జిలి

# వికేంద్రీకరణ బిల్లు సెలక్ట్ కమిటీకి వెళ్లలేదు

- దేనికైనా విధివిధానాలు ఉంటాయి ● ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి
- చంద్రబాబే ఆర్థిక పరిస్థితి దిగజార్చారు.. మేం సరిదిద్దుతున్నాం

**ఈనాడు, అమరావతి:** ఆంధ్రప్రదేశ్ వికేంద్రీకరణ బిల్లు, సీఆర్‌డీఏ రద్దు బిల్లులను సెలక్ట్ కమిటీకి అప్పగించినట్లు కాదని (ఇట్ హేజ్ నాట్ బీన్ రిఫర్డ్) రాష్ట్ర శాసనసభ వ్యవహారాలు, ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి వెల్లడించారు. అసలు సెలక్ట్ కమిటీ ఏర్పాటు అన్న ప్రశ్నే ఉత్పన్నం కాదని చెప్పారు. కుర్చీలో కూర్చుని ఇష్టమొచ్చినట్లు ఫత్వాలు జారీచేసేందుకు ఇదేమైనా రాజరికమా? అని ఆయన ప్రశ్నించారు. బిల్లులను సెలక్ట్ కమిటీకి పంపాలంటే అందుకు కొన్ని నిబంధనలున్నాయన్నారు. తొలుత తీర్మానం ఇవ్వాలని, సభలో దాన్ని చర్చకు స్వీకరించి. . తర్వాత ఓటింగు జరగాలని, ఆ తర్వాతే సెలక్ట్ కమిటీ అన్న అంశం ఉంటుందని తెలిపారు. ఈ నిబంధనలేవీ పాటించకుండా విచక్షణాధికారం ఉందంటూ సెలక్ట్ కమిటీకి పంపుతానంటే సాధ్యమవుతుందా అని ప్రశ్నించారు. విచక్షణాధికారం ఉందంటూ సభను రద్దుచేస్తున్నా అని ఆయన ప్రకటిస్తే అయిపోతుందా? అని అడిగారు. సచివాలయంలో ఆర్థికమంత్రి బుగ్గన గురువారం విలేకర్లతో మాట్లాడారు. సెలక్ట్ కమిటీ అంశాన్ని విలేకర్లు ఆయన దృష్టికి తీసుకువెళ్లగా పైవిధంగా స్పందించారు. ప్రత్యేక హోదాతో తమకు సంబంధం లేదని పదిహేనో ఆర్థిక సంఘం చెప్పిందని, ఇష్టం ఉంటే కేంద్రం ఇవ్వవచ్చని పేర్కొందని, అదే ఒక సాధన అని బుగ్గన అన్నారు. రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు ప్రత్యేకహోదాపై అలా మాట్లాడటం ఎంతవరకు సబబో ఆయనే ఆలోచించుకోవాలన్నారు.



**చంద్రబాబే ఇలా చేశారు**

రాష్ట్ర ఆర్థికవ్యవస్థను అతలాకుతలం చేసి వెళ్లింది చంద్రబాబేనని, ఇప్పుడు తమను విమర్శిస్తున్నారని బుగ్గన ఎద్దేవా చేశారు. దేశవ్యాప్తంగా ఉన్న ఆర్థిక మాంద్యం ప్రభావమే ఏపీలోనూ ఉందని చెప్పారు. చంద్రబాబు రూ.40వేల కోట్ల పాతబిల్లులు తమ నెత్తిన వదిలిపెట్టి వెళ్లారని, అవికాకుండా మరో రూ.20వేల కోట్ల సబ్సిడీలు చెల్లించాలని తెలిపారు. వాటన్నింటినీ సర్దుబాటు చేసుకుంటూ వ్యవస్థను చక్కదిద్దుకుంటూ వస్తున్నామన్నారు. చంద్రబాబు హయాంలో మూడు నెలల్లో 11 రోజులు ఓవర్ డ్రాఫ్టుకు వెళ్లగా వైకాపా ప్రభుత్వం 7 సార్లే వెళ్లిందన్నారు.

## పోస్టాఫీసు ఖాతాల్లో రూ.500 కనీస నిల్వ ఉంచాల్సిందే

**ఈనాడు డిజిటల్, అమరావతి:** పోస్టాఫీసు ఖాతాల్లో రూ.500 కనీస నిల్వను తప్పనిసరిగా ఉంచుకోవాలని ఏపీ సర్కిల్ ముఖ్య పోస్ట్ మాస్టర్ జనరల్ రామ్ సూచించారు. తపాలా కార్యాలయాలు, తపాలా బ్యాంకుల్లో పదేళ్లుగా లావాదేవీలు చేయని ఖాతాల వివరాలు తపాలాశాఖ తన వెబ్‌సైట్‌లో ఉంచిందని గురువారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఖాతాల్లో కనీస నిల్వ ఉండకపోతే ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం వార్షిక రుసుముగా ప్రతిఏటా రూ.100 మినహాయిస్తామని, ఈ మినహాయింపు తరువాత ఖాతాల్లో నిల్వ శూన్యమైతే వాటిని రద్దు చేస్తామని పేర్కొన్నారు.

## అనంతలో అమ్మకానికి ప్రభుత్వ భూములు

- కియాకు దగ్గరలోనే 490 ఎకరాలు

**ఈనాడు డిజిటల్, అనంతపురం:** అనంతపురం జిల్లాలో కియా కార్ల తయారీ పరిశ్రమ సమీపంలో ఉన్న 490 ఎకరాల ప్రభుత్వ భూమిని మిషన్ బిల్డ్ ఏపీ కింద అమ్మకానికి సిద్ధం చేశారు. జిల్లా మొత్తమ్మీద 11 బ్లాకుల్లో 566.51 ఎకరాల ప్రభుత్వ భూమి అమ్మకానికి సిద్ధంగా ఉన్నట్లు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు వెళ్లాయి. ఈ భూములన్నీ ప్రభుత్వ శాఖల ఆధీనంలో ఉన్నవే. గుంతకల్లులో ఘన చరిత్ర కలిగిన ఆంధ్రా కోఆపరేటివ్ స్పిన్నింగ్ మిల్లుకు చెందిన 21.36 ఎకరాలు కూడా ఈ జాబితాలో ఉన్నాయి. అనంతకు కియా కార్ల తయారీ పరిశ్రమ వచ్చిన తర్వాత ఆ ప్రాంతంలోని భూముల ధరలకు అమాంతం రెక్కలొచ్చాయి. పశు సంవర్థక శాఖ భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని గతంలో పెనుకొండలో భారీగా భూములు కేటాయించారు. ఇప్పుడు వాటిని మిషన్ బిల్డ్ ఏపీ కింద అమ్మకానికి సిద్ధంగా ఉన్న భూముల జాబితాలో చేర్చారు. మిగిలిన భూములు కూడా చాలా వరకు జాతీయ రహదారులను ఆనుకుని ఉన్నాయి. వాటి విలువ కూడా రూ.కోట్లలోనే ఉంది. ఈ భూములను విక్రయించడం ద్వారా వచ్చిన నిధులను సంక్షేమ పథకాలకు వినియోగించనున్నట్లు తెలుస్తోంది.

# పరిశ్రమలు తరలిపోతే ఉపాధి ఎలా?

- జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్

ఈనాడు – అమరావతి



పెట్టుబడిదారులను భయపెడితే రాష్ట్రానికి పెట్టుబడులు ఎక్కడి నుంచి వస్తాయని జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ ప్రశ్నించారు. నాయకుల ఫ్యాక్షన్ పోకడలతో రాష్ట్రానికి తీవ్ర నష్టం జరుగుతోందని, రాక రాక వచ్చిన కియా కార్ల కంపెనీ పక్క రాష్ట్రానికి తరలిపోయే పరిస్థితి దాపురించిందని అన్నారు. శంషాబాద్‌లో గురువారం కర్నూలు జిల్లా పాణ్యం నియోజకవర్గ జనసేన కార్యకర్తలతో సమీక్షలో పవన్ మాట్లాడారు. అంతకు ముందు ఓ ప్రకటన కూడా విడుదల చేశారు. వాటి సారాంశమిదీ 'రాష్ట్రంలోకి కొత్త పరిశ్రమలు రాకపోగా ఉన్న పరిశ్రమలు, సాఫ్ట్‌వేర్ సంస్థలు తరలిపోతున్నాయి. ఇలా అయితే ఉపాధి కల్పన ఎలా సాధ్యం? రాష్ట్రంలో కొత్త పరిశ్రమల స్థాపనకు సానుకూల వాతావరణాన్ని నెలకొల్పాలన్న విషయాన్ని ప్రభుత్వం విస్మరిస్తోంది. విశాఖపట్నంలోని మిలీనియం టవర్స్ నుంచి సాఫ్ట్‌వేర్ సంస్థలను ఖాళీ చేయించడమంటే ఆ రంగం ఇక ఆంధ్రప్రదేశ్ వైపు చూడకుండా చేయడమే. ప్రకాశం జిల్లాలో రూ.24 వేల కోట్లతో కాగితం పరిశ్రమ స్థాపిస్తామన్న ఏషియన్ పేపర్స్ అండ్ పల్స్ పరిశ్రమ మహారాష్ట్రకు తరలిపోయింది.

**భయం గుప్పిట్లో సీమ**

రాయలసీమ ప్రాంతం భయం గుప్పిట్లో బిగుసుకుపోయింది. ఇక్కడి నీరు పల్లం వైపు వెళ్లదు. బలవంతుడి పొలాలవైపే వెళుతుంది. రాయలసీమ నుంచి ఆరుగురు ముఖ్యమంత్రులు వచ్చినా ఈ ప్రాంతం ఎందుకు అభివృద్ధి చెందలేదో యువత ఆలోచించాలి. సీమలో నా పర్యటనకు లక్షల మంది తరలివచ్చారు. ఎన్నికలప్పుడు మాత్రం స్థానిక నాయకుల ఒత్తిడిని తట్టుకుని నిలబడలేకపోయారు.

**ప్రతీకార రాజకీయాలతో నష్టం**

ఆంధ్రప్రదేశ్ 13 జిల్లాల చిన్న రాష్ట్రం. ఇక్కడ ప్రాంతీయ విభేదాలు వస్తే అందరం నష్టపోతామనే మూడు రాజధానులపై స్పష్టమైన వైఖరి తెలియజేశాం. 2014లో కర్నూలులో రాజధాని ఏర్పాటు చేస్తామని తెలుగుదేశం ప్రభుత్వం ప్రకటిస్తే మద్దతు ఇచ్చేవాళ్లం. మూడు రాజధానులకు కేంద్రం అనుమతి తీసుకున్నట్లు వైకాపా నాయకులు చెబుతున్నారని నేను ఇటీవల కేంద్ర పెద్దలను అడిగితే అదేమీ లేదని స్పష్టం చేశారు. 2019 ఎన్నికల్లో జనసేనకు వచ్చిన ఓట్లను తక్కువగా అంచనా వేయొద్దు. సంక్షేమ పథకాల పేరుతో ఒకచేత్తో ఇచ్చి.. నిత్యావసరాల ధరలు పెంచి మరోచేత్తో తీసేసుకుంటున్నారని ప్రజలకు చెప్పాలి. రాయలసీమ మార్పునకు జనసేన తరఫున యువకులకు రాజకీయ శిక్షణ ఇస్తాం' అని పవన్ కల్యాణ్ చెప్పారు. కార్యక్రమంలో జనసేన పొలిట్‌బ్యూరో సభ్యులు అర్హంఖాన్, పాణ్యం నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జి చింతా సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## కాండ్యుయెంట్ తరలిపోతోందంటూ ప్రచారం

- నోటీసు రాలేదు.. వెళ్లడం లేదన్న సంస్థ ఇన్‌ఛార్జి

**ఈనాడు, విశాఖపట్నం:** అంతర్జాతీయ దిగ్గజ ఐటీ సంస్థల్లో ఒకటైన కాండ్యుయెంట్ సంస్థ విశాఖ నుంచి తరలిపోతోందని సామాజిక మాధ్యమాల్లో గురువారం విస్తృత ప్రచారం జరిగింది. విశాఖ శివారు మధురవాడలోని ఐటీ హిల్-3లో ఏపీఐఐసీ నిర్మించిన మిలీనియం టవర్లో ఇది కొనసాగుతోంది. రాష్ట్రప్రభుత్వం విశాఖను పాలనా రాజధానిగా చేయాలని భావిస్తున్న నేపథ్యంలో తాత్కాలిక సచివాలయాన్ని ఆ భవనంలోనే ఏర్పాటుచేస్తుందన్న ప్రచారం జోరుగా జరుగుతోంది. పలువురు రాష్ట్రప్రభుత్వ ఉన్నతాధికారులు పరిశీలించి వెళ్లారు. దీంతోపాటు మిలీనియం టవర్-ఎ పక్కనే టవర్-బి నిర్మాణానికి ప్రభుత్వం రూ. 19.73 కోట్లు మంజూరుచేసింది. తాజా పరిణామాలతో కాండ్యుయెంట్ ఉద్యోగులు తీవ్ర గందరగోళ పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. సంస్థ కార్యకలాపాల విస్తరణకు ఆ భవనంలో ఖాళీగా ఉన్న భాగాన్ని కేటాయించాలన్న ప్రతిపాదనకు ప్రభుత్వం నుంచి స్పందన రాలేదు. అయితే.. కాండ్యుయెంట్ కంపెనీకి ఎలాంటి నోటీసూ జారీ చేయలేదని, వారిని ఖాళీ చేయిస్తున్నామంటూ తప్పుడు ప్రచారం జరుగుతోందని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ వి.నాగేశ్వరరావు 'ఈనాడు'కు వెల్లడించారు. అలాగే తమకు రాష్ట్రప్రభుత్వం నుంచి ఎలాంటి నోటీసూ రాలేదని, తాము విశాఖ నుంచి వెళ్లడం లేదని కాండ్యుయెంట్ సంస్థ విశాఖ కేంద్రం ఇన్‌ఛార్జి మహేశ్ పేర్కొన్నారు.

## పరిశ్రమలు లేకపోతే ఆర్థిక వ్యవస్థ కుదేలు: సీపీఐ

**ఈనాడు, అమరావతి:** పారిశ్రామిక అభివృద్ధి లేకపోతే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ కుదేలవ్వడం ఖాయమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. కొత్త పరిశ్రమల ఏర్పాటుకు మెరుగైన అవకాశాలు కల్పించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఉన్న సంస్థలు తరలిపోయే విధంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. తీవ్ర కరవు కాటకాలతో అల్లాడుతున్న అనంతపురంలో దక్షిణ కొరియాకు చెందిన సంస్థ 'కియా' కార్ల తయారీ పరిశ్రమ నెలకొల్పిందని, కియా ప్రతినిధులు తమిళనాడు ప్రభుత్వంతో చర్చించినట్లు ప్రఖ్యాత వార్త సంస్థ రాయిటర్స్ కథనం ప్రచురించిందని పేర్కొన్నారు. కియా సంస్థ ఏపీలో తన ప్లాంటును విస్తరించాలేగాని, ఇతర రాష్ట్రాలకు తరలివెళ్లే పరిస్థితులు రావడం బాధాకరమన్నారు.

## ఏపీఎన్‌టీఎస్‌ఈ ఫలితాల్లో శ్రీచైతన్య హవా

**ఈనాడు, హైదరాబాద్:** కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఎన్‌టీఎస్‌ఈ పరీక్షల్లో శ్రీచైతన్య విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు తిరుగులేని ఫలితాలు సాధించారని ఆ విద్యాసంస్థల ఛైర్మన్ డా.బీఎస్ రావు, శ్రీ చైతన్య స్కూల్ అకడమిక్ డైరెక్టర్ సీమ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రం నుంచి 294 మంది విద్యార్థులు ఎంపికవ్వగా 227మంది శ్రీచైతన్యకు చెందిన వారేనని పేర్కొన్నారు. టాప్ 10 మార్కులు 36 మంది సాధించగా అందులో 26మంది తమవారే ఉన్నారని,..అలాగే అన్ని కేటగిరీల్లోనూ రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంకులను శ్రీ చైతన్య విద్యార్థులే కైవసం చేసుకున్నారని వివరించారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, అధ్యాపక బృందానికి అభినందనలు తెలిపారు.

## కేంద్రాన్ని సవాల్ చేస్తే 356 ఆర్టికల్ చూపిస్తాం

రాజ్యసభ సభ్యుడు జి.వి.ఎల్.నరసింహారావు

**ఈనాడు, దిల్లీ:** 'పౌరసత్వం అనేది కేంద్ర జాబితాలోని అంశం. పౌరసత్వ సవరణ బిల్లును పార్లమెంటు ఆమోదించిన తర్వాత శాసనసభలు దానికి వ్యతిరేకంగా తీర్మానం చేయడం సరైనది కాదు. ఇది ప్రజాస్వామ్యానికి ముప్పు' అని రాజ్యసభ సభ్యుడు జి.వి.ఎల్.నరసింహారావు అన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే చర్చలో గురువారం ఆయన మాట్లాడారు. కొత్త ప్రభుత్వాన్ని ఎవరైనా సవాల్ చేస్తే, వారికి ఆర్టికల్ 356 అంటే ఏమిటో తెలియజేస్తామన్నారు. విపక్ష నేత తన ప్రసంగంలో జమ్ము కశ్మీర్, గుజరాత్‌లను పోల్చడం సరికాదన్నారు. దక్షిణ భారతదేశానికి చెందిన ఓ సభ్యుడు ముస్లింలు 800 ఏళ్ల దేశాన్ని పాలించారని.. చార్మినార్, ఎర్రకోట కట్టారని అన్నారని.. అదంతా ఎవరి సొమ్మని ప్రశ్నించారు.

## ప్రభుత్వ నిర్ణయాన్ని మార్చలేరు: సజ్జల

**ఈనాడు, అమరావతి:** 'వికేంద్రీకరణ ఎలాగూ జరిగి తీరుతుంది. మీరెన్ని ఎత్తులు వేసినా, ఏం చేసినా రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని మార్చలేరు' అని ప్రతిపక్ష నేత చంద్రబాబుపై రాష్ట్రప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. 'ఈ నిర్ణయానికి ప్రజల, 151 మంది శాసన సభ్యుల మద్దతు ఉంది. చంద్రబాబు పక్కనున్న ఎమ్మెల్యేల్లో ఇద్దరి మద్దతూ ఉంది. ఇంకా చాలామంది ప్రభుత్వ నిర్ణయానికి మద్దతుగా వస్తున్నారు. కాబట్టి చంద్రబాబు ఏం చేసినా ఈ నిర్ణయాన్ని ఆపలేరు. మేమేమీ పొగరుతో చేయడం లేదు. ప్రజలు ఆహ్వానిస్తారని విశ్వసిస్తున్నాం' అన్నారు. గురువారం ఆయన వైకాపా కేంద్ర కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. 'రాజధానిపై పార్లమెంటులోనే కేంద్రం స్పష్టంగా చెప్పినా ఇంకా జనాన్ని మభ్యపెడుతూ చంద్రబాబు రాజకీయాలు చేస్తున్నారు. సీఏఏ, ఎన్ఆర్‌సీ, ఎన్‌పీఆర్‌లపై రాష్ట్రంలోని ముస్లిం, మైనారిటీలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పుడున్న రూపంలో ఎన్‌పీఆర్‌ను అంగీకరించం. ఎన్‌పీఆర్‌లో సేకరించే వివరాలను సీఏఏకు వర్తింపజేస్తామంటే అంగీకరించం' అని తెలిపారు.

# కేంద్ర మంత్రులు తప్పుదోవ పట్టించారు

- ప్రత్యేక హోదాపై ఆర్థిక సంఘాలు సిఫార్సు చేయలేదు: విజయసాయి

**ఈనాడు, దిల్లీ:** ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాపై కేంద్రమంత్రులు సభను తప్పుదోవ పట్టించారని వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డి ఆరోపించారు. ప్రత్యేక హోదాపై 14వ, 15వ ఆర్థిక సంఘాలు ఎలాంటి సిఫార్సులు చేయలేదని.. అయినా ఆ సంఘాలు అంగీకరించలేదని తప్పుదోవ పట్టించారన్నారు. విభజన హామీలు అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాల తీర్మానంపై విజయసాయిరెడ్డి మాట్లాడారు. రాష్ట్రంపై సవతి ప్రేమ చూపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రత్యేకహోదా కేంద్రం పరిధిలోనిదేనని ఆర్థిక సంఘాలు చెప్పాయని గుర్తుచేశారు. 15వ ఆర్థిక సంఘం 1971 జనాభా లెక్కలకు బదులుగా 2011 జనాభా లెక్కలు తీసుకోవడం వల్ల దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఏడు వెనకబడిన జిల్లాలకు రూ.1,050 కోట్లే ఇచ్చారని, మొత్తం రూ.24,350 కోట్లు రావాలని గుర్తుచేశారు.

**సీఎం జగన్‌ను కలవండి:** సమస్య పరిష్కారానికి ముఖ్యమంత్రి జగన్‌ను కలవాలని అమరావతి పరిరక్షణ సమితి నేతలు, రైతులకు వైకాపా ఎంపీ కృష్ణదేవరాయలు సూచించారు. గురువారం ఆయనకు సమితి నేతలు, రైతులు తమ సమస్యను వివరించారు. కాలయాపన చేయకుండా సీఎం జగన్‌ను కలిస్తే మంచిదని ఎంపీ తమకు సూచించారని సమితి సమన్వయకర్త ఆర్‌వీ స్వామి తెలిపారు.

# అమ్మ ఒడికి నిధులివ్వండి

- నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

**ఈనాడు, దిల్లీ:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలుచేస్తున్న అమ్మ ఒడి... నాడు-నేడు పథకాలకు కేంద్రం నిధులు సమకూర్చాలని నరసరావుపేట లోక్‌సభ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు కోరారు. లోక్‌సభ శూన్యగంటలో గురువారం ఆయన మాట్లాడారు. పాఠశాల రుసుములు ఎక్కువగా ఉండడంతో పేదలు చదువుకు దూరమవుతున్నారని, దీన్ని అధిగమించేందుకు అమ్మ ఒడి పథకం ద్వారా ఏటా రూ.15 వేల ఆర్థిక సహాయం చేస్తున్నట్లు తెలిపారు.

- ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా ఇవ్వాలని నరసాపురం ఎంపీ రఘురామకృష్ణరాజు కోరారు. రాష్ట్రానికి రూ.18వేల కోట్ల రెవెన్యూలోటు భర్తీచేయాల్సి ఉందని తెలిపారు. పోలవరం ప్రాజెక్టుకు రూ.3,500 కోట్లు బకాయిలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.
- ప్రతి రైలులో దివ్యాంగులకు రెండు బోగీలు కేటాయించాలని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి కోరారు. స్టేషన్లలో రైళ్లు రెండు-మూడు నిమిషాలకు మించి ఆగకపోవడంతో దివ్యాంగులు ఎక్కడం.. దిగడం కష్టమవుతోందన్నారు. ప్రతి రైలులో వారి కోసం ముందు ఒకటి, వెనక ఒక బోగీ ఏర్పాటుచేయాలని కోరారు.
- అనకాపల్లికి 2017లో కేంద్రీయ విద్యాలయం మంజూరైనా నేటికీ ప్రారంభం కాలేదని అనకాపల్లి ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి తెలిపారు. ఇక్కడ కేంద్రీయ విద్యాలయం లేక విద్యార్థులు విశాఖపట్నం, ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు.
- తెలుగు రాష్ట్రాల్లోని మిర్చి రైతులను ఆదుకోవాలని కేంద్రానికి కాంగ్రెస్ ఎంపీ కేవీపీ రామచంద్రరావు విజ్ఞప్తి చేశారు. గుంటూరు నుంచి రూ.5వేల కోట్ల విలువైన తేజ మిరప ఎగుమతి అవుతుందని, అందులో 60 % దిగుమతి చేసుకొనే చైనా .కరోనా వైరస్ వల్ల దిగుమతి ఆపేసిందన్నారు. ఎఫ్‌సీఐ ద్వారా మిర్చిని సేకరించి రైతుల్ని ఆదుకోవాలని కేవీపీ కోరారు.

**కేపీ ఉల్లి ఎగుమతులకు కేంద్రం ఆమోదం**

కేపీ ఉల్లి ఎగుమతులపై నిషేధాన్ని ఎత్తివేస్తూ కేంద్రప్రభుత్వం గురువారం నోటిఫికేషన్ విడుదల చేసింది. కేంద్రం నిర్ణయం పట్ల భారతీయ రైతుసంఘాల సమాఖ్య నేతలు, కేపీ ఉల్లి రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ నుంచి 10వేల టన్నుల ఎగుమతులకు కేంద్రం అనుమతినిచ్చింది. చెన్నై రేవు నుంచి మార్చి 31 వరకు ఎగుమతులను అనుమతిస్తామని స్పష్టం చేసింది.



## పింఛన్లు తీసేశారయ్యా!

మంత్రి బొత్సను నిలదీసిన మహిళలు

మేమంతా పేదోళ్లమయ్యా... మా పింఛన్లు, రేషన్‌కార్డులను అధికారులు తొలగించారంటూ పలువురు మహిళలు మంత్రి బొత్స సత్యనారాయణను నిలదీశారు. విజయవాడలో పలు అభివృద్ధి పనులను స్థానిక ఎమ్మెల్యే మల్లాది విష్ణు, వీఎంసీ కమిషనర్ ప్రసన్న వెంకటేష్‌తో కలిసి మంత్రి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజీవ్‌నగర్‌లో వృద్ధులు, మహిళలు బొత్స దగ్గరకు చేరుకొని ఆవేదన వ్యక్తం చేశారు. బొత్స స్పందిస్తూ కార్డులు, పింఛన్లను తొలగిస్తున్నట్లు కొందరు అపోహలు సృష్టిస్తున్నారని, అర్హులందరికీ లబ్ధి చేకూరుతుందని హామీ ఇచ్చారు.
–న్యూస్‌టుడే, విజయవాడ

## ప్రతి లోక్‌సభ నియోజకవర్గంలో ఆహారశుద్ధి జోన్లు

నాబార్డు క్రెడిట్ సదస్సులో సీఎం జగన్

**ఈనాడు, అమరావతి:** ప్రతి లోక్‌సభ నియోజకవర్గంలో ఆహార శుద్ధి జోన్లను ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి తెలిపారు. ఆ తర్వాత శాసనసభ నియోజకవర్గాల స్థాయిలోనూ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సచివాలయంలో గురువారం నాబార్డు నిర్వహించిన క్రెడిట్ సదస్సులో రాష్ట్ర దార్శనికపత్రం- 2020-21ను సీఎం విడుదల చేశారు. ఈ ఏడాది వ్యవసాయానికి రూ.1,34,402.52 కోట్లు, ప్రాథమిక రంగానికి రూ.2,11,865.38 కోట్లు రుణాలివ్వనున్నట్లు దార్శనికపత్రంలో నాబార్డు పేర్కొంది. సదస్సులో సీఎం మాట్లాడుతూ..''రాష్ట్రంలో 69 శాతం మంది రైతులకు హెక్టారు కంటే తక్కువ భూమే ఉంది. వీరికి రైతు భరోసా కింద ఏటా రూ.13,500 అందిస్తున్నాం. 80 శాతం వ్యవసాయ పెట్టుబడులు, వడ్డీలేని రుణాలు సమకూర్చుతున్నాం. పంటల బీమా ప్రీమియాన్నీ చెల్లిస్తున్నాం. రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేశాం. ఈ కార్యక్రమాలకు నాబార్డు సహకారం కావాలి. రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులు అందించి, వాటిని రైతు భరోసా కేంద్రాలకు అనుసంధానించాలి. చిరు వ్యాపారులకు క్రెడిట్ కార్డులిచ్చి, రూ.10 వేల చొప్పున రుణాలివ్వాలి. ప్రభుత్వమే వీటికి వడ్డీలు చెల్లిస్తుంది'' అని సీఎం తెలిపారు.

**పోలవరం జీవనాడి:** ''పోలవరం ప్రాజెక్టు రాష్ట్రానికి జీవనాడి. రూ.5 వేల కోట్లకుపైగా ఖర్చు చేస్తే దానిపై వడ్డీ సుమారు రూ.500 కోట్లకు పైగా కడుతున్నాం. సకాలంలో డబ్బులు రావడం లేదు. ఇప్పుడు ఇచ్చిన సుమారు రూ.1,800 కోట్లు కూడా ఇంకా అందలేదు. 2021 నాటికి ప్రాజెక్టు పూర్తి కావాలంటే పరిహారం, పునరావాసానికే ఏడాదికి రూ.10 వేల కోట్లు అవసరం. సివిల్ పనుల కోసం ఈ ఏడాదే రూ.6వేల కోట్లు కావాలి. ఈ ప్రాజెక్టుపై నాబార్డు ప్రత్యేక దృష్టి పెట్టాలి'' అని సీఎం కోరారు. నాబార్డు చీఫ్ జనరల్ మేనేజర్ సెల్వరాజ్ మాట్లాడుతూ.. రైతు భరోసా, వడ్డీలేని రుణాలు వంటివన్నీ అన్నదాతల ఆదాయాన్ని పెంచే కార్యక్రమాలని వెల్లడించారు. ప్రాథమిక రంగానికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

## విశాఖ నౌకాశ్రయంలో 'కరోనా' ఆంక్షలు

**ఈనాడు, విశాఖపట్నం, అమరావతి** కరోనా వైరస్ విస్తృతి పెరుగుతున్న నేపథ్యంలో విశాఖ నౌకాశ్రయ అధికారులు ఆంక్షలను మరింత కఠినతరం చేశారు. ఇక్కడికి వచ్చే నౌకల్లోని సిబ్బంది, విదేశీయులను నగరంలోకి అనుమతించడం లేదు. నౌకాశ్రయ వైద్యాధికారి ఆధ్వర్యంలో ప్రతిఒక్కరికీ వైద్య పరీక్షలను నిర్వహించి సంతృప్తి చెందాకే సరకు ఎగుమతి, దిగుమతులకు అనుమతిస్తున్నారు. అత్యవసరంగా వైద్యం అందించడానికి ప్రభుత్వ ఛాతి, అంటువ్యాధుల ఆసుపత్రితో ఒప్పందం చేసుకున్నారు.

**పుణేకు నమూనాలు:** కరోనా వైరస్ నేపథ్యంలో రాష్ట్రంలో ఐదుగురి నమూనాలను పుణేకు పంపించినట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి వెల్లడించారు. కరోనా విషయంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉందని వివరించారు.

## 'అమరావతి'లో రూ. 2046 కోట్ల పనులు

**ఈనాడు, దిల్లీ:** అమరావతి స్మార్ట్‌సిటీ పథకం కింద 20 ప్రాజెక్టులకు సంబంధించిన రూ.2,046 కోట్ల విలువైన పనులకు వర్క్‌ఆర్డర్లు జారీచేసినట్లు కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి హర్‌దీప్‌సింగ్ పూరీ తెలిపారు. గురువారం లోక్‌సభలో గుంటూరు జిల్లా ఎంపీలు గల్లా జయదేవ్, లావు శ్రీకృష్ణదేవరాయలు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు.

***తిరుపతి ఐఐఎస్ఈఆర్‌కు రూ.686 కోట్లు***

తిరుపతిలో నిర్మిస్తున్న ఐఐఎస్ఈఆర్ శాశ్వత ప్రాంగణ నిర్మాణానికి రూ. 686.43 కోట్లు ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వం అంగీకరించినట్లు మానవ వనరుల శాఖ మంత్రి రమేష్ పోఖ్రియాల్ తెలిపారు.

ఉద్యోగ అవకాశాలు

MALINENI PERUMALLU EDUCATIONAL SOCIETY'S GROUP OF INSTITUTIONS (Integrated Campus) | MALINENI LAKSHMAIAH WOMEN'S ENGINEERING COLLEGE
(Approved by AICTE, New Delhi & Affiliated to JNTUK, Kakinada)
Pulladigunta(V), Vatticherukuru (Md), Prathipadu Road, GUNTUR - A.P
WALK-IN INTERVIEW
Professors & Associate professors : CSE / IT / ECE
Assistant Professors : CSE / IT / ECE / EEE /CIVIL/Mechanical / B.Pharmacy / MBA/ Maths /Physics & Soft Skills
• Eligibility & Pay Scale : As per AICTE norms
• Programmers / Lab Technicians in all the above departments
Interested candidates may attend the walk-in interview along with a Resume / CV, Passport size photo, Aadhar card & Pan card in the above address.
Date & Time : 09-02-2020, Sunday, between 10.00 a.m to 4.00 p.m
for further information, Contact: Cell: 97031 44773, 63018 32695, e-mail: principal_7w@yahoo.com
Dr. M.Perumallu, Chairman

EXPLORE NEW DIMENSION TO YOUR CAREER
WANTED PRINCIPALS for DEGREE COLLEGES at NORTH ANDHRA and GODAVARI DISTRICTS
Qualified Candidates with Rich Experience in Academic & Administrative Wings.
Computer Science or any other Science Post Graduates preferable
Minimum Salary of Rs.50,000/- and for Maximum No Limit
Interested candidates have to send their resumes immediately by post / e-mail : career@aditya.ac.in
ADITYA DEGREE COLLEGE
H.O: Laxminarayananagar, KAKINADA-533 003.
Ph: 97043 76667, 79970 86667, 96181 76661

NARAYANA EDUCATIONAL INSTITUTIONS
WANTED the following personnel to work in different places in Andhra Pradesh and Telangana.
CIVIL ENGINEERS — Minimum work experience of 5 yrs. in building projects.
LAND SCAPE & GARDEN SUPERVISOR — Land Scape Horticulture Degree with minimum 5 yrs. of experience.
ARCHITECTS — Architects should work in construction, designing new School and College buildings, restoring and conserving old buildings and developing new ways of using existing buildings.
Salary commensurate with experience & skills
Interview Date : 8th & 10th February 2020, between 10.00 am & 5.00 pm (or)
e-mail : shivavarma00001@gmail.com
Plot No.9, Gayatri Heights, Opp. OYO Ashoka Hotel, 100 Feet Road, Ayyappa Society, Madhapur, TELANGANA. Ph : 99123 49813.

A for Appointments
ప్రత్యేక ధరకే 'ఈనాడు'లో ఉద్యోగ ప్రకటనలు
ఈనాడు
పటమటలంక, విజయవాడ
Cell: 80080 03297

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
రహదారులు మరియు భవనముల శాఖ
e-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
e-CTN. No. 4/EE (NH&CRF)/DEE3/AE/2018-19, తేది: 5-2-2020
సెంట్రల్ రోడ్ ఫండ్ స్కీం క్రింద పశ్చిమగోదావరి జిల్లాలో-1 మరియు తూర్పుగోదావరి జిల్లాలో-1 పనికొరకు మొత్తం 2 పనులకు e-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం ద్వారా ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. పనుల విలువ: రూ. 12.00 కోట్ల నుండి రూ. 25.00 కోట్ల మధ్యన (2వ పిలుపు). టెండర్ల స్వీకరణకు చివరి తేది: 25-2-2020 మ. గం. 3.30లకు. తదుపరి వివరాలు e-మార్కెట్ ప్రదేశం tender.apeprocurement.gov.in వద్ద చూడవచ్చును.
సం/- ఇంజినీర్-ఇన్-చీఫ్ (R&B) (NH&CRF)
DIPR No. 1842/CL/Advt/1/1/2019-20

స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానం
కాణిపాకం గ్రామం - ఐరాల మండలం - చిత్తూరు జిల్లా.
ఆర్.సి.నెం.యస్1/4949/2019 తేది: 06-02-2020
ఇ - ప్రొక్యూర్మెంటు టెండర్ ప్రకటన
స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానము, కాణిపాకం నందు ప్రసాదములు మరియు నైవేద్యములు తయారీ నిమిత్తము ది: 01-04-2020 నుండి 30-09-2020 వరకు (6 నెలలు) అవసరమైన బియ్యం, చక్కెర, శెనగపిండి, శెనగపప్పు, జీడిపప్పు, నెయ్యి, ఎండుద్రాక్ష, యాలకులు, కందిపప్పు మరియు ఇతర వస్తువులు సరఫరాచేయుటకు ఆసక్తిగల వారి నుండి "ఇ"- ప్రొక్యూర్మెంటు టెండర్ ద్వారా విడివిడిగా టెండర్లను ఆహ్వానించడమైనది. ఇతర వివరములకు బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ కొరకు www.tender.apeprocurement.gov.in లో apendowments marketing నందు చూడగలరు లేదా కార్యాలయము పనివేళల నందు సంప్రదించవలసిన ఫోన్ నెం: 08573-281747 ద్వారా లేదా 80194 20804, 79896 50069 ద్వారా తెలుసుకొనవచ్చును.
సం/- వి.దేముళ్ళు, కార్యనిర్వహణాధికారి మరియు సంయుక్త కమిషనరు.

మా చిరునామా: **రయ్ రయ్..** ఈనాడు ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, హైదరాబాద్ - 501512

# షోకిల్లా బళ్లు!

**ఆటో ఎక్స్‌పో 2020.. ఆసియాలోనే అతిపెద్ద వాహన ప్రదర్శన... కాన్సెప్ట్ కార్లు.. మెరుగులద్దిన బైక్‌లు.. అత్యాధునిక టెక్నాలజీ ట్రక్‌లు.. కనువిందు చేసేవెన్నో. ఎన్ని ఉన్నా అందులో టాక్ ఆఫ్‌ది టౌన్‌గా నిలిచేవి మాత్రం కొన్నే. స్టైల్‌తో, నమ్మశక్యంకాని ఫీచర్లతో భవిష్యత్తులో రోడ్డెక్కబోతున్న కొన్ని వాహనాల హొయలు చూద్దాం. వాటితోపాటు మూలపడ్డ వాహనాల్ని మేటి కళాకృతులుగా తీర్చిదిద్దిన కార్టిస్టుల ప్రతిభనూ చర్చిద్దాం.**

### కార్టిస్టులు ప్రత్యేక

ఈమధ్య కాలంలో పెద్దపెద్ద వాహన ప్రదర్శనలు ఎక్కడ జరిగినా అందరినీ ఆకట్టుకుంటున్నారు కార్టిస్టులు. కాలం చెల్లిన వాహనాలపైన చిత్రాలు చెక్కే కళాకారులే ఈ కార్టిస్టులు. రాజస్థాన్‌లోని జైపుర్ కేంద్రంగా ఉండే ఈ కార్టిస్టులు దేశమంతా విస్తరించారు. 2020 ఆటో-షో కోసమే కొత్తకొత్త కళాకృతుల్ని తీర్చిదిద్దారు. బొమ్మలేయడమే కాదు.. టైర్లు, రిమ్‌లు, ఇంజిన్.. ఇలా అన్ని విడిభాగాలతోనూ భిన్నమైన ఆకృతుల్ని తీర్చిదిద్దే నైపుణ్యం వీళ్ల సొంతం. కొందరైతే పాడైపోయిన పార్ట్స్‌తో సోఫా, టేబుల్‌లాంటి ఫర్నిచర్‌నీ తయారు చేసి ప్రదర్శిస్తున్నారు. పనికిరాని వస్తువంటూ ఏదీ లేదని చెప్పడం, వాహనాల్ని పర్యావరణహితంగా మార్చడమే మా ఉద్దేశమంటారు కార్టిస్టులు.



### ఇటలీ బండి.. ఇక్కడే



స్కూటరు ప్రేమికులకు ప్రీమియం కానుక ఏప్రిలియా ఎస్ఎక్స్ఆర్ 160. విండ్‌స్క్రీన్, ఎల్ఈడీ హెడ్‌ల్యాంప్‌లు, స్ప్లిట్ గ్లోవ్ బాక్స్, యూఎస్‌బీ ఛార్జింగ్, ఏబీఎస్, డ్యుయెల్ టోన్ ఎక్స్‌టీరియర్.. ఇలా ఫీచర్ల జాబితా పెద్దదే. నాలుగునెలల్లో అందుబాటులోకి వస్తోంది.

### వేగం వేగం..

ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన నాలుగు డోర్ల కూపె మెర్సిడెస్ ఏఎంజీ జీటీ 63ఎస్. గంటకి 315 కిలోమీటర్ల స్పీడ్‌తో దూసుకెళ్తుంది. 6 సిలిండర్ వీ8 ఇంజిన్‌తో పని చేస్తుంది. అత్యంత శక్తిమంతమైన 639 హార్స్‌పవర్ దీని సొంతం. కొనాలంటే రెండున్నర కోట్ల రూపాయలు వెచ్చించాల్సిందే. పన్నులు అదనం.

### మేళవింపు ఫీచర్లతో

భారతీయ నెంబర్‌వన్ కంపెనీ ప్రతిష్ఠాత్మకంగా తయారు చేస్తున్న ఎలక్ట్రిక్, హైబ్రిడ్ కారు మారుతీ ఫ్యూచరో-ఈ. స్పోర్ట్ యుటిలిటీ, కూపె రకాల్లోని మేటి ఫీచర్లను మేళవించి ఈ కొత్తరకం సెగ్మెంట్ తీసుకొస్తున్నారు. డిజైన్‌లో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. లోపల గుండ్రంగా తిరిగే ట్రావెల్ సీట్లు, రాజీపడని ఇంటీరియర్ సౌకర్యాలు.. విలాసానికి చిరునామాగా ఉండబోతోందీ కారు.

### చూపుతోనే పరుగు

చైనాకు చెందిన ఎలక్ట్రిక్ స్పోర్ట్ యుటిలిటీ వాహనం గ్రేట్ వాల్ హవాల్ విజన్ 2025. ఫేస్ రికగ్నిషన్, 5జీతో పని చేస్తుంది. దానంతటదే పార్క్ చేసుకుంటుంది. డ్రైవరు చేసే పనులలో ఇదే తొంభైశాతం చేసేస్తుంది. ఈ స్మార్ట్, ఇంటలిజెంట్ కారు స్టీరింగ్ పట్టుకోవాలంటే ఐదారేళ్లైనా ఆగాలి.



### ఐదు సెకన్లలో వంద

సీతాకోకచిలుక స్ఫూర్తితో, ఓపెన్ టాప్‌తో రూపొందించిన కాన్సెప్ట్ విద్యుత్తు కారు మహీంద్రా ఫన్‌స్టర్. ఒక్కసారి ఛార్జ్ చేస్తే 520 కిలోమీటర్ల వరకు ప్రయాణించొచ్చు. ఐదు సెకన్లలోనే వంద కిలోమీటర్ల వేగం అందుకుంటుంది. ఎక్స్‌యూవీ 500 డిజైన్‌ని పోలి ఉంటుంది.



### కాలుష్యానికి చెక్



రెనాల్ట్ కంపెనీ 'జీరో ఉద్గార కాలుష్య వాహన శ్రేణి' లక్ష్యానికి మొదటి అడుగు రెనాల్ట్ సింబియోజ్. రియర్ వీల్ కాన్ఫిగరేషన్, రెండు విద్యుత్తు మోటార్లతో పని చేస్తుంది. కావాల్సినప్పుడు ముడుచుకుపోయే డాష్‌బోర్డు, ఎటుకావాలంటే అటువైపు తిరిగే సీట్లున్నాయి. భవిష్యత్తులో దీన్ని డ్రైవరులేని కారుగా మార్చే ఆలోచనలో ఉంది రెనాల్ట్.

### వివరాలివి

**షో సమయం:** ఫిబ్రవరి 7- 12

**పాల్గొనేవి:** ప్రముఖ కార్ల, మోటార్‌సైకిళ్ల తయారీ సంస్థలు, విడిభాగాల తయారీ సంస్థలు, విద్యుత్తు వాహనాల స్టార్టప్ కంపెనీలు.

**ప్రదర్శన:** వందకుపైగా కార్లు, పదుల సంఖ్యలో బైక్‌లు, ఇతర వాహనాలు.

**వేదిక:** దిల్లీ సమీపంలోని గ్రేటర్ నోయిడా ఎక్స్‌పో మార్ట్

**నిర్వాహకులు:** సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫ్యాక్చరర్స్ (సియామ్), ఆటోమోటివ్ కాంపోనెంట్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (ఏసీఎంఏ), కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ)లు.

**ప్రవేశం:** బుక్ మై షోలో టికెట్లు లభ్యం.

2020 AUTO EXPO THE MOTOR SHOW 7 - 12 FEBRUARY 2020



### నేలపైనా, నీటిలోనూ

డూన్ బగ్గీ కాన్సెప్ట్‌తో తయారైన రెండు సీట్ల బండి హ్యుందాయ్ కైట్. దీన్నే నీటిపై పయనించే సింగిల్ సీటు బోటుగానూ మార్చుకోవచ్చు. కొన్నాళ్లలో పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చే ఈ సరికొత్త వాహనాన్ని ఇటలీలోని ప్రతిష్ఠాత్మక యూరోపియా డి డిజైన్ (ఐఈడీ)లో తీర్చిదిద్దుతున్నారు.

# విహారి



**ఓ పక్క భక్తి భావాలు.. ఆ చెంతనే వింత వైఖరులు.. ముక్తి కోసం వచ్చేవాళ్లుంటారు.. భుక్తి కోసం వస్తుంటారు.. విశ్వాసం కొందరిదైతే.. ఉత్సాహం ఎందరిదో! మరెన్నో అనుభూతుల సమాహారం జాతర. చీకట్లోనూ చిత్రమైన రంగులు చూపిస్తాయి తిరునాళ్లు!! శివరాత్రి సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లో జాతరల జోరు మొదలవుతోంది. హాలాహలధారుడి సన్నిధానాలన్నీ కోలాహలానికి వేదికలవుతున్నాయి. అందులో మీరూ భాగమవ్వండి.**

## శివయ్యా వస్తామయా!

### మల్లన్నా.. వస్తున్నామన్నా: కొమురవెల్లి, సిద్దిపేట

తెలంగాణలో కొమురవెల్లి జాతర ప్రత్యేకమైంది. మూడు నెలల పాటు జరిగే ఉత్సవం.. శివరాత్రి నాటికి పతాక స్థాయికి చేరుకుంటుంది. సిద్దిపేట జిల్లా కేంద్రానికి 20 కి.మీ. దూరంలో ఉంటుంది కొమురవెల్లి. ఈ క్షేత్రంలో కొలువుదీరిన కోర మీసం మల్లన్న దర్శనానికి వేలమంది తరలి వస్తారు. మల్లన్న జాతరలో పల్లె పదాలు పల్లవిస్తాయి. భక్తులంతా బృందాలుగా భజనల్లో మునిగిపోతారు. ఒగ్గు కథలు వింటూ కాలక్షేపం చేస్తుంటారు. జాతరలో పట్నం వేడుక ఘనంగా సాగుతుంది. పంచవన్నెలతో రంగవల్లులు వేస్తారు. అందులోకి మల్లన్న వస్తాడని విశ్వసిస్తారు. మహాశివరాత్రి సందర్భంగా 'పెద్దపట్నం' వేడుక జరుగుతుంది. పట్నంలో వాడిన రంగులు, పసుపు, కుంకుమ ఇళ్లకు తీసుకెళ్తే మంచి జరుగుతుందని నమ్మకం. జాతరలో అంగళ్ల సందడి అంతా ఇంతా ఉండదు. కనకాన్ని తలదన్నె వన్నెలీనుతూ గిల్టు సరుకు బారులు తీరుతుంది. గాజులు, చెవి దుద్దులు, మాటీలు, గొలుసులు ఒకటేమిటి.. రకరకాలు. చిరుతిళ్ల సందడి దీనికి రెండింతలు ఉంటుంది. ఆటపాటల ముచ్చట్లు ఇంతకుమించి సాగిపోతాయి. ఇవన్నీ ఆస్వాదిస్తూ శివరాత్రి జాగారం చేస్తారు.

**చేరుకునేదిలా:** కొమురవెల్లి హైదరాబాద్‌కు సుమారు 90 కి.మీ. దూరంలో ఉంటుంది. హైదరాబాద్ నుంచి సిద్దిపేట వెళ్లే దారిలో రహదారికి 3 కి.మీ. లోనికి ఉంటుంది. జూబ్లీ బస్ స్టేషన్ నుంచి ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు గంటకో బస్ ఉంటుంది. సిద్దిపేట, కరీంనగర్ బస్సులు ఎక్కితే.. రాజీవ్ రహదారిపై కొమురవెల్లి స్వాగత తోరణం దగ్గర దిగి.. ఆటోల్లో ఆలయం దాకా వెళ్లొచ్చు.

– శీలం చంద్రమౌళి, చేర్యాల





### ప్రకృతి జాతర: మహేంద్రగిరి, శ్రీకాకుళం

ఆంధ్రప్రదేశ్, ఒడిశా సరిహద్దులో శ్రీకాకుళం జిల్లా మందస మండలం సింగుపురం సమీపంలో ఉంటాయి మహేంద్రగిరులు. ఈ కొండల్లో పురాతన ఆలయాలు ఉన్నాయి. పంచపాండవులు వీటిని నిర్మించారని చెబుతారు. శివరాత్రి ఉత్సవానికి తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ నుంచి భక్తులు ఇక్కడికి తరలి వస్తారు. వ్యయప్రయాసలకోర్చి శివరాత్రికి ముందు రోజే గిరిపైకి చేరతారు. భజనలు, సంకీర్తనలతో రాత్రంతా జాగారం చేస్తారు. మర్నాడు శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేసి తిరుగు ప్రయాణమవుతారు.

**చేరుకునేదిలా:** శ్రీకాకుళం, ఇచ్ఛాపురం నుంచి బస్సుల్లో మందస చేరుకోవాలి. అక్కడ నుంచి ఇతర వాహనాలు, బస్సుల్లో రాజబస వరకు చేరుకోవచ్చు. రాజబస నుంచి 12 కి.మీ. నడిచి గిరికి చేరుకుంటారు. రైళ్లలో ప్రయాణించేవారు పలాసలో దిగి బస్సుల్లో మందస, అక్కడి నుంచి రాజబసకు చేరుకోవచ్చు.

– సూరకాసుల వెంకటరమణ, కాశీబుగ్గ

### ప్రభల కోటయ్య: కోటప్పకొండ, గుంటూరు

మహాశివరాత్రి వచ్చిందంటే కోటప్పకొండ తిరునాళ్ల గురించి మాట్లాడాల్సిందే! ప్రభల వైభవం గురించి చెప్పుకోవాల్సిందే!! గుంటూరు జిల్లాలో ఉంటుంది కోటప్పకొండ. ఇక్కడి త్రికూటాచలంపై కొలువుదీరిన త్రికోటేశ్వరస్వామికి కృతజ్ఞతగా శివరాత్రికి తిరునాళ్లు నిర్వహిస్తారు. కొండ చుట్టూ కొండంత ఉత్సాహంతో సాగే తిరునాళ్లు ఇవి. పరిసర పల్లెల్లో కనిపిస్తుందా సందడి. పక్క రాష్ట్రాల్లోనూ వినిపిస్తుందీ వైనం గురించి. శివరాత్రికి నెల రోజుల ముందు నుంచే ప్రభల నిర్మాణం మొదలవుతుంది. కులమతాలకు అతీతంగా అందరూ కలిసి ప్రభను కోటప్పకొండకు తరలిస్తారు. ఎండ్ల బండిపై తీసుకొచ్చే సమయంలో ప్రభ ఒరిగిపోవడం, ఇరుసులు విరిగిపోవడం వంటివి ఎదురైనా వెనకడుగు వేయరు యువకులు. ప్రభకు ఇరువైపులా తాళ్లు కట్టి పడిపోకుండా నియంత్రిస్తారు. విద్యుద్దీపాలు చుట్టుకొని వెలిగిపోతున్న ప్రభలు.. పండగ నాటికి కోటప్పకొండ పాదాల చెంతకు చేరుకుంటాయి. వందల్లో ప్రభలు.. వేలల్లో ప్రభలు.. వాటి వెంట లక్షల్లో జనం. అసలు సంబరం అప్పుడు మొదలవుతుంది. కొండ చుట్టూ తాత్కాలిక దుకాణాలు ఇబ్బడిముబ్బడిగా వెలుస్తాయి. కోరుకున్న వస్తువు చిటికెలో అందుతుంది. తీన్మార్ డప్పులు కాలు నిలువనియ్యవు. లంగా ఓణీలో వచ్చే తరుణులు చూపు తిప్పుకోనివ్వరు. రాత్రయితే దీపాల వెలుగులు.. చీకట్లో దాగున్న అందాలు చూపుతాయి. ఆటపాటలతో పండగ శోభ అమాంతంగా పెరిగిపోతుంది. శివరాత్రి కోటయ్యస్వామిని దర్శించుకొని.. రాత్రంతా జాగరణ చేసి తిరిగి ప్రభతో పాటు గ్రామానికి చేరుకోవడంతో తిరునాళ్లు ముగుస్తాయి.

**చేరుకునేదిలా:** కోటప్పకొండ.. నరసరావుపేట నుంచి 9 కి.మీ. దూరంలో ఉంటుంది. విజయవాడ, గుంటూరు నుంచి నరసరావుపేట వెళ్లి కోటప్పకొండకు చేరుకోవచ్చు.

– కరి పూర్ణచంద్రరావు, నరసరావుపేట అర్బన్

**దిక్సూచి**

## ఎంత సేపుంటే అంతే!

యాత్రకయ్యే ఖర్చులో సింహభాగం బసకే చెల్లించాల్సి వస్తుంది. హోటల్‌లో దిగగానే 'రోజుకు ఇంత..' అనే మాట వినిపిస్తుంది. అద్దె ఎక్కువైనా ఊరు కాని ఊరులో చేసేదేం లేక గదిలో దిగుతారు. ఉదయం స్నానపానాదులు పూర్తయ్యాక హోటల్ గది నుంచి బయటకు వస్తే.. విహారమంతా పూర్తయి వెళ్లే సరికి ఏ రాత్రో అవుతుంది. రోజంతా గదిలో లేకున్నా.. అద్దె మాత్రం పూర్తిగా చెల్లించాల్సిందే! ఈ సమస్యకు పరిష్కారం చూపారు హైదరాబాద్‌కు చెందిన నిఖిల్‌రెడ్డి గుర్రాల. శరత్, నిహాల్ రెడ్డి, మేఘనా కొలన్ బృందంతో కలిసి పర్యాటకులకు ఉపయుక్తంగా ఉండేలా పోబైట్ (pobyt) యాప్‌ను రూపొందించారు. ఈ యాప్ సాయంతో మీకెంత సమయం కావాలంటే అంతసేపే గది బుక్ చేసుకోవచ్చు. గదిలో ఉన్నంత సమయానికే అద్దె చెల్లించొచ్చు. కనీసం మూడు గంటలు బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. నాలుగైదు గంటలు బుక్ చేసుకొని.. అవసరాలు తీర్చుకొని మళ్లీ విహారానికి వెళ్లిపోవచ్చు. పోబైట్ సేవలు ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, బెంగళూరు నగరాల్లో అందుబాటులో ఉన్నాయి త్వరలో చెన్నైతో పాటు మరిన్ని పర్యాటక కేంద్రాల్లోనూ అందుబాటులోకి రానున్నాయి. విహారంలోనే కాదు.. అత్యవసరంగా ఏదైనా పార్టీకి వెళ్లాల్సి వస్తే తయారవ్వడానికీ, విశ్రాంతి తీసుకోవడానికీ పోబైట్‌లో గదులు బుక్ చేసుకోవచ్చు.




**బుక్‌నౌ**

## గంగా యమునల చుట్టూ..

ఆధ్యాత్మిక ఆనందం కోరుకునే వారి కోసం భారతీయ రైల్వే టూరిజం, క్యాటరింగ్ సంస్థ (ఐఆర్‌సీటీసీ) గంగా-యమున యాత్రకు పచ్చజెండా ఊపింది. ఈ యాత్రలో గంగా, యమున తీరాన ఉన్న పుణ్యధామాలు దర్శించుకోవచ్చు. రేణిగుంట నుంచి మొదలయ్యే భారత్ దర్శన్ రైలు.. నెల్లూరు, ఒంగోలు, విజయవాడ, గుంటూరు, నల్గొండ, కాచిగూడ, కాజీపేట, రామగుండం స్టేషన్లలో యాత్రికులను ఎక్కించుకుంటుంది.

**ఎప్పుడు?:** ఫిబ్రవరి 25 (24 అర్ధరాత్రి 12.05 గంటలకు)

**ఎన్ని రోజులు?:** 10 రాత్రులు- 11 పగళ్లు

**చూపించే ప్రదేశాలు:** ఆగ్రా, మథుర, దిల్లీ, హరిద్వార్, ప్రయాగ్‌రాజ్, వారణాసి, గయ

**ప్యాకేజీ ధర:** స్లీపర్ క్లాస్ రూ. 10,395, ఏసీ త్రీ టైర్ రూ. 12,705

**సంప్రదించాల్సిన ఫోన్‌నెంబర్లు:**
**హైదరాబాద్:** 040 27702407, 82879 32227/28/29/30
**విజయవాడ:** 0866 2572280, 82879 32311/12
**తిరుపతి:** 0877 2222010, 82879 32313/17

**మరిన్ని వివరాలకు:** www.irctctourism.com వెబ్‌సైట్‌ని చూడండి.



# రాజమౌళి X శంకర్

దేశం గర్వించే దర్శకుల్లో శంకర్, రాజమౌళి పేర్లు తప్పకుండా ఉంటాయి. 'జెంటిల్‌మేన్', 'భారతీయుడు', 'ఒకే ఒక్కడు', 'రోబో' లాంటి చిత్రాలతో శంకర్ సృష్టించిన సంచలనం అంతా ఇంతా కాదు. సాంకేతిక హంగులు అద్దుతూనే, సామాజిక చైతన్యం నిండిన అంశాల్ని కథలుగా ఎంచుకుని, బాక్సాఫీసుని జయించారు. రాజమౌళి కూడా అంతే. సాంకేతిక నైపుణ్యాన్ని వాడుకుని, కమర్షియల్ చిత్రాన్ని ఎంత అందంగా ముస్తాబు చేయొచ్చన్న కిటుకుని భలేగా కనిపెట్టేశారు. వీళ్ల సినిమాల గురించి దేశం మొత్తం ఆసక్తిగా ఎదురు చూస్తుంటుంది. రాబోయే సంక్రాంతికి వీరిద్దరి చిత్రాలూ బాక్సాఫీసు దగ్గర ఢీ కొట్టబోతున్నాయి. రాజమౌళి, శంకర్ చిత్రాలు ఒకే సీజన్‌లో విడుదల కావడం ఇదే తొలిసారి.

ఎన్టీఆర్, రామ్‌చరణ్‌లతో రాజమౌళి 'ఆర్ ఆర్ ఆర్' చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. జనవరి 8న విడుదల చేస్తున్నట్టు ఇది వరకే చిత్రబృందం ప్రకటించింది. అంటే 2021 సంక్రాంతికి రాజమౌళి ముందుగానే కర్చీఫ్ వేసుకున్నారన్నమాట. రాజమౌళి సినిమా వస్తుందంటే, ఆ సీజన్‌లో మిగిలిన చిత్రాలకు అంతగా స్థానం లేనట్టే. సంక్రాంతికి రావాలని నిర్ణయించుకున్న కొన్ని చిత్రాలు ఇప్పుడు వెనక్కో, ముందుకో వెళ్లే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే ఇదే సీజన్‌లో శంకర్ సినిమా కూడా వస్తోంది. కమల్‌హాసన్‌తో రూపొందిస్తున్న 'భారతీయుడు 2'ని సంక్రాంతి బరిలో నిలిపారు శంకర్. జనవరి 14న ఈ చిత్రం విడుదలయ్యే అవకాశాలున్నాయి. అంటే రానున్న ముగ్గుల పండగ రాజమౌళి, శంకర్‌ల బలాబలాలకు, నైపుణ్యాలకు పరీక్ష అన్నమాట. దర్శకులుగా రాజమౌళి, శంకర్‌ల స్థాయి తెలియంది కాదు. వీళ్ల సినిమా అంటే బాక్సాఫీసు హోరెత్తిపోతుంది. థియేటర్లన్నీ నిండిపోతాయి. వీరి సినిమాలు వారం రోజుల వ్యవధిలో వస్తుండటంతో థియేటర్లు కళకళలాడనున్నాయి. మిగిలిన సినిమాల మాటెలా ఉన్నా, ఈ రెండు చిత్రాలపైనే పరిశ్రమ దృష్టి ఉంటుంది. ఈ రెండూ పాన్ ఇండియా చిత్రాలు. వీటి మధ్య జరిగే పోటీ ఎలా ఉండబోతోందో తెలియాలంటే ఇంకొన్ని రోజులు ఆగాలి.


రాజమౌళి


శంకర్


వినయ్, మున్నా, ఎస్వీ బాబు, ప్రదీప్, అమృత, చంద్రబోస్

# మహేష్‌బాబు వల్లే ఇదంతా

ప్రదీప్ మాచిరాజు కథానాయకుడిగా పరిచయమవుతున్న చిత్రం '30 రోజుల్లో ప్రేమించటం ఎలా?'. అమృతా అయ్యర్ నాయిక. మున్నా దర్శకుడు. ఎస్వీ బాబు నిర్మాత. హైదరాబాద్‌లో పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేశారు. సంగీత దర్శకుడు అనూప్ రూబెన్స్ మాట్లాడుతూ "మంచి కథ దొరికితే, పాటలు కూడా మంచివే వస్తాయి. 'నీలి నీలి ఆకాశం' పాటకు ఇంత స్పందన వస్తోందంటే ఆ గొప్పతనం నా ట్యూన్‌ది ఒక్కటే కాదు.. ఆ పాటని గొప్పగా రాసిన చంద్రబోస్‌ది కూడా. సిద్ శ్రీరామ్, సునీత తమ గాత్రంతో పాటకు ప్రాణం పోశార"న్నారు. చంద్రబోస్ మాట్లాడుతూ "ఇంత మంచి పాటలో నేను భాగస్వామినే కాకుండా, భావస్వామిని అవ్వడం సంతోషంగా ఉంది. బాలసుబ్రహ్మణ్యంగారు 'నీ కీర్తి కిరీటంలో ఇదో కలికితురాయి' అని మెచ్చుకున్నార"న్నారు. దర్శకుడు మాట్లాడుతూ "ఈ పాటని ముందుగా చూసింది మహేష్ బాబు. ఇప్పుడొస్తున్న స్పందన మొత్తం ఆయన మొహంలోనే చూసేశామ"న్నారు. ప్రదీప్ మాట్లాడుతూ "ఈ పాటకు ఇంత ప్రచారం లభించడానికి కారణం మహేష్‌బాబు. ఆయన చేతుల మీదుగా ఈ పాట విడుదలైంది. అందుకే ఇంతటి ఆదరణ దక్కింది. త్వరలోనే చిత్రాన్ని విడుదల చేస్తామ"న్నారు. "ఈ పాటకు ఇంత స్పందన వస్తుందని అనుకోలేదన్నారు నిర్మాత. ఈ కార్యక్రమంలో సునీత, హేమ, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

# 'స్పార్టకస్' నటుడు కిర్క్ డగ్లస్ ఇక లేరు

ప్రఖ్యాత హాలీవుడ్ నటుడు, 'స్పార్టకస్' చిత్రంతో ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న కిర్క్ డగ్లస్(103) ఇక లేరు. వయోభారంతో ఆయన గురువారం కన్నుమూశారు. ఈ విషయాన్ని కిర్క్ కుమారుడు, ప్రముఖ నటుడు మైఖేల్ డగ్లస్ ఓ ప్రకటనలో తెలిపారు. 1916లో న్యూయార్క్‌లో జన్మించారు కిర్క్. ఆయన అసలు పేరు ఇస్సుర్ డేనియెలొవిచ్. రంగస్థల నటుడిగా ప్రస్థానం ప్రారంభించారు. 1946లో 'ది స్ట్రేంజ్ లవ్ ఆఫ్ మార్త ఐవర్స్'తో తెరకు పరిచయం అయ్యారు. 'ఛాంపియన్'లో బాక్సర్‌గా నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. 'డిటెక్టివ్‌స్టోరీ', 'పాత్స్ ఆఫ్ గ్లోరీ', 'లోన్లీ ఆర్ ది బ్రేవ్' లాంటి చిత్రాలతో ఆయన పేరు మార్మోగిపోయింది. చారిత్రక నేపథ్య చిత్రం 'స్పార్టకస్'లో రోమన్ బానిసల నాయకుడిగా కిర్క్ అద్భుతమైన నటన ప్రదర్శించారు. ఆరు దశాబ్దాల సినీ ప్రస్థానంలో సుమారు 90 చిత్రాల్లో నటించారు కిర్క్. సొంతంగా సినిమాలు నిర్మించారు. 'ఛాంపియన్', 'బ్యాడ్ అండ్ ది బ్యూటిఫుల్', 'లస్ట్ ఫర్ లైఫ్' చిత్రాలతో ఉత్తమ నటుడిగా ఆస్కార్ నామినేషన్లు అందుకున్నారు. 50 ఏళ్ల పాటు సినీరంగానికి చేసిన సేవలకుగానూ 1996లో ఆస్కార్ అకాడెమీ ఆనరరీ పురస్కారంతో కిర్క్‌ను గౌరవించింది. కిర్క్ కుమారుడు మైఖేల్ డగ్లస్ నటుడిగా ఆస్కార్ అవార్డు అందుకున్నారు.


కిర్క్ డగ్లస్

# ప్రేమికుడు హంతకుడిగా ఎందుకు మారాడు?

ఆదిత్య రాయ్ కపూర్, దిశా పటానీ, అనిల్ కపూర్, కునాల్ ఖేము ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'మలంగ్'. 'ఆషికి 2', 'ఏక్ విలన్' చిత్రాలతో మెప్పించిన మోహిత్ సూరి ఈ సినిమాను తెరకెక్కించారు. టీ సిరీస్ పతాకంపై భూషణ్ కుమార్ నిర్మించారు. శుక్రవారం ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా ఈ సినిమా విశేషాలివీ.

కత్రినా కైఫ్, శ్రద్ధా కపూర్ లాంటి అగ్ర నాయికలతో కలిసి నటించినా, 'కళంక్' లాంటి మల్టీస్టారర్ చిత్రంలో కనిపించినా ఆదిత్య రాయ్ కపూర్‌కు ఇటీవల సరైన విజయాలు దక్కలేదు. అందుకే ఇప్పుడు వస్తున్న 'మలంగ్'పై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. 'ఆషికి 2'తో తనకు విజయాన్ని అందించిన మోహిత్ సూరి ఈ చిత్రానికి దర్శకుడు కావడమే అందుకు కారణం. ఇందులో దిశా పటానీతో తొలిసారి కలిసి నటించారు ఆదిత్య. రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ చిత్రాన్ని ఎక్కువ భాగం గోవాలో చిత్రీకరించారు. ట్రైలర్‌లో గోవా బీచ్ అందాలు, బికినీలో దిశా గ్లామర్ ప్రేక్షకులను ఆకర్షిస్తున్నాయి. సినిమా కూడా అదే స్థాయిలో ఆకట్టుకుంటుందని చిత్రబృందం చెబుతోంది.

విడుదలకు సిద్ధం



'మలంగ్'

## కథేంటి

కొత్త ప్రదేశాలు చుట్టేయడం అద్వైత్ ఠాకూర్‌కు (ఆదిత్య) ఇష్టం. అలా గోవా వెళ్తాడు. అక్కడ సారా (దిశా) పరిచయమవుతుంది. ఎలాంటి బాధ్యతలు, బంధాలు లేకుండా తనకు నచ్చినట్లు బతికేయడం సారాకు ఇష్టం. అద్వైత్, సారా ఒకరినొకరు ఇష్టపడతారు. గోవా మొత్తం కలిసి తిరిగేస్తూ ఆనందంగా గడుపుతుంటారు. అయితే వారి జీవితాల్లో ఊహించని సంఘటన జరుగుతుంది. ఐదేళ్ల తర్వాత అద్వైత్ కొంతమందిని వరుసగా చంపుతుంటాడు. అతణ్ని అడ్డుకోవడానికి పోలీస్ అధికారులు ఆంజనేయ్ అఘసే (అనిల్ కపూర్), మైఖేల్ (కునాల్) రంగంలోకి దిగుతారు. అద్వైత్, సారా జీవితాల్లో ఏం జరిగింది? అద్వైత్ చంపుతున్నది ఎవరిని? అనే విషయాలను తెరపై చూడాలి.

# పేర్లు దొరికాయా!

సినిమాకి పేరు పెట్టడం కూడా ఓ కళే. టైటిల్‌తో ప్రేక్షకుల్లో ఆసక్తి రేకెత్తించాలి. కథనీ, అందులోని కథానాయకుడి పాత్రనీ చూచాయగా పరిచయం చేయాలి. సినిమాలో ఉన్న కొత్తదనాన్నీ పేరుతోనే రుచి చూపించాలి. అందుకే టైటిల్ విషయంలో చిత్రబృందం తర్జనభర్జనలు పడుతుంటుంది. కొంత మంది సినిమాకి పేరు పెట్టే కథ రాస్తారు. కొబ్బరి కాయ కొట్టేముందే పేరు ప్రకటించేస్తారు. ఇంకొన్నిసార్లు చివరి వరకూ పేరు దాస్తారు. అగ్ర కథానాయకుల చిత్రాలకు పేర్లు పెట్టకపోతే, ఏవేవో టైటిళ్లు బయట ప్రచారంలోకి వచ్చేస్తుంటాయి. వాటి ధాటికి తట్టుకోలేక చిత్రబృందమే అధికారికంగా పేరు ప్రకటించేస్తుంటుంది. ప్రస్తుతం చిరంజీవి, పవన్‌కల్యాణ్, ప్రభాస్ చిత్రాల టైటిల్స్ విషయంలోనూ ఇదే జరుగుతోంది. ఆయా చిత్రాలకు సంబంధించి కొన్ని పేర్లు బయట ప్రచారంలో ఉన్నాయి. చిత్రబృందం కూడా వాటినే ఖరారు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.




చిరంజీవి కథానాయకుడిగా కొరటాల శివ దర్శకత్వంలో ఓ చిత్రం రూపుదిద్దుకుంటోంది. త్రిష నాయిక. ఈ చిత్రానికి 'గోవింద ఆచార్య' అనే పేరు పెట్టినట్టు ప్రచారం జరిగింది. అభిమానులు కూడా చిరు చిత్రానికి ఈ పేరే పెట్టారని భావించారు. అయితే చిత్రబృందం మాత్రం 'మేం ఇంకా టైటిల్ ఖరారు చేయలేద'ని చెప్పింది. అయితే ఇప్పుడు 'ఆచార్య' అనే పేరుని ఫిల్మ్‌ఛాంబర్‌లో రిజిస్టర్ చేసినట్టు సమాచారం. మణిశర్మ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోనే చిత్రీకరణ జరుగుతోంది.




ప్రభాస్ కథానాయకుడిగా యూవీ క్రియేషన్స్, గోపీకృష్ణా ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థలు ఓ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. రాధాకృష్ణ దర్శకుడు. ఈ చిత్రానికి 'జాన్' అనే పేరు పరిశీలనలో ఉంది. అయితే ఇప్పుడు ఆ పేరు మారనుందని తెలుస్తోంది. ఆ స్థానంలో 'ఓ డియర్' అనే పేరు పెట్టాలన్న ఆలోచనలో చిత్రబృందం ఉందని తెలుస్తోంది. 'రాధే శ్యామ్' అనే మరో పేరు కూడా ప్రచారంలోకి వచ్చింది. పూజా హెగ్డే కథానాయిక. అలనాటి బాలీవుడ్ అందాల తార భాగ్యశ్రీ కీలక పాత్ర పోషిస్తున్నారు. 2021 వేసవిలో ఈ చిత్రం విడుదల కానుంది.




పవన్ కల్యాణ్ 'పింక్' రీమేక్ ఈమధ్యే పట్టాలెక్కింది. వేణు శ్రీరామ్ దర్శకత్వం వహిస్తున్నారు. మే 14న ఈ చిత్రాన్ని విడుదల చేస్తారు. ఈ సినిమా కోసం 'లాయర్ సాబ్', 'వకీల్ సాబ్' అనే రెండు పేర్లు పరిశీలనలో ఉన్నాయి. 'వకీల్ సాబ్' అనే పేరుని చిత్రబృందం ఇటీవలే ఫిల్మ్ ఛాంబర్‌లో నమోదు చేసింది. దాన్ని బట్టి పవన్ సినిమాకి ఈ పేరే ఖాయమైందనుకోవచ్చు. అయితే టైటిల్ విషయంలో దర్శక నిర్మాతల ఆలోచనలు వేరుగా ఉంటాయి. తమ కథకు అనుగుణమైన పేర్లన్నీ, ఎందుకైనా మంచిదన్న ఉద్దేశంతో ముందుగానే నమోదు చేయించుకుంటారు. ఈలోగా కొత్త పేరేమైనా తడితే, మార్చడానికి సిద్ధపడతారు. మరి ఈ మూడు చిత్రాలకు సంబంధించిన టైటిల్స్ విషయంలో ఏం జరుగుతుందో చూడాలి.

# కేరాఫ్ వెంచపల్లి


శ్రీజిత్

శ్రీజిత్ లవన్, జీవా, సుమన్ శెట్టి, దివ్య ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'ఎస్‌డి కేరాఫ్ వెంచపల్లి'. పాలిక్ దర్శకుడు. గోదారి భానుచందర్ నిర్మాత. ఈ చిత్రంలోని 'తెలంగాణ పోరడు' అనే పాటని గురువారం హైదరాబాద్‌లో ప్రముఖ దర్శకుడు కె.విశ్వనాథ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "పాట వినసొంపుగా ఉంది. చిత్రబృందానికి విజయం చేకూరాల"న్నారు. "రఘురామ్ ఇచ్చిన బాణీకి సురేష్ గంగుల అందించిన సాహిత్యం మరింత సొగసుని అందించింద"న్నారు దర్శకుడు. "అందమైన లొకేషన్లలో చిత్రీకరణ జరిపాం. త్వరలోనే విడుదల చేస్తామ"న్నారు నిర్మాత.

# ఈనాడు సినిమా


ఇజాబెల్లే, కేథరిన్, విజయ్ దేవరకొండ, రాశీఖన్నా, కె.ఎస్.రామారావు, క్రాంతిమాధవ్

# ఇదే నా చివరి ప్రేమకథా చిత్రం - విజయ్ దేవరకొండ

విజయ్ దేవరకొండ కథానాయకుడిగా నటించిన చిత్రం 'వరల్డ్ ఫేమస్ లవర్'. రాశీఖన్నా, ఐశ్వర్యా రాజేష్, కేథరిన్, ఇజాబెల్లే నాయికలు. క్రాంతిమాధవ్ దర్శకుడు. వల్లభ నిర్మాత. గురువారం హైదరాబాద్‌లో ప్రచార చిత్రాన్ని విడుదల చేశారు. విజయ్ దేవరకొండ మాట్లాడుతూ "ఇప్పటి వరకూ నేను చేసిన సినిమాల్లో ఎక్కువ కష్టపడింది దీనికే. 'వరల్డ్ ఫేమస్ లవర్' నా చివరి ప్రేమకథ. ఎందుకంటే ఎప్పటికప్పుడు అభిరుచులు మారుతున్నాయి. మనిషిగా నేనూ మారుతున్నాను. నలుగురు అందమైన అమ్మాయిలతో కలిసి పనిచేయడం ఓ కలలా ఉంది. తమ నటనతో ఆ నలుగురూ ఆకట్టుకుంటారు. చివరి ప్రేమకథ కాబట్టి, సినిమా అంతా ప్రేమతో నింపేశాం" అన్నారు. "ఇప్పటి వరకూ నేను చేసిన సినిమాల్లో ఇది నా అత్యుత్తమం అనిపిస్తోంది. యామిని పాత్ర అంతగా నా మనసుకి దగ్గరైంది. నటుడిగా విజయ్‌ని మరో స్థాయిలో నిలబెట్టే సినిమా ఇద"న్నారు రాశీ ఖన్నా. "నేను చేసిన స్మిత పాత్ర అందరికీ గుర్తుండిపోతుంద"న్నారు కేథరిన్. "విజయ్‌ని ఓ భిన్నమైన పాత్రలో చూపించాం. నలుగురు కథానాయికలు మెప్పించార"న్నారు దర్శకుడు. సమర్పకుడు కె.ఎస్.రామారావు మాట్లాడుతూ "ఇది హాలీవుడ్ సినిమాలా ఉంటుంది. ఓ సహాయ దర్శకుడిగానూ విలువైన సలహాలిచ్చాడు విజయ్. రాశీఖన్నా ఈ సినిమా కోసం చాలా కష్టపడింది. నల్లటి బొగ్గు గనిలో తెల్లని వజ్రంగా మెరిసిపోయింది ఐశ్వర్యా రాజేష్. నలుగురు కథానాయికలున్నా, వారందరినీ మించేలా నటించాడు విజయ్. ఫిబ్రవరి 14న ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నామ"న్నారు.

# మరొకరైతే ఆత్మహత్య చేసుకునేవారేమో..




**"పదమూడేళ్లుగా చిత్రసీమలో ఉన్నా. అగ్ర దర్శకుల చిత్రాల్లో చేశా. కానీ, నన్ను నిరూపించుకునే అవకాశం ఈ సినిమాతోనే దక్కింద"న్నారు నందు. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'సవారీ'. ప్రియాంక శర్మ నాయిక. సాహిత్ మోత్కూరి దర్శకుడు. శుక్రవారం వస్తోంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో విలేకర్లతో చిత్ర విశేషాలు పంచుకున్నారు నందు.**

- "రాజు అనే బస్తీ కుర్రాడి పాత్రలో నటించా. తింగరితనంతో కూడిన అమాయక పాత్ర అది. నేను పెంచుకునే గుర్రాన్ని పోషించడానికి దానిపై పిల్లల్ని, పెద్దల్ని ఎక్కించుకుని సవారీ తిప్పే పని చేస్తుంటా. ఇంతలా కష్టపడేది నాకోసం కాదు. గుర్రం కోసమే. దానికి గుండెజబ్బు. ఆపరేషన్ చేయించాల్సి వస్తుంది. దీని కోసమే రోజుకు ఓ పూట మాత్రమే తింటూ పైసా పైసా కూడబెడుతుంటా. ఈ చిత్రంలోని సందేశం భావోద్వేగభరితంగా ఉంటుంది".
- "సాహిత్ ఈచిత్రంలో రెండో కథానాయకుడి పాత్ర కోసం నన్ను సంప్రదించారు. కథానాయకుడిగా ఓ కొత్త నటుణ్ని వెతుకుతున్నారని తెలిసింది. కొత్తవాళ్లతో చేసే బదులు నన్నే ఎందుకు హీరోగా తీసుకోకూడదు అనుకున్నా. సాహిత్‌తో 'నేనే హీరోగా చేద్దామనుకుంటున్నా' అని చెప్పా. తను సరే అనడంతో ఈచిత్రం మొదలైంది. ఇందులో నాయికది చాలా బలమైన పాత్ర. ఈ సినిమాలోని గుర్రాన్ని గుజరాత్ నుంచి తెప్పించాం. చిత్రానికి అదే అసలు హీరో. గుర్రపు సవారీ సమయంలో చాలా సార్లు గాయపడ్డా. చిత్రీకరణ జరిగినన్ని రోజులు దాసారం బస్తీలోని గుడిసెల్లోనే జీవించా".
- "ఇందులో నేను తెలంగాణ మాండలికంలో మాట్లాడా. దీని కోసం 15 రోజులు వర్క్‌షాప్ చేశాం. గతంలో నటుడిగా కొనసాగేందుకే కొన్ని చిత్రాలు చేయాల్సి వచ్చింది. 13 ఏళ్ల ప్రయాణంలో ఒడుదొడుకులు, అవమానాలు ఎదుర్కొన్నా. నా స్థానంలో మరొకరుంటే ఆత్మహత్య చేసుకునే వాళ్లేమో. ఈ చిత్రం తర్వాత నా కోసం కథలు రాసుకోవచ్చన్న ధీమా దర్శక, రచయితల్లో కలుగుతుందన్న నమ్మకముంది. భవిష్యత్తులో విభిన్నమైన పాత్రలు చేయాలనుంది".

# కథ హీరో... నేను డ్రైవర్!


సుధీర్

**"నా పాత్ర నిడివి గురించి ఆలోచించను. వినోదం పంచుతుందా? లేదా? అన్నదే ఆలోచిస్తా" అన్నారు సుడిగాలి సుధీర్. గెటప్ శ్రీను, రాంప్రసాద్‌లతో కలిసి 'త్రీ మంకీస్'లో నటించారు. అనిల్ కుమార్ దర్శకుడు. జి.నగేష్ నిర్మించిన ఈ చిత్రం శుక్రవారం వస్తోంది. గురువారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు సుధీర్.**

"ముగ్గురు కోతుల్లాంటి స్నేహితులు తమకు తెలియకుండా చేసిన తప్పుకు అనుకోని సమస్యల్లో చిక్కుకుంటారు. ఓ వైపు వాళ్లు ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్నా.. ఎదుటి వాళ్లకు మంచి చేసే ఉద్దేశంతో ముందుకెళ్తుంటారు. ఇందులో ఓ పాప పాత్ర చాలా కీలకం. తనకీ ఈ స్నేహితులకు సంబంధం ఏంటన్నది సినిమా చూసి తెలుసుకోవాలి".

- "మా 'జబర్దస్త్' స్నేహితుడు అవినాష్ వల్లే ఈ చిత్రం మాకొచ్చింది. ఇందులో నేను సంతోష్ అనే మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ పాత్రలో కనిపిస్తా. శ్రీను, రాంప్రసాద్ నా స్నేహితులు. మా అందరి పాత్రలకు సమ ప్రాధాన్యం ఉంటుంది".
- "కథానాయకుడిగా నా తొలి చిత్రం 'సాఫ్ట్‌వేర్ సుధీర్'కు మిశ్రమ ఫలితం దక్కినప్పటికీ నిర్మాతలకు డబ్బులొచ్చాయి. ఒకటి రెండు చిత్రాలతోనే హీరో అన్న బిరుదును తగిలించొద్దు. నాకెప్పుడూ కథే హీరో. నేనొక డ్రైవర్‌ను మాత్రమే. నటుడిగా నేను నిరూపించుకోవాల్సింది చాలా ఉంది. నటనలో నాకు చిరంజీవి స్ఫూర్తి. పవన్ కల్యాణ్, రజనీకాంత్‌లను ఆదర్శంగా తీసుకుంటా".




# చర్మానికి చక్కెర!

రెండు చెంచాల టమాట రసంలో చెంచా చక్కెర వేసి బాగా కలపాలి. దీన్ని ముఖం, మెడకు రాసి పది నిమిషాల పాటు మృదువుగా మర్దన చేయాలి. ఆరిన తరువాత చల్లటి నీటితో కడిగేస్తే చర్మం మెరుస్తుంది.






# సీతమ్మ వాకిట్లో చిన్నారి పథకం



**ఎనిమిదో తరగతి చదువుతోంది ఓ అమ్మాయి. తన పుట్టిన రోజున అమ్మ కొత్త డ్రెస్సు కొంటాననంది. 'నాకేం వద్దు. నాకు చాలానే కొత్త దుస్తులున్నాయి. కావాలంటే నువ్వు డ్రెస్సుకు ఖర్చుపెట్టాలనుకున్న డబ్బులు నాకివ్వు' అంటూ అమ్మకు తేల్చి చెప్పిందా చిన్నారి. ఇంతకీ ఆ డబ్బులు ఎందుకు?**

ఇంకొందరు చిన్నారుల చదువుకోసం...

**ఒక చిన్నారి. ఇంట్లో వాటర్ బాటిళ్లు నింపడం... కూరగాయలు తేవడం... మొక్కలకు నీళ్లుపోయడం... అమ్మకి వంట చేయడంలో సాయం.. వంటివి చేస్తోంది. బదులుగా అమ్మానాన్నల దగ్గర డబ్బులు తీసుకుంటోంది. అయితే ఆ చిన్నారి ఆ డబ్బులు అడిగింది తన కోసం కాదు. మరి ఎవరికోసం?**

పేదరికంలో మగ్గుతున్న పసిమొగ్గల భవిష్యత్తు కోసం

ఇలా ఒకరు కాదు ఇద్దరు కాదు.. హైదరాబాద్ బాచుపల్లిలోని సిల్వర్ ఓక్స్ అంతర్జాతీయ పాఠశాలలోని మూడువేల మంది చిన్నారులు డబ్బులు సంపాదిస్తూ, ఖర్చుల్ని తగ్గించుకుంటూ పొదుపు చేస్తున్నారు. ఈ స్కూల్లో 'కాయిన్స్ ఫర్ ది కంట్రీ' పేరుతో జరుగుతున్న ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొంటూ పైసా పైసా కూడబెడుతున్నారు. ఏటా రెండు స్వచ్ఛంద సంస్థల ద్వారా ఎంతో మంది పిల్లలకు సాయం చేస్తున్నారు. 2005 నుంచి 2019 వరకు వీరు పొదుపు చేసి, సాయం చేసిన డబ్బు మొత్తం దాదాపు కోటీ 45 లక్షల రూపాయల పైమాటే. చిన్న వయసులోనే ఈ విద్యార్థుల్లో వచ్చిన సామాజిక బాధ్యతకు కారణం ఈ స్కూలు ప్రిన్సిపల్ సీతామూర్తి. అసలా ఆలోచన ఎలా వచ్చింది? ఇంత పెద్ద మొత్తాన్ని వారు ఎలా పొదుపు చేశారో... ఆమె మాటల్లోనే...



ఓసారి 2008లో అంతర్జాతీయ సదస్సుకు సింగపూర్ వెళ్లాను. అక్కడ ఒక అమెరికన్... పాకిస్థాన్‌లోని ఆడపిల్లల చదువు కోసం చేస్తున్న పొదుపు గురించి చెప్పాడు. అది నాకు చాలా నచ్చింది. అప్పటివరకు మా స్కూల్లోనూ పొదుపు విధానం ఉంది. అయితే విద్యార్థులు డబ్బులు పొదుపు చేయడానికి ఫ్రెండ్స్, బంధువుల్ని అడిగేవారు. అలా కాకుండా.. ఎవర్నీ డబ్బులు అడగకుండా పొదుపు చేస్తే బాగుంటుందనిపించింది. పాఠశాల యాజమాన్యంతో దీన్ని చర్చించి 'కాయిన్స్ ఫర్ ది కంట్రీ' కార్యక్రమం మొదలుపెట్టాం. ఇందులో భాగంగా పిల్లలు పొదుపు చేయడానికి.. ఇంట్లో బాటిల్స్ నింపడం, అమ్మకు ఇంటిపనుల్లో సాయం చేయడం, టాయ్ లైబ్రరీ, బుక్ లైబ్రరీ ఏర్పాటు చేయడం, బయటకు వెళ్లినప్పుడు ఖర్చులు తగ్గించుకోవడం.. వంటి సూచనలు చేశాం. పిల్లల అమ్మానాన్నలకూ అవగాహన కల్పించాం.

- ఈ కార్యక్రమం మొదలుపెట్టినప్పటి నుంచి రోజూ అసెంబ్లీలో విద్యార్థులు చేసిన పొదుపు, వాళ్ల ఆలోచనల గురించి కొంతసేపు మాట్లాడుతున్నాం. పొదుపు చేసిన డబ్బుతో ఎంతమందికి సాయం అందుతోందో చెప్పి, లబ్ధిపొందేవారిని తీసుకొచ్చి మాట్లాడిస్తున్నాం. పిల్లలతో పాటు మేమెంత జమ చేస్తున్నామో వివరిస్తున్నాం. ఈమధ్య మా ఇంట్లో ఓ ఫంక్షన్ జరిగింది. కొన్ని ఖర్చులు తగ్గించి కొంత డబ్బు మిగిల్చా. దాన్ని పిల్లల ముందే నా దగ్గర ఉన్న కిడ్డీ బ్యాంకులో వేశా. అలా పిల్లలకు ఎప్పటికప్పుడు బాధ్యత గుర్తు చేస్తూ పొదుపు చేసేలా ప్రోత్సహిస్తుంటాం.
- ఏటా విద్యాసంవత్సరం మొదలవ్వగానే మూడువేల మంది విద్యార్థులకు కిడ్డీబ్యాంకులు అందజేస్తాం. వాటిని పిల్లలంతా ఇంటికి తీసుకెళతారు. అందులో నగదు జమ చేయడానికి విద్యార్థులు ఎవరినీ అడగకూడదనేది మా నిబంధన. పుట్టిన రోజు సరదాలు వంటి వేడుకల్లో పెట్టే ఖర్చులో కాస్త తగ్గించుకోవడం, పాకెట్ మనీ, బహుమతుల ద్వారా అందిన డబ్బులు ఇలా రకరకాలుగా జమ చేస్తుంటారు. ఒక్కో విద్యార్థి తమ పరిస్థితుల్ని బట్టి పొదుపు చేస్తుంటారు. వాటిని జనవరి 26న పాఠశాలకు అప్పగించాలి. వరంగల్ జిల్లా కళ్లెడలోని 'రూరల్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్(ఆర్‌డీఎఫ్), గుంటూరు జిల్లా నాదెండ్ల మండలం కనపర్తి మైనంపాడులోని 'నీడి ఇల్లిటరేట్ ఎడ్యుకేషన్(నైస్)' స్వచ్ఛంద సంస్థలకు ఆ డబ్బును విరాళంగా ఇస్తున్నాం. వీటి ద్వారా దాదాపు రెండువేల మంది అనాథ పిల్లలకు సాయం అందుతోంది.

– నవనీత గంటగారి

# చెత్తా చెత్తా హుష్



**చెత్తకుండీ నిండిపోయినా కొన్ని ప్రాంతాల్లో శుభ్రం చేయరు. పర్యావరణ కాలుష్యంతో అక్కడి ప్రజలు ఇబ్బంది పడుతూ ఉంటారు. ఇలాంటి వాటికి చెక్ పెట్టేందుకు 'ట్రాక్ ద ట్రాష్' అనే కొత్తరకం యాప్‌ను రూపొందించారు చండీగఢ్ విశ్వవిద్యాలయ విద్యార్థి బృందం. ఇది ఎలా పనిచేస్తుందంటే..**

నగరపాలక సంస్థలకు పారిశుద్ధ్యంలో భాగంగా ఈ యాప్ త్వరలో చేయూతకానుంది. ఫోన్ ద్వారా దీన్ని చెత్తకుండీలతో అనుసంధానం చేస్తే చాలు. నిండిన చెత్తకుండీల సమాచారాన్ని అందిస్తుంది. దాంతో అక్కడి నుంచి చెత్తను తరలించొచ్చు. స్మార్ట్ వేస్ట్ మేనేజ్‌మెంటు సిస్టమ్‌లో భాగంగా ఛార్వీగోయల్ అనే విద్యార్థిని.. తన బృందంతో కలిసి దీన్ని రూపొందించింది. ఈ యాప్‌ను తాజాగా పంజాబ్ ఇంటర్నేషనల్ సైన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించి ప్రముఖుల ప్రశంసలను అందుకున్నారు వారు.



**సెన్సార్ల ద్వారా**

ఈ యాప్‌ను ఫోన్‌లో పొందుపరుచుకుని, దీనికి అనుసంధానంగా రూపొందించిన సెన్సార్లను చెత్తకుండీకి అమర్చాలి. వీటి ద్వారా సమాచారం ఫోన్‌కు చేరుతుందని చెబుతోంది ఛార్వీ. 'మున్సిపాలిటీ వాహనచోదకులకు ఈ యాప్ చేయూతగా ఉంటుంది. చెత్తకుండీల సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందిస్తూ, మార్గనిర్దేశం చేస్తుంది. అంతే కాదు, ఇదే యాప్‌ను ఉన్నతాధికారులు తమ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకుంటే, పారిశుద్ధ్య కార్మికులు విధులను సరిగ్గా నిర్వహిస్తున్నారా లేదా అనేది గుర్తించొచ్చు. స్కూల్లో చదువుకునేటప్పుడే దీన్ని ప్రాజెక్టుగా చేశాం. లఖ్‌నవూలోని ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌లో దీన్ని ప్రదర్శించి, స్వచ్ఛభారత్ కేటగిరీలో అవార్డు గెలుచుకున్నాం. అప్పటి మా ప్రాజెక్టు ఆలోచనకు ఇప్పుడు యాప్‌గా రూపాన్నిచ్చాం. దీనిపై పేటెంట్ హక్కుకు దరఖాస్తు చేసుకున్నాం. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వంతో చర్చిస్తున్నాం. కాలుష్యరహితంగా నగరాలను తీర్చిదిద్దడంలో మేమూ భాగస్వాములం కావడం సంతోషంగా ఉంది' అని అంటోంది ఛార్వీ.

# ఇకత్ అందాల మేళా!



ఈతరం అమ్మాయిల మనసు దోచే ఇకత్ కుర్తీలు, టాప్‌లు... ఆధునికతకు కేరాఫ్‌గా నిలిచే ఆకర్షణీయమైన ట్యూనిక్‌లు ఆకట్టుకుంటున్నాయి... చూసేయండి మరి...

నగలు, దుస్తులు: KALANJALI
www.kalanjali.com
www.facebook.com/kalanjaliworld
ఈ దుస్తులు అన్ని కళాంజలి షోరూమ్‌లలో లభ్యమవుతాయి.

జేబులతో ఉన్న నీలిరంగు ఇకత్ ఇండో-వెస్ట్రన్ ట్యూనిక్ డ్రెస్... అదుర్స్. మరి మీరూ ప్రయత్నిస్తారా!

మెడ, చేతుల వద్ద ప్రత్యేకమైన టాజిల్స్‌తో... ముదురు నీలిరంగు ఇండో-వెస్ట్రన్ ఇకత్ పొట్టి టాప్‌ను చూస్తే వావ్ అనకుండా ఉండలేరు.

ఫ్యాషన్ ఫ్యాషన్

లేత గులాబీ-ముదురు ఎరుపు రంగుల ఇకత్ క్యాజువల్ వేర్ ప్రిన్సెస్ కట్ పొడవాటి ట్యూనిక్ డ్రెస్... దానికి జతగా జేబులు... భలే ఉన్నాయి కదూ!

బూడిద-మెరూన్ రంగుల మేళవింపుతో ఉన్న ఇకత్ పొట్టి కుర్తీకి జతగా... ట్రైబల్ త్రెడ్ ఎంబ్రాయిడరీ పనితనం ఆకట్టుకుంటోంది.

# పసిడి ముచ్చట

| | నిన్న | మొన్న |
|---|---|---|
| **హైదరాబాద్** | | |
| బంగారం (24క్యా) | 41,730 | 41,540 |
| ఆర్నమెంట్ | 38,990 | 38,800 |
| వెండి (కిలో) | 47,800 | 47,035 |
| **విజయవాడ** | | |
| బంగారం (24క్యా) | 41,540 | 41,480 |
| ఆర్నమెంట్ | 38,470 | 38,420 |
| వెండి (కిలో) | 47,500 | 47,200 |
| **ప్రొద్దుటూరు** | | |
| బంగారం (24క్యా) | 40,600 | ------ |
| ఆర్నమెంట్ | 37,600 | ------ |
| వెండి (కిలో) | 47,300 | ------ |
| **రాజమహేంద్రవరం** | | |
| బంగారం (24క్యా) | 41,790 | 41,520 |
| ఆర్నమెంట్ | 38,620 | 38,370 |
| వెండి (కిలో) | 47,600 | 47,100 |
| **విశాఖపట్నం** | | |
| బంగారం (24క్యా) | 41,260 | 41,370 |
| ఆర్నమెంట్ | 38,380 | 38,480 |
| వెండి (కిలో) | 47,000 | 47,500 |
| **తమిళనాడు** | | |
| బంగారం ఆర్నమెంట్ (గ్రా) | 3,862 | 3,837 |
| వెండి (గ్రా) | 49.80 | 49.40 |

(రూ. లలో)

# చ్యవన్‌ప్రాశ్‌ను ఇంట్లో తయారుచేసుకోవచ్చా..?

**చ్యవన్‌ప్రాశ్‌ను ఇంట్లోనే ఎలా తయారు చేసుకోవాలో చెప్పండి.** –రజని, భీమవరం

చ్యవన్‌ప్రాశ్ మంచి రసాయన ఔషధం. ఇది రోగనిరోధక శక్తిని పెంచడమే కాదు, వార్ధక్య లక్షణాలు త్వరగా రాకుండా కాపాడుతుంది. దీని తయారీలో దాదాపు 45 నుంచి 50 రకాల మూలికలు వినియోగిస్తారు. ఇంటివద్ద దీన్ని తయారుచేసుకోవడం కష్టం.



ఇంటి వైద్యం

ఇందులో ప్రధానంగా వాడే మూలిక ఉసిరికాయ. దీన్ని ఉత్తమ రసాయనం అంటారు. దీనికి తేలికగా లభ్యమయ్యే మరికొన్ని మూలికలను కలిపి ఇంట్లోనే తయారుచేసుకోవచ్చు. అదెలాగంటే...

**కావలసినవి:** ఉసిరికాయలు-50, వెదురు ఉప్పు-20గ్రా., పిప్పళ్ల చూర్ణం-10గ్రా., దాల్చినచెక్క పొడి-పావుచెంచా, యాలకుల పొడి-పావుచెంచా, తేనె-30గ్రా., నెయ్యి-30గ్రా., నువ్వుల నూనె-30గ్రా., చక్కెర-250గ్రా.

**తయారీ:** ఉసిరికాయలను శుభ్రంగా కడిగి పలుచని వస్త్రంలో మూట కట్టి, కుక్కర్‌లో ఆవిరిపై ఉడికించాలి. మెత్తగా ఉడికిన తరువాత స్టీలు జల్లెడలో వేసి చేతితో రుద్దుతుంటే గింజలు, పీచు పైన ఉండిపోయి, మెత్తటి గుజ్జు కిందకి వస్తుంది. ఆ తరువాత మూకుడు వేడిచేసి నువ్వులనూనె, నెయ్యి వేసి ఉసిరికాయ గుజ్జును అందులో బాగా వేయించాలి. వేరే గిన్నెలో చక్కెర పాకం పట్టి, వేయించిన గుజ్జును వేసి దగ్గరపడేవరకు ఉడికించాలి. తరువాత చల్లార్చి తేనె, వెదురు ఉప్పు, పిప్పళ్ల చూర్ణం, దాల్చిన చెక్క పొడి, యాలకుల పొడి కలిపి శుభ్రమైన గాజుసీసాలో భద్రపరుచుకోవాలి. ఉసిరికాయలు యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేసి శరీరంలో వ్యాధికారకాలు, మలినాలు చేరకుండా కాపాడతాయి. ఇలా తయారు చేసుకున్న ఈ చ్యవన్‌ప్రాశ్‌ను అయిదు నుంచి పది గ్రాముల పరిమాణంలో ఉదయం, సాయంత్రం భోజనానికి కనీసం గంట ముందు తీసుకోవాలి. వెంటనే అరకప్పు గోరువెచ్చని పాలు లేదా నీళ్లు తాగాలి. ఈ విధంగా కనీసం ఏడాదిపాటు తీసుకుంటే ఆరోగ్యానికి చాలా మంచిది.



డాక్టర్ గాయత్రీదేవి, ఆరోగ్యపీఠం,
మీ ప్రశ్నలు vasuayur@eenadu.net కు పంపించగలరు.

# గోడలు మెరిసేలా...



ఎంతో ఖర్చుచేసి గోడలకు రంగులు వేయిస్తాం. వాటిని సరిగ్గా శుభ్రం చేయకుంటే... దుమ్మూధూళి చేరి ఇంటికి కొత్తదనం పోతుంది. మరి గోడలెప్పుడూ కొత్తగా ఉండాలంటే ఇవి చేసి చూడండి.

**డ్రై డస్ట్ మాప్**

గోడలపై పేరుకుపోయిన దుమ్మును, మరకలను తొలగించాలంటే డ్రై డస్ట్ మాప్ ఉత్తమం. ఈ విధానంతో అన్ని గోడలు తుడవొచ్చు.

**మైక్రో ఫైబర్ క్లాత్**

ఎంత ప్రయత్నించినా స్విచ్‌బోర్డులు, గోడ మూలలను సరిగ్గా శుభ్రం చేయలేం. అలాంటప్పుడు మైక్రో ఫైబర్ గుడ్డను ఎంచుకోవాలి.

**మైల్డ్ డిష్‌వాషింగ్ లిక్విడ్**

కొన్ని కొన్ని మరకలు అస్సలు వదలవు. అలాంటప్పుడు స్పాంజ్‌ను మైల్డ్ డిష్ వాషింగ్ లిక్విడ్‌లో ముంచి... గోడలను తుడవాలి. నూనె మరకలు సైతం వదిలిపోతాయి.

**మ్యాజిక్ ఎరేజర్**

పాత గోడలు కొత్తగా మెరవాలన్నా, జిడ్డు మరకలు వదలాలన్నా మ్యాజిక్ ఎరేజర్‌ను ఎంచుకోవాలి. ఇది మ్యాజిక్ చేసినట్టుగా గోడలను మెరిపిస్తుంది.

# క్షణాల్లో.. ఇ-పాన్

## ఆన్‌లైన్‌లో ఆధార్ వివరాలు నమోదు చేస్తే చాలు




**దిల్లీ:** ఆన్‌లైన్‌లో ఆధార్ వివరాలు నమోదు చేస్తే, వెంటనే ఇ-పాన్ (ఆన్‌లైన్ శాశ్వత ఖాతా సంఖ్య) జారీ చేసే సేవలు ఈ నెలలోనే ప్రారంభిస్తామని రెవెన్యూ కార్యదర్శి అజయ్‌భూషణ్ పాండే తెలిపారు. ప్రస్తుతం పాన్ కావాలంటే, ప్రత్యేక దరఖాస్తును పూరించాల్సి ఉంది. 2020-21 బడ్జెట్‌లో ప్రతిపాదించిన ఇ-పాన్ కోసం దరఖాస్తునేమీ నింపాల్సిన అవసరం లేదు. ఆధార్ వివరాలతోనే, వెంటనే జారీ చేస్తారు. ఇందుకోసం వ్యవస్థ సిద్ధమవుతున్నందున, ఈ నెలలోనే అమలు ప్రారంభమవుతుందని పాండే చెప్పారు.

**ఇలా చేయాలి:** కొత్తగా పాన్ కోరుకుంటున్న వారు ఆదాయపు పన్ను విభాగ వెబ్‌సైట్‌లోకి, ఆధార్ నెంబరు నమోదు చేయాలి. ఆధార్ వద్ద నమోదైన మొబైల్ నెంబరుకు వన్‌టైమ్ పాస్‌వర్డ్ (ఓటీపీ) వస్తుంది. అది నమోదు చేస్తే, ఆధార్ వివరాలను సరిపోల్చుకుంటుంది. వెంటనే పాన్ నెంబరు జారీ అవుతుంది. ఇ-పాన్ కార్డును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

**అధికారులకూ జరిమానా:** ఆదాయపు పన్ను చట్టంలోని నిబంధనలను అనుసరించకపోతే ప్రస్తుతం పన్ను చెల్లింపుదార్లకు జరిమానా పడుతోంది. కొత్తగా ప్రతిపాదించిన 'టాక్స్‌పేయర్ ఛార్టర్' ప్రకారం పన్ను చెల్లింపుదార్లతో పాటు, ఆదాయపు పన్ను విభాగం కూడా ఎంత గడువులోగా విధులు నిర్వర్తించాలో నిర్దేశిస్తుంది. ఈ ప్రకారం చేయకపోతే, అధికారులకూ జరిమానా విధించే పరిస్థితి వస్తుందని పాండే వెల్లడించారు.

ఈనాడు బిజినెస్

# ఇదిగో.. పన్ను కాలిక్యులేటర్

## కొత్త, పాత విధానాల్లో ఎంత పడుతుందో తెలుసుకోవచ్చు



**దిల్లీ:** కొత్త, పాత విధానాల్లో ఆదాయపు పన్ను ఎంత చెల్లించాల్సి వస్తుందో తెలుసుకునే ఇ-కాలిక్యులేటర్‌ను ఆదాయపు పన్ను (ఐటీ) విభాగం ఆవిష్కరించింది. ప్రస్తుత విధానంలో పన్ను చెల్లిస్తున్న వారు, కొత్త పన్ను రేట్లలో ఎంత చెల్లించాల్సి వస్తుందో కూడా తెలుసుకుని, ఏది తమకు అనువైనదో నిర్ధారించుకునేందుకు ఇది దోహద పడుతుందని పన్ను అధికారులు తెలిపారు.

వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఆదాయపు పన్ను రిటర్ను (ఐటీఆర్)లు సమర్పించేందుకు ఇది ఉపకరిస్తుందని అధికారులు చెబుతున్నారు. 60 ఏళ్లలోపు సాధారణ పౌరులు, 60-79 సంవత్సరాల సీనియర్ సిటిజన్లు, 79 సంవత్సరాల పైబడి సూపర్ సీనియర్ సిటిజన్లు తమ వార్షికాదాయ అంచనా, ప్రస్తుత పన్ను విధానంలో ఎంతమేర మినహాయింపులు పొందొచ్చో నమోదు చేస్తే, పన్ను విధించదగ్గ ఆదాయం ఎంతో తెలుతుంది. అదే కొత్త విధానాన్ని ఎంచుకుంటే, మినహాయింపులు ఏవీ ఉండవు.

■ ఆదాయాలు నమోదు చేస్తే, పాత-కొత్త విధానాల్లో ఎంతవరకు ఆదా అవుతుందో కాలిక్యులేటర్ చూపుతుంది. ఇందుకోసం https:///www.incometaxindiaefiling.gov.in ఇ-ఫైలింగ్ వెబ్‌సైట్ హోమ్‌పేజీలో ఇ-కాలిక్యులేటర్ ట్యాబ్ ఉంచారు. అక్కడ క్లిక్ చేస్తే, తదుపరి పేజీలో కాలిక్యులేటర్ వద్దకు తీసుకెళ్తుంది.

# అంతా అనుకున్నట్లే..



**ఆర్‌బీఐ పరపతి విధాన సమీక్ష**

- కీలక రేట్లు యథాతథం
- ద్రవ్యోల్బణంపై అనిశ్చితి ప్రభావం
- భవిష్యత్‌లో కోతలుండొచ్చని సంకేతాలు
- రుణాల వృద్ధికి ప్రత్యేక చర్యలు
- స్థిరాస్తి రంగానికి ఉపశమనం

**ముంబయి: రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) అంతా ఊహించిన విధంగానే కీలక రేట్లను యథాతథంగా కొనసాగిస్తున్నట్లు ప్రకటించింది. ఓ వైపు ఆర్థిక వ్యవస్థ మందగమనంలో జారడం, మరోవైపు ద్రవ్యోల్బణంపై నెలకొన్న అనిశ్చితి మధ్య ఈ నిర్ణయం తీసుకుంది. ఆర్‌బీఐ గవర్నర్ శక్తి కాంత దాస్ నేతృత్వంలోని ఆరుగురు సభ్యుల పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) ఏకగ్రీవంగా ఈ నిర్ణయం తీసుకుంది. రెపో రేటును 5.15 శాతం, రివర్స్ రెపో రేటును 4.9 శాతం వద్ద కొనసాగించింది. ఆర్‌బీఐ తాజా సమీక్షలో కీలక రేట్లలో మార్పు చేయనప్పటికీ. భవిష్యత్‌లో రేట్ల కోతలకు అవకాశం ఉందని సంకేతాలు ఇచ్చింది.**

### ముఖ్యాంశాలు

- ■ కీలక రుణ రేటు (రెపో) 5.15 శాతం వద్దే.
- ■ 2021-21లో జీడీపీ వృద్ధి రేటు అంచనా 6 శాతం.
- ■ కూరగాయలు, పప్పుల వల్ల ఆహార వస్తువుల ధరలు పెరగొచ్చు.
- ■ వృద్ధి పుంజుకునేలా చేయడానికి 'సర్దుబాటు' ధోరణి కొనసాగింపు
- ■ పర్యాటకం, అంతర్జాతీయ వాణిజ్యంపై కరోనా ప్రభావం.
- ■ వ్యక్తిగత ఆదాయపు పన్ను రేట్ల హేతుబద్ధీకరణతో దేశీయ గిరాకీకి ఊతం.
- ■ చిన్న పొదుపు పథకాలపై వడ్డీ రేట్లు మార్చాల్సిన అవసరం ఉంది.
- ■ గృహ రుణ కంపెనీలకు త్వరలో సవరించిన నిబంధనలు.
- ■ ముడిచమురు ధరలు ఒడుదొడుకుల్లోనే కొనసాగొచ్చు.
- ■ ఫిబ్రవరి 4 నాటికి ఫారెక్స్ నిల్వలు 471.4 బిలియన్ డాలర్లు.
- ■ పరపతి విధాన కమిటీ (ఎంపీసీ)లోని అందరు సభ్యుల ఓటు రేట్ల యథాతథానికే.

**తదుపరి సమీక్ష ఏప్రిల్ 1-3 తేదీల్లో**

### 1 జీడీపీ వృద్ధి 6 శాతం

వచ్చే ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధి 6 శాతంగా నమోదుకావొచ్చని ఆర్‌బీఐ అంచనా వేసింది. ఆర్థిక సర్వేలో జీడీపీ వృద్ధిని 6- 6.5 శాతంగా అంచనా వేశారు. 2020-21 వృద్ధి అంచనాలపై ప్రైవేటు వినియోగం సహా పలు అంశాలు ప్రభావం చూపాయని ఆర్‌బీఐ తెలిపింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వినియోగం పుంజుకోవాల్సి ఉందని అభిప్రాయపడింది.

### 2 దీర్ఘకాలిక రెపోలు

బ్యాంకులు రుణ రేట్లు తగ్గించేందుకు రూ.లక్ష కోట్ల దీర్ఘకాలిక పునఃకొనుగోలు ఒప్పందాలు (రెపోలు)ను ప్రభుత్వం ప్రకటించింది. రేట్ల కోత ప్రయోజనాలు కూడా వినియోగదారులకు త్వరితగతిన బదలాయించేందుకు ఇవి దోహదపడనున్నాయి. ఫిబ్రవరి 15 నుంచి ఏడాది, మూడేళ్ల కాలవ్యవధి కలిగిన దీర్ఘకాలిక రెపోలను ఆర్‌బీఐ ప్రవేశపెట్టనుంది.

### 3 దేశవ్యాప్తంగా సీటీఎస్

చెక్‌లకు త్వరితగతిన క్లియరెన్స్ ఇచ్చేందుకు వీలుగా.. ఈ ఏడాది సెప్టెంబరు నాటికి దేశవ్యాప్తంగా చెక్ ట్రంకేషన్ సిస్టమ్ (సీటీఎస్)ను అమలు చేయాలని ఆర్‌బీఐ నిర్ణయించింది. దేశంలో డిజిటల్ చెల్లింపులు వేగంగా విస్తరిస్తుండటంతో, త్వరలోనే డిజిటల్ పేమెంట్స్ సూచీ (డీపీఐ)ని ప్రవేశపెడతామని వెల్లడించింది. జులై నుంచి ఇది అందుబాటులోకి రానుంది.

**ఎంఎస్ఎంఈ, గృహ, వాహన రుణాలపై ఉపశమనం:** సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ), వాహన, గృహ రంగాలకు రుణ లభ్యత పెంచేందుకు నగదు నిల్వల నిష్పత్తి (సీఆర్ఆర్) నిర్వహణ నిబంధనలను ఆర్‌బీఐ సడలించింది. మొత్తం డిపాజిట్లు లెక్కించే విధానంలో ఉపశమనం కల్పించింది. సీఆర్ఆర్ మినహాయింపులు జులై వరకు అందుబాటులో ఉంటాయి. ఆర్‌బీఐ వద్ద బ్యాంకులు తప్పనిసరిగా చేయాల్సిన మొత్తం డిపాజిట్లను సీఆర్ఆర్‌గా పరిగణిస్తారు. ప్రస్తుతం ఇది 4 శాతంగా ఉంది.

**డిపాజిట్ల బీమా పెంపు ప్రభావం ఉండదు:** డిపాజిట్లపై బీమాను రూ.5 లక్షలు పెంచడం వల్ల, బ్యాంకుల బ్యాలెన్స్ షీట్లపై ఎటువంటి ప్రభావం ఉండబోదని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. పీఎంసీ బ్యాంక్ సహా పలు సహకార బ్యాంకుల్లో అక్రమాలు చోటుచేసుకున్న నేపథ్యంలో.. బడ్జెట్‌లో డిపాజిట్ బీమాను రూ.లక్ష నుంచి రూ.5 లక్షలకు పెంచారు. ప్రతి రూ.100కు ప్రీమియం రూ.10 పైసల నుంచి రూ.12 పైసలకు పెరుగుతుందని, ఇది బ్యాంకులపై పెద్దగా ప్రభావం చూపదని ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ కనుంగో తెలిపారు.

### 4 ద్రవ్యలోటుకు చర్యల్లేవు

పెరుగుతున్న దేశ ద్రవ్యలోటును అదుపుచేయడానికి ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ తెలిపారు. మరింత నగదును ముద్రించొచ్చన్న ఊహాగానాలను కొట్టిపారేశారు. వరుసగా మూడో ఏడాదీ ప్రభుత్వం ద్రవ్యలోటు లక్ష్యాన్ని సవరించింది. డిసెంబరు నాటికే ద్రవ్యలోటు అంచనాల్లో 132 శాతాన్ని మించిపోయింది.



**'వృద్ధి, ద్రవ్యోల్బణాన్ని సమతుల్యంగా ఉంచేందుకు ప్రభుత్వం చాలా జాగ్రత్తగా చర్యలు చేపట్టింది. కీలక రేట్లను యథాతథంగా కొనసాగించడం ఊహించిందే. ఆర్థిక వ్యవస్థలోని నగదు లభ్యతను పెంచేందుకు తీసుకున్న చర్యలు మాత్రం ఆశ్చర్యకరమే. ఏడాది, మూడేళ్ల దీర్ఘకాలిక రెపోల వల్ల బ్యాంకుల నిధుల వ్యయం తగ్గుతుంది. వినియోగదారులకు రేట్ల కోత ప్రయోజనాలు కూడా అందుతాయి'**

– రజనీశ్ కుమార్, ఎస్‌బీఐ ఛైర్మన్

### 5 స్థిరాస్తికి ఊతం

ఇక స్థిరాస్తి రంగానికి ఊతమిచ్చేందుకు వాణిజ్య స్థిరాస్తి ప్రాజెక్టుల ప్రారంభ తేదీని పొడిగించేందుకు అనుమతివ్వాలని నిర్ణయించింది. దీనికి సంబంధించి పూర్తి నిబంధనలను త్వరలో వెల్లడిస్తారు. వాణిజ్య ప్రాజెక్టుల పూర్తి జాప్యం కావడానికి సహేతుకమైన కారణాలుంటే, ఆ రుణాల రేటింగ్‌ను తగ్గించబోమని తెలిపింది.

### 6 ద్రవ్యోల్బణం అంచనాలు పెంపు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జనవరి- మార్చి త్రైమాసికంలో రిటైల్ ద్రవ్యోల్బణం అంచనాలను ఆర్‌బీఐ 6.5 శాతానికి పెంచింది. పాలు, పప్పులు, ముడిచమురు ధరల వల్ల ద్రవ్యోల్బణం అత్యంత అనిశ్చితిగా ఉందని అంచనా వేసింది. ద్రవ్యోల్బణంపై ఆహారం, ముడిచమురు, తయారీ వ్యయాలు వంటి పలు అంశాలు ప్రభావం చూపుతున్నాయని తెలిపింది.

### 7 డిజిటల్ చెల్లింపులపై ఎస్ఆర్ఓ

భారత డిజిటల్ చెల్లింపు వ్యవస్థ భద్రత పెంపు, వినియోగదారు రక్షణ, ధరల నిర్ణయం వంటి వాటికోసం స్వయం ప్రతిపత్తి సంస్థ (ఎస్ఆర్ఓ)ను ఏర్పాటు చేయాలని ఆర్‌బీఐ ప్రతిపాదించింది. ఏప్రిల్‌కు ఎస్ఆర్ఓను ఏర్పాటు చేయడానికి త్వరలోనే ఆర్‌బీఐ విధివిధాలను ఖరారు చేయనుంది. ఎస్ఆర్ఓ మొదలైతే, డిజిటల్ లావాదేవీల మరింత సురక్షితం కానున్నాయి.

### 8 వడ్డీ రేట్లు దిగొస్తున్నాయి

రిజర్వు బ్యాంకు రెపో రేటు తగ్గించినా బ్యాంకులు అందుకు అనుగుణంగా స్పందించేవి కావు. కానీ, ఇప్పుడు పరిస్థితుల్లో మార్పు వచ్చింది. బ్యాంకులు ఎంసీఎల్ఆర్ నుంచి రెపో లింక్డ్ లెండింగ్ రేట్ (ఆర్ఎల్ఎల్ఆర్)లోకి మారిపోయాయి. దీంతో ఇప్పుడు బ్యాంకుల వడ్డీ రేట్లలో తగ్గుదల కనిపిస్తోందని ఆర్‌బీఐ ప్రకటించిన పరపతి విధానంలో పేర్కొంది.

**'రేట్ల కోత ప్రయోజనాలను బ్యాంకులు వినియోగదారులకు బదలాయించడం కోసం చర్యలు చేపట్టాం. బ్యాంకులు రుణ రేట్లను తగ్గించేందుకు వీలుగా రూ.లక్ష కోట్లను బ్యాంకింగ్ వ్యవస్థలోకి చొప్పిస్తున్నాం. ఏడాది, మూడేళ్ల కాలవ్యవధి కలిగిన దీర్ఘకాలిక రెపోలను ఇస్తాం. బ్యాంకులకు తక్కువ రేట్లు నిధులు వస్తే.. రేట్ల కోత ప్రయోజనాలు వేగంగా అందుతాయి. కార్పొరేట్ బాండ్లు. . ప్రభుత్వ సెక్యూరిటీల విభాగంలో రుణ రేట్లను ప్రామాణికంగా తీసుకుంటాయి. ప్రభుత్వ బాండ్లపై రాబడులను తగ్గించగలిగితే, కార్పొరేట్ బాండ్ రేట్లు పెరుగుతాయి'**

– శక్తికాంత దాస్, ఆర్‌బీఐ గవర్నర్

## ఒలెక్ట్రా-బీవైడీ కొత్త విద్యుత్ బస్సు



ఒలెక్ట్రా-బీవైడీ సీ9 ఇంటర్‌సిటీ బస్సును ఆవిష్కరిస్తున్న గడ్కరీ

ఈనాడు, హైదరాబాద్: విద్యుత్ బస్సులను ఉత్పత్తి చేస్తున్న హైదరాబాద్‌కు చెందిన ఒలెక్ట్రా-బీవైడీ దిల్లీలో జరిగిన ఆటో ఎక్స్‌పో2020లో నూతన మోడల్‌ను ప్రదర్శించింది. కేంద్ర రోడ్డు రవాణా, హైవేస్ మంత్రి నితిన్ గడ్కరీ దేశంలో మొదటి ఇంటర్ సిటీ బస్సు ఒలెక్ట్రా-బీవైడీ సీ9ను గురువారం ఆవిష్కరించారు. 45-49 సీట్ల సామర్థ్యంతో 12 మీటర్ల పొడవున్న ఈ బస్సు దూర ప్రయాణాలను లక్ష్యంగా తీసుకొచ్చినట్లు సంస్థ పేర్కొంది. ఒకసారి ఛార్జింగ్ చేస్తే 300 కిలోమీటర్ల వరకూ ఇది పరుగులు తీస్తుంది. పట్టణాల మధ్య ప్రయాణం చేసేవారికి అన్ని విధాలా సౌకర్యవంతంగా ఉండేలా దీన్ని రూపొందించినట్లు ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్‌కే రావల్ తెలిపారు.

## ఒక్కసారి ఛార్జింగ్... 116 కి.మీ ప్రయాణం!

- అందుబాటులోకి తేనున్న ఐఐటీ అంకుర సంస్థ 'ప్యూర్‌ఈవీ'



ఈనాడు, సంగారెడ్డి: ఐఐటీ హైదరాబాద్‌కి చెందిన అంకుర సంస్థ 'ప్యూర్‌ఈవీ' సరికొత్త ఎలక్ట్రిక్ వాహనాన్ని మార్కెట్లోకి అందుబాటులోకి తేనుంది. ఒక్కసారి ఛార్జింగ్ చేస్తే 116 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయగలగడం దీని ప్రత్యేకత. 'ఈ-ప్లూటో 7జీ'గా దీనికి నామకరణం చేశారు. సంగారెడ్డి జిల్లా కందిలోని ఐఐటీ ప్రాంగణం పక్కనే ఈ సంస్థ ఉత్పత్తి యూనిట్‌ను నెలకొల్పారు. నెలకు 2వేల ఎలక్ట్రిక్ వాహనాలను ఉత్పత్తి చేసే సామర్థ్యంతో దీన్ని నిర్మించారు. ఈ నెల 9న నీతి ఆయోగ్ సభ్యుడు డాక్టర్ వీకే సారస్వత్, డీఆర్‌డీఓ ఛైర్మన్ డాక్టర్ సతీష్‌రెడ్డి, ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్‌మూర్తి, ఐటీశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్‌రంజన్ చేతుల మీదుగా ఈ స్కూటర్‌ను మార్కెట్లోకి విడుదల చేయనున్నారు.

## హీరో మోటోకార్ప్ లాభం రూ.905 కోట్లు

- మధ్యంతర డివిడెండు 3250%




**దిల్లీ:** 2019-20 ఆర్థిక సంవత్సరం డిసెంబరు త్రైమాసికంలో హీరో మోటోకార్ప్ రూ.905.13 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. అంత క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే సమయంలో సంస్థ ఆర్జించిన రూ.772.81 కోట్ల నికర లాభంతో పోలిస్తే ఇది 17.07 శాతం ఎక్కువ. కార్యకలాపాల ఆదాయం మాత్రం రూ.7,937.33 కోట్ల నుంచి రూ.7,074.86 కోట్లకు తగ్గింది. రూ.2 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుకు 3250% (రూ.65) మధ్యంతర డివిడెండును కంపెనీ డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది. 'ఆర్థిక మందగమనం నేపథ్యంలో ద్విచక్ర వాహన రంగం కూడా తీవ్ర సవాళ్లను ఎదుర్కొంటోంది. అయితే, రబీ పంట దిగుబడులపై సానుకూలతలతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మెరుగై, వాహన పరిశ్రమకు తోడ్పాటు అందించే అవకాశం ఉంద'ని హీరో మోటోకార్ప్ సీఎఫ్ఓ నిరంజన్ గుప్తా అభిప్రాయపడుతున్నారు. 2020-21 ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో కంపెనీకి సానుకూలతలు రావొచ్చని ఆయన పేర్కొన్నారు. సమీక్షా త్రైమాసికంలో హీరో మోటోకార్ప్ దేశీయంగా తొలి బీఎస్-6 మోటార్ సైకిల్ స్ప్లెండర్ ఐస్మార్ట్‌ను విడుదల చేసిన సంగతి తెలిసిందే.. దీని తర్వాత హెచ్ఎఫ్-డీలక్స్‌ను కూడా కొత్త ఉద్గార ప్రమాణాలతో విపణిలోకి తీసుకొచ్చింది. ఈ నెల మధ్యలో బీఎస్-4 వాహనాల ఉత్పత్తిని పూర్తిగా నిలిపివేసి తమ పోర్ట్‌ఫోలియోలోని అన్ని ఉత్పత్తులను బీఎస్-6 ప్రమాణాలతో రూపొందించేందుకు కంపెనీ సిద్ధమవుతోంది.

★ బీఎస్ఈలో షేరు 1.56% లాభంతో రూ.2411.90 వద్ద ముగిసింది.

## సన్ ఫార్మా ఆకర్షణీయం

**దిల్లీ:** 2019-20 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో సన్ ఫార్మా రూ.913.52 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. అంత క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే సమయంలో సంస్థ ఆర్జించిన నికర లాభం రూ.1,241.85 కోట్లతో పోలిస్తే ఇది 26.43 శాతం ఎక్కువ. కార్యకలాపాల ఏకీకృత ఆదాయం రూ.7,656.71 కోట్ల నుంచి రూ.8,038.65 కోట్లకు చేరింది. కంపెనీ మొత్తం వ్యయాలు రూ.6,203.14 కోట్ల నుంచి రూ.6,923.40 కోట్లకు చేరాయి. 'భారత్‌లో మా బ్రాండెడ్ వ్యాపారం బాగా సాగుతోంది. అంతర్జాతీయ వ్యాపారానికొస్తే కొత్త మార్కెట్లలో మా పోర్ట్‌ఫోలియోను విస్తరించడానికి కృషి చేస్తున్నాం. అలాగే గ్లోబల్ స్పెషాల్టీ వ్యాపారాన్ని కూడా క్రమంగా పెంచుకుంటున్నామ'ని సన్ ఫార్మా ఎండీ దిలీప్ సంఘ్వీ వెల్లడించారు. రూ.1 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుకు రూ.3 మధ్యంతర డివిడెండును కంపెనీ డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది.

## ఎన్ఎండీసీ లాభం రూ.1,394 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: ప్రభుత్వ రంగ ఖనిజాల సంస్థ అయిన ఎన్ఎండీసీ లిమిటెడ్ కన్సాలిడేటెడ్ ఖాతాల ప్రకారం ఈ ఆర్థిక సంవత్సరం మూడవ త్రైమాసికంలో రూ.3,136 కోట్ల ఆదాయాన్ని, రూ.1,394 కోట్ల నికరలాభాన్ని ఆర్జించింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదేకాలంలో ఆదాయం రూ.3,785 కోట్లు, నికరలాభం రూ.1,569 కోట్లు ఉన్నాయి. దీంతో పోల్చితే ప్రస్తుత మూడో త్రైమాసికంలో ఆదాయం, నికరలాభం తగ్గినట్లు స్పష్టమవుతోంది. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి 9 నెలల కాలానికి ఎన్ఎండీసీ మొత్తం ఆదాయం రూ.8,892 కోట్లు, నికరలాభం రూ.3,258 కోట్లు ఉన్నాయి.

**మధ్యంతర డివిడెండ్:** వాటాదార్లకు 2019-20 ఆర్థిక సంవత్సరానికి ఒక్కో షేర్‌కు (రూ.1 ముఖ విలువ) రూ.5.29 చొప్పున మధ్యంతర డివిడెండ్ చెల్లించాలని ఎన్ఎండీసీ లిమిటెడ్ డైరెక్టర్ల బోర్డు ప్రతిపాదించింది. దీనికి ఈ నెల 21వ తేదీని రికార్డు తేదీగా నిర్ణయించారు.

## ఎఫ్‌టీసీసీఐ పురస్కారాలకు నామినేషన్ల ఆహ్వానం

హైదరాబాద్(రెడ్‌హిల్స్), న్యూస్‌టుడే: తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ (ఎఫ్‌టీసీసీఐ) 22 విభాగాల్లో వార్షిక 'ఎక్సలెన్సీ పురస్కారాలు-2019' కోసం నామినేషన్లను ఆహ్వానిస్తోంది. గురువారం ఫెడరేషన్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పురస్కారాల కమిటీ ప్రతినిధులు గౌరా శ్రీనివాస్, జస్టిస్ వి.భాస్కరరావు, సూరజ్ ప్రసాద్ అగర్వాల్, రమాకాంత్ ఇనాని, కె.భాస్కరరెడ్డి, వి.ఎస్.రాజులతో కలిసి కమిటీ ఛైర్మన్ రవీంద్రమోదీ పురస్కారాల నామినేషన్లకు సంబంధించిన కరదీపికను ఆవిష్కరించారు. మరిన్ని వివరాలకు కులకర్ణి (8008579625) నెంబరులో సంప్రదించాలని కోరారు.

## 'ఐడియా' పోస్ట్‌పెయిడ్ ఉండదు

**దిల్లీ:** తమ పోస్ట్‌పెయిడ్ సేవల నుంచి ఐడియా బ్రాండ్‌ను ఉపసంహరించబోతున్నట్లు టెలికాం సంస్థ వొడాఫోన్‌ఐడియా వెల్లడించింది. వొడాఫోన్, ఐడియా బ్రాండ్ల విక్రయశాలలు, డిజిటల్ ఛానళ్లలో 'వొడాఫోన్ రెడ్ పోస్ట్‌పెయిడ్' పథకాలు మాత్రమే అందుబాటులో ఉంటాయి. ప్రస్తుతం ఐడియా బ్రాండ్‌పై పోస్ట్‌పెయిడ్ సేవలను ఐడియా నిర్వాణ కింద పొందుతున్న వారు కూడా వొడాఫోన్ రెడ్ పథకాలకు మారాల్సి ఉంటుందని కంపెనీ వెల్లడించింది. ప్రీపెయిడ్ చందాదార్లు మాత్రం వొడాఫోన్ లేదా ఐడియా బ్రాండ్లపై సేవలు పొందొచ్చు.

# ఈనాడు బిజినెస్

| సెన్సెక్స్ ▲163 | నిఫ్టీ ▲49 | రూపాయి 6 పైసలు ▲ | ముడి చమురు ▼ |
|---|---|---|---|
| 41306 | 12138 | 71.19 | 54.93 (బ్రెంట్ ధర డాలర్లలో) |

# ఊతమిచ్చిన ఆర్‌బీఐ సమీక్ష

## 163 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్

సూచీలు వరుసగా నాలుగో రోజూ లాభాల్లో ముగిశాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ప్రకటించిన ద్వైమాసిక ద్రవ్య, పరపతి విధాన సమీక్ష నిర్ణయాలు మదుపర్లను మెప్పించాయి. కీలక రేట్లలో మార్పు చేయకపోయినా, వృద్ధికి ఊతమిచ్చేలా సర్దుబాటు ధోరణి కొనసాగిస్తామని ఆర్‌బీఐ ప్రకటించడం సెంటిమెంటును మెరుగుపరిచింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 5 శాతం వృద్ధి రేటును కొనసాగించడం, వచ్చే ఆర్థిక సంవత్సరానికి 6 శాతం వృద్ధి రేటును అంచనా వేయడం కలిసొచ్చింది. బ్యాంకింగ్, ఆర్థిక షేర్లలో కొనుగోళ్ల మద్దతు కనిపించింది. సెన్సెక్స్ ఉదయం 41,209.13 పాయింట్ల వద్ద సానుకూలంగా ప్రారంభమైంది.

సమీక్ష

ఒక దశలో 41,113.11 పాయింట్ల కనిష్ఠాన్ని తాకింది. ఆ తర్వాత ఆర్‌బీఐ సమీక్ష నిర్ణయాల ప్రకటన అనంతరం తిరిగి లాభాల్లోకి చేరింది. చివరకు 163.37 పాయింట్ల లాభంతో 41,306.03 పాయింట్ల వద్ద స్థిరపడింది. నిఫ్టీ 50 సైతం 48.80 పాయింట్ల లాభంతో 12,137.95 పాయింట్ల వద్ద ముగిసింది.

☛ ఆర్‌బీఐ సమీక్ష తర్వాత రేట్ల ఆధారిత షేర్లు వెలుగులోకి వచ్చాయి. ఇండస్ఇండ్ బ్యాంక్ 4.85%, ఆర్‌బీఎల్ బ్యాంక్ 4.53%, ఎస్‌బీఐ 3.55%, యెస్ బ్యాంక్ 2.53%, యాక్సిస్ బ్యాంక్ 1.77%, ఫెడరల్ బ్యాంక్ 1.65%, సిటీ యూనియన్ బ్యాంక్ 1.39% చొప్పున పెరిగాయి. వాహన రంగానికి చెందిన ఐషర్ మోటార్స్ 5.26%, బాష్ 2.44%, టీవీఎస్ 2.16%, హీరో మోటోకార్ప్ 1.56%, మదర్సన్ సుమి సిస్టమ్స్ 1% మేర రాణించాయి. ఇక సెన్సెక్స్ 30 షేర్లలో 17 లాభాల్లో ముగిశాయి. రంగాల వారీ సూచీలకొస్తే ఫైనాన్స్, బ్యాంకింగ్, వాహన సూచీలు లాభపడ్డాయి. స్థిరాస్తి సూచీ డీలా పడింది.

### నేటి బోర్డు సమావేశాలు

★ టాటా స్టీల్ ★ ఎన్‌టీపీసీ ★ ఏసీసీ ★ యూపీఎల్ ★ అబాట్ ఇండియా ★ బ్రిటానియా ★ కంటైనర్ కార్పొరేషన్ ★ వోల్టాస్ ★ వర్ల్‌పూల్ ★ ప్రోక్టర్ అండ్ గ్యాంబెల్ ★ టీవీ టుడే ★ ఇమామి, ఎన్‌సీసీ ★ వెంకీస్ ★ ఆల్కెమ్ లేబొరేటరీస్ ★ ఇండియా సిమెంట్స్ ★ ది న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ ★ ఐనాక్స్ విండ్ ★ కోల్తే పాటిల్ డెవలపర్స్ ★ 3ఐ ఇన్ఫోటెక్ ★ క్యామ్లిన్ ఫైన్ సైన్సెస్ ★ మ్యాక్స్ ఇండియా ★ ఒబెరాయ్ రియాల్టీ

### 6వ తేదీకి ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)



(100కు రూపాయలలో)

| కోడిగుడ్లు | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 315 | వరంగల్ | 318 |
| 7వ తేదీకి | | విశాఖపట్నం | 375 |
| విజయవాడ | 325 | చిత్తూరు | 373 |
| గోదావరి | 325 | చిల్లరగా(డజను) | 60 |

# అబ్బో.. ఎంత ముద్దొస్తోందో



## దిల్లీ వాహన ప్రదర్శనలో ఆకట్టుకుంటున్న కార్లు

వాహన ప్రదర్శన ఇంకా ప్రారంభమే కాలేదు.. అయితేనేం.. అదిరిపోయే కార్లు.. ఆకట్టుకునే బైకులు రెండు రోజుల ముందే నోయిడాలో కార్ల పండగ వచ్చేసింది. గురువారం ప్రదర్శించిన ఒక్కో వాహనానిది.. ఒక్కో ప్రత్యేకత ట్రైలరే ఇంత బాగుంటే.. సినిమా ఇంకెంత బావుంటుందో..

### కమ్మగా వంట.. హాయిగా నిద్ర

మెర్సిడెస్ మార్కోపోలో

మెర్సిడెస్ బెంజ్ తన విలాసవంత బహుళ ప్రయోజిత వాహనం (ఎంపీవీ) 'వి క్లాస్ మార్కో పోలో'ను ఆవిష్కరించింది. రెండు వేరియంట్లలో ఇది లభ్యం కానుంది. మార్కోపోలో ఆరిజన్ ధర రూ.1.38 కోట్లు కాగా.. మార్కో పోలో రూ.1.46 కోట్లు (ఎక్స్ షోరూం). సెలవు రోజులు, వారాంతపు పర్యటనలకు సరిపోయేలా అవసరమైన ప్రత్యేకతలతో దీనిని తీసుకొచ్చింది. 1950 సీసీ డీజిల్ ఇంజిన్‌తో కూడిన ఈ కొత్త మోడల్‌లో.. నలుగురు పడుకునేందుకు వీలు, రెండు బర్నర్ల స్టవ్‌తో కూడిన కిచెన్, సింక్, రిఫ్రిజిరేటర్, మడత పట్టే కుర్చీ లాంటివి ఉన్నాయి. నాలుగు సీట్లు ఉంటాయి. దీనిని ఆరు వరకు పొడిగించుకోవచ్చు.

### ఫటాఫట్ ఛార్జ్.. చకాచకా చల్



వినూత్న సాంకేతికత, విద్యుత్ వాహనాల తయారీలో తమకున్న సామర్థ్యాన్ని చాటిచెబుతూ ఎలక్ట్రిక్ కారు ఐడీ క్రాజ్ కాన్సెప్ట్ మోడల్‌ను ఫోక్స్‌వ్యాగన్ ప్రదర్శించింది. రేస్‌పోలో మోడల్‌ను కూడా ఆవిష్కరించింది. ఐడీ క్రాజ్ కారు బ్యాటరీ 39 నిమిషాల్లో 80 శాతం ఛార్జీ అవుతుంది. దీంతో 500 కి.మీల ప్రయాణం చేయొచ్చు.

### 'పెట్రోలు' ప్రేమికుల కోసం



మారుతీ విటారా బ్రెజా

మారుతీ సుజుకీ స్పోర్ట్ యుటిలిటీ వాహనం 'విటారా బ్రెజా' ఇక పెట్రోలు వెర్షన్‌లోనూ లభ్యం కానుంది. బీఎస్-6 పెట్రోలు ఇంజిన్‌తో కూడిన బ్రెజాను గురువారం వాహన ప్రదర్శనలో కంపెనీ ఆవిష్కరించింది. దేశవ్యాప్తంగా మారుతీ ఎరీనా విక్రయకేంద్రాల్లో ఈ కారుకు బుకింగ్‌లు ప్రారంభమయ్యాయి. 1.5 లీటర్ పెట్రోలు ఇంజిన్‌తో తీసుకొచ్చిన ఈ కొత్త బ్రెజాలో ఆటో రిట్రేసింగ్ అవుట్‌సైడ్ రేర్ వ్యూ మిర్రర్, ఆటో డిమ్మింగ్ లాంటి ప్రత్యేకతలు ఉన్నాయి

### అబ్బో.. చేతితోనే చేసేశారట..

దావోట్ మోటార్స్ ఎలక్ట్రిక్ బైక్

రాజస్థాన్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తోన్న దావోట్ మోటార్స్ ఎలక్ట్రిక్ బైకును ప్రదర్శించింది. చేతితోనే తయారుచేయడం ఈ ఎలక్ట్రిక్ బైక్ ప్రత్యేకత. ఈ బైకు వాణిజ్య ఉత్పత్తిని ఈ ఏడాది చివరి త్రైమాసికంలో కంపెనీ ప్రారంభించనుంది.



వాహన ప్రదర్శనలో కొత్త ఎస్‌యూవీ క్రెటాతో హ్యుందాయ్ ప్రచారకర్త, సినీ నటుడు షారూక్ ఖాన్

# అరబిందో ఆదాయంలో 12% వృద్ధి

**ఈనాడు, హైదరాబాద్:** అరబిందో ఫార్మా కన్సాలిడేటెడ్ ఖాతాల ప్రకారం ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ.705.3 కోట్ల నికరలాభాన్ని ప్రకటించింది. త్రైమాసిక ఆదాయం రూ.5,895 కోట్లు నమోదైంది. ఈపీఎస్ రూ.12.04 ఉంది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదేకాలంలో ఆదాయం రూ.5,269 కోట్లు, నికరలాభం రూ.712.2 కోట్లు ఉన్నాయి. దీంతో పోల్చితే ప్రస్తుత మూడో త్రైమాసికంలో ఆదాయం 11.9 శాతం పెరిగితే, నికరలాభం 1 శాతం క్షీణించింది. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి 9 నెలల కాలంలో అరబిందో ఫార్మా ఆదాయం రూ.16,940 కోట్లు కాగా, దానిపై రూ.1,980 కోట్లు, ఈపీఎస్ రూ.33.81 నమోదయ్యాయి. సమీక్షా త్రైమాసికంలో యూఎస్ ఫార్ములేషన్ల ఆదాయం 22 శాతం పెరిగి రూ.2,969 కోట్లకు చేరుకుంది. ఐరోపా దేశాల్లో ఫార్ములేషన్ల అమ్మకాలు 14.2 శాతం పెరిగాయి. యాంటీ రిట్రోవైరల్ (ఏఆర్వీ) విభాగంలో 11.4 శాతం వృద్ధి కనిపించింది. పరిశోధన- అభివృద్ధి కార్యకలాపాలపై రూ.253 కోట్లు వెచ్చించినట్లు, ఆదాయంలో ఇది 4.3 శాతానికి సమానమని కంపెనీ పేర్కొంది. యూఎస్‌లో నాలుగు ఔషధాలకు తుది మార్కెటింగ్ అనుమతులు వచ్చాయని, మరొక ఔషధానికి (డైక్లోఫెనాక్ సోడియం) తాత్కాలిక అనుమతి లభించినట్లు వెల్లడించింది.

2019-20లో వాటాదార్లకు రెండో మధ్యంతర డివిడెండ్ కింద 175 శాతం (రూ.1 ముఖ విలువ కల ఒక్కో షేరుకు రూ.1.75 చొప్పున) డివిడెండ్ చెల్లించనున్నారు. ప్రత్యేక ఔషధాల శ్రేణిని విస్తృతపరచుకునేందుకు గట్టి ప్రయత్నాలు చేస్తున్నామని అరబిందో ఫార్మా ఎండీ ఎన్.గోవిందరాజన్ తెలిపారు. దాదాపు అన్ని దేశాల్లో అమ్మకాలు మెరుగ్గా నమోదు చేయగలిగినట్లు వివరించారు.

### మార్కెట్ కబుర్లు

★ ఛత్తీస్‌గఢ్‌లోని రహదారి ప్రాజెక్టు నిమిత్తం రూ.860.50 కోట్ల విలువైన కాంట్రాక్టును **దిలీప్ బిల్డ్‌కాన్** దక్కించుకుంది. రహదారి పొడవు 39.30 కి.మీలు కాగా.. రెండేళ్లలో దీనిని పూర్తి చేయాల్సి ఉంటుంది.

★ కాల్కిసిన్ మందుబిళ్లలకు యూఎస్ఎఫ్‌డీఏ నుంచి అనుమతులు లభించాయని **గ్రాన్యూల్స్ ఫార్మా** పేర్కొంది.

★ **అదానీ గ్రీన్ ఎనర్జీ** నిర్వహిస్తున్న అన్ని పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టుల్లో 50 శాతం వాటాను టోటల్ కొనుగోలు చేయనుంది. లావాదేవీ విలువ 510 మిలియన్ డాలర్లు.

★ నువోకో విస్టాస్ కార్పొరేషన్‌కు **ఇమామీ** తన సిమెంటు వ్యాపారాన్ని విక్రయించనుంది. లావాదేవీ విలువ రూ.5,500 కోట్లు.

★ టాటా గ్రూపునకు చెందిన వినియోగదారు మొబైల్ కార్యకలాపాలను భారతీ ఎయిర్‌టెల్‌లో విలీనం చేసేందుకు టెలికాం విభాగం ఆమోదించిందని **టాటా టెలీసర్వీసెస్** (మహారాష్ట్ర) సమాచారమిచ్చింది.

### అక్టోబరు-డిసెంబరు త్రైమాసిక ఫలితాలు

(రూ.కోట్లలో)

| కంపెనీ | నికర లాభం/(నష్టం) 2019–20 | నికర లాభం/(నష్టం) 2018–19 | మొత్తం ఆదాయం 2019–20 | మొత్తం ఆదాయం 2018–19 |
|---|---|---|---|---|
| ఐషర్ మోటార్స్ | 498.70 | 532.95 | 2371.01 | 2341.06 |
| లుపిన్ | (835.00) | (151.75) | 3716.00 | 3821.19 |
| ఏపీఎం టెర్మినల్స్ పిపావవ్ | 134.00 | 60.90 | 207.90 | 185.00 |
| పీటీసీ ఇండియా | 63.49 | 90.20 | 3834.42 | 3309.58 |
| అదానీ పవర్ | (702.40) | (1180.78) | 6684.52 | 6667.11 |
| ఆదిత్య బిర్లా ఫ్యాషన్ | (37.64) | 70.25 | 2582.74 | 2281.55 |
| యునైటెడ్ బ్యాంక్ | 113.56 | (1139.25) | 2971.38 | 2846.23 |
| యూకో బ్యాంక్ | (960.00) | (998.74) | 4514.21 | 3585.56 |
| జీఎస్‌కే కన్జూమర్ హెల్త్‌కేర్ | 276.63 | 221.06 | 1274.90 | 1241.07 |
| కాగ్నిజెంట్★ | 39.50 | 430.00 | 64.80 | 410.00 |
| ఐడీఎఫ్‌సీ | (342.67) | (670.92) | 121.53 | 47.62 |
| యునైటెడ్ బ్రూవరీస్ | 107.00 | 109.48 | 3257.61 | 3191.32 |
| బాటా ఇండియా | 118.26 | 103.05 | 830.82 | 779.79 |
| దాల్మియా భారత్ | 26.00 | 31.00 | 2486.00 | 2228.00 |
| హెచ్‌సీసీ | 234.00 | 9.91 | 1075.00 | 1102.00 |

★ కోట్ల డాలర్లలో

## మూడు రాజధానులు ఎక్కడా లేవు: ఉండవల్లి

**ఈనాడు డిజిటల్, రాజమహేంద్రవరం:** దేశంలో మూడు రాజధానులనేవి ఏ రాష్ట్రంలోనూ లేవని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ అన్నారు. గురువారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. కొన్ని రాష్ట్రాల్లో హైకోర్టు ఒకచోట.. మిగిలినవన్నీ మరోచోట ఉన్నాయని, మరికొన్ని రాష్ట్రాల్లో అసెంబ్లీ సమావేశాలు రెండు, మూడుచోట్ల జరుగుతున్నాయని పేర్కొన్నారు. కానీ మూడు రాజధానులను తాను ఎక్కడా చూడలేదన్నారు. ఇటీవల జగన్ మాట్లాడుతూ హైదరాబాద్‌ను మించి విశాఖను అభివృద్ధి చేస్తామని, యువత ఉద్యోగాల కోసం ఎక్కడకూ వెళ్లాల్సిన పనిలేదంటూ మాట్లాడారని.. అసలు ఒకేచోట అభివృద్ధి వద్దనే తాము ఎప్పటి నుంచో చెబుతున్నామని పేర్కొన్నారు.

## కర్ణాటక మంత్రివర్గం విస్తరణ

**ఈనాడు డిజిటల్, బెంగళూరు:** కర్ణాటక ప్రభుత్వం మంత్రివర్గాన్ని విస్తరించింది. గురువారం ఉదయం 10.30 గంటలకు రాజ్‌భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పది మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. వీరంతా కాంగ్రెస్, జేడీఎస్ పార్టీలకు రాజీనామా చేసి భాజపాలో చేరి ఉప ఎన్నికల్లో గెలిచారు. ఉప ఎన్నికల్లో గెలిచిన 11మందిలో ఒక్కరికి మంత్రివర్గంలో చోటు దక్కలేదు. కొత్తగా చేరిన సభ్యులతో కర్ణాటక మంత్రివర్గం మొత్తం సభ్యుల సంఖ్య 28కి చేరగా, మరో ఆరు ఖాళీలున్నాయి. రమేశ్ జార్ఖిహొళి, ఎస్.టి.సోమశేఖర్, కె.గోపాలయ్య, నారాయణగౌడ, భైరతి బసవరాజు, కె.సుధాకర్, శ్రీమంత పాటిల్, శివరామ్ హెబ్బార్, ఆనంద్ సింగ్, బి.సి.పాటిల్‌చే గవర్నర్ వాజూభాయ్ వాలా మంత్రులుగా ప్రమాణం చేయించారు.

## 13న మండల కేంద్రాల్లో నిరసనలు

### ఏపీ రైతు సంఘం

**ఈనాడు డిజిటల్, అమరావతి:** కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి నిధుల కేటాయింపులో తీవ్ర అన్యాయం జరిగిందని, ఇందుకు నిరసనగా ఈ నెల 13న అన్ని మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రకటించింది.

# చంద్రబాబు మాజీ పీఎస్ నివాసంలో ఐటీ సోదాలు

ప్రస్తుతం జీఏడీలో పనిచేస్తున్న శ్రీనివాసరావు ● రాత్రి వరకూ తనిఖీలు

**ఈనాడు, అమరావతి, ఈనాడు డిజిటల్-విజయవాడ:** తెదేపా అధ్యక్షుడు చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆయన వద్ద వ్యక్తిగత సహాయకుడిగా పని చేసిన పెండ్యాల శ్రీనివాసరావు నివాసంలో ఆదాయపు పన్ను శాఖాధికారులు గురువారం సోదాలు నిర్వహించారు. విజయవాడ సిద్ధార్థనగర్‌లో కంచుకోట పేరుతో ఉన్న అపార్ట్‌మెంట్ మూడో అంతస్తులోని ఆయన నివాసంలో ఉదయం నుంచి రాత్రి 10 గంటల వరకూ ఈ తనిఖీలు కొనసాగుతూనే ఉన్నాయి. దిల్లీ నుంచి వచ్చిన ప్రత్యేక బృందాలు స్థానిక పోలీసులకు కూడా సమాచారం ఇవ్వకుండా.. కేంద్ర బలగాలనే వెంట తీసుకెళ్లి రహస్యంగా సోదాలు నిర్వహిస్తుండటం గమనార్హం. తనిఖీల సందర్భంగా ఇంట్లో ఉన్నవారిని బయటకు, బయట వ్యక్తులను లోపలికి అనుమతించలేదు. ఈ దృశ్యాలను చిత్రీకరిస్తున్న మీడియాను అక్కడి నుంచి వెళ్లిపోవాలని ఆదేశించారు. సాయంత్రం 5 గంటల సమయంలో ఐటీ అధికారులు ఓ ప్రింటర్‌ను బయట నుంచి లోపలికి తీసుకెళ్లారు. శ్రీనివాసరావు ప్రస్తుతం సచివాలయంలోని సాధారణ పరిపాలన విభాగంలో పనిచేస్తున్నారు. పలు లావాదేవీలపైన ఆదాయ పన్ను శాఖాధికారులు ఆయన్ను ప్రశ్నించినట్లు తెలిసింది. హైదరాబాద్‌లో శ్రీనివాసరావుకు సంబంధించిన వ్యక్తుల ఇళ్లలోనూ తనిఖీలు చేసినట్లు సమాచారం.



విజయవాడలోని గాయత్రినగర్‌లో శ్రీనివాస్ ఉంటున్న అపార్టుమెంట్ కాంప్లెక్స్

# సీడబ్ల్యూసీ అనుమతి లేకుంటే కొత్తవే

● ప్రాజెక్టులపై కేంద్రం స్పష్టీకరణ

**ఈనాడు హైదరాబాద్:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టినా, పునర్విభజన తర్వాత చేపట్టినా కేంద్ర జల సంఘం(సీడబ్ల్యూసీ) సాంకేతిక అనుమతి లేని ప్రాజెక్టులన్నింటినీ కొత్తవిగానే పరిగణించాల్సి ఉంటుందని, ఈ అంశాన్ని తుది నిర్ణయం కోసం అపెక్స్ కౌన్సిల్ ముందు పెడతామని కేంద్ర జల్‌శక్తి మంత్రిత్వశాఖ కార్యదర్శి పేర్కొన్నారు. అపెక్స్ కౌన్సిల్‌కు కేంద్ర జల్‌శక్తి మంత్రి ఛైర్మన్ కాగా, రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సభ్యులు. గత నెల 21న దిల్లీలో రెండు రాష్ట్రాల జలవనరుల శాఖ అధికారులు, కృష్ణా, గోదావరి నదీ యాజమాన్య బోర్డుల అధికారులు, కేంద్ర జలసంఘం అధికారులతో జలవనరుల మంత్రిత్వశాఖ సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో చర్చించి తీసుకొన్న నిర్ణయాలతో కూడిన మినిట్స్‌ను సంబంధిత విభాగాలన్నింటికి పంపింది.

- ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలోని నిబంధన 85(8)(డి) ప్రకారం కృష్ణా, గోదావరి బేసిన్లలో కొత్త ప్రాజెక్టులకు సంబంధించిన సాంకేతిక అంశాలను సంబంధిత బోర్డులు పరిశీలించి సిఫార్సు చేయాలి. అప్పటికే ఉన్న ప్రాజెక్టులపై కొత్త ప్రాజెక్టుల ప్రభావం ఉండకుండా చూడటం ఈ బోర్డుల బాధ్యత. కొత్త ప్రాజెక్టుల డి.పి.ఆర్.లు అందజేయాలని బోర్డులు కోరినా రెండు రాష్ట్ర ప్రభుత్వాలు ఇవ్వలేదని బోర్డులు నివేదించాయి.
- పునర్విభజన ముందు చేపట్టినంత మాత్రాన దానిని అప్పటికే ఉన్న ప్రాజెక్టుగా గుర్తించడానికి లేదని, ముందుగా చేపట్టిన దానికి భిన్నంగా మార్పులు చేయడం, ఎక్కువ నీటి మళ్లింపు వల్ల దిగువ రాష్ట్రంపై పడే ప్రభావం ఇలా అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని బోర్డులు తాజాగా ఆమోదం తెలపాలని ఆంధ్రప్రదేశ్ పేర్కొంది.
- కృష్ణా బోర్డు కేంద్ర కార్యాలయాన్ని వెంటనే కాకుండా కొన్ని నిర్వహణ కారణాల దృష్ట్యా సరైన సమయంలో ఆంధ్రప్రదేశ్‌కు తరలించాలని నిర్ణయించారు. బోర్డుల నిర్వహణకు నిధులు విడుదల చేయాలని రెండు రాష్ట్రాలకు కేంద్రం సూచించింది.
- బోర్డుల పరిధికి సంబంధించిన అంశాన్ని కూడా అపెక్స్ కౌన్సిల్‌కు నివేదించాలని నిర్ణయించారు.
- కృష్ణా జల వివాద ట్రైబ్యునల్-2 కేటాయింపులకు, పరిధికి సంబంధం లేదని, కేంద్రం నోటిపై చేయాలని ఆంధ్రప్రదేశ్ కోరింది.

## కడప జిల్లా తెదేపా అధ్యక్షుడి ఇంట్లో ఐటీ సోదాలు

**కడప, న్యూస్‌టుడే:** కడపలోని ద్వారకానగర్‌లో ఉన్న తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసులరెడ్డి ఇంట్లో గురువారం ఐటీ అధికారులు సోదాలు చేశారు. ఝార్ఖండ్, మహారాష్ట్రకు చెందిన ఐటీ అధికారులు, వారికి రక్షణగా కేంద్ర పోలీసు బలగాలు వచ్చాయి. సోదాల సమయంలో శ్రీనివాసులరెడ్డి ఇంట్లో లేరు. ఆయన తల్లి, మాజీ మంత్రి రాజగోపాల్‌రెడ్డి సతీమణి హేమలత ఒక్కరే ఉన్నారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి సంబంధిత పోలీసులను ప్రశ్నించడంతో వైద్యుడిని, మరో మహిళా కానిస్టేబుల్‌ను ఆమెకు రక్షణగా ఉంచారు. ఇదే సమయంలో హైదరాబాద్‌లోని శ్రీనివాసులరెడ్డి స్వగృహంలోనూ సోదాలు జరిగినట్లు సమాచారం.

## 8, 9వ తేదీల్లో పౌరహక్కుల సంఘం సభలు

**గాంధీనగర్(విజయవాడ), న్యూస్‌టుడే:** పౌరహక్కుల సంఘం 19వ రాష్ట్ర మహా సభలను ఈ నెల 8, 9వ తేదీల్లో విశాఖపట్నంలో నిర్వహించనున్నట్లు పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి నంబూరి శ్రీమన్నారాయణ తెలిపారు. విజయవాడలో గురువారం కార్యక్రమ గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు వి.చిట్టిబాబు, చిలుకా చంద్రశేఖర్, ఆర్.శ్రీధర్, టి.గంగాధర్, డాక్టర్ బ్రహ్మం, విఘ్నేశ్, ఆంజనేయులు పాల్గొన్నారు.

## పేరేచెర్ల-సాతులూరు మధ్య డబ్లింగ్ పూర్తి

**ఈనాడు, అమరావతి:** గుంటూరు జిల్లాలోని పేరేచెర్ల-సాతులూరు మధ్య 23కిలోమీటర్ల మేర రెండో లైను(డబ్లింగ్) నిర్మాణం, విద్యుదీకరణను దక్షిణ మధ్య రైల్వే అధికారులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొచ్చారు. గుంటూరు-గుంతకల్లు మధ్య 401కి.మీ.మేర రూ.3,631 కోట్లతో రెండో లైన్ నిర్మాణం, విద్యుదీకరణ ప్రాజెక్టును 2016-17లో చేపట్టారు. ఇందులో భాగంగా పేరేచెర్ల-సాతులూరు మధ్య మార్గాన్ని పూర్తిచేసి అందుబాటులోకి తెచ్చారు. రాయలసీమ ప్రాంతానికి, కర్ణాటకకు ప్రయాణికుల, సరుకు రవాణా రైళ్లను మరిన్ని నడిపేందుకు ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని అధికారులు తెలిపారు.

## అంతర్జాతీయ ప్రమాణాలతో శిక్షణ: గౌతమ్‌రెడ్డి

**ఈనాడు, అమరావతి:** ఏరోస్పేస్, రక్షణ, ఆటోమొబైల్ రంగాల్లో నైపుణ్యం సాధించేలా ప్రపంచ స్థాయి నైపుణ్యాభివృద్ధి, శిక్షణను ప్రభుత్వం అందిస్తోందని పరిశ్రమల శాఖ మంత్రి గౌతమ్‌రెడ్డి పేర్కొన్నారు. లఖ్‌నవూలో జరుగుతున్న డిఫెన్స్ ఎక్స్‌పో-2020లో రెండోరోజు గురువారం ఆయన మాట్లాడారు. 'రక్షణ రంగానికి సంబంధించిన పలు సంస్థలు రాష్ట్రంలో కొలువయ్యాయి. పరిశ్రమలకు 24 గంటలూ నాణ్యమైన విద్యుత్తును అందించే దక్షిణాది రాష్ట్రాల్లో ప్రథమ స్థానంలో ఉన్నాం' అని పేర్కొన్నారు.

## 'యాన్యుటీ' విధానంలో జిల్లా ఆసుపత్రులు, వైద్య కళాశాలల నిర్మాణాలు

**ఈనాడు, అమరావతి:** జిల్లా ఆసుపత్రులు, వైద్య కళాశాలలు, సూపర్ స్పెషాల్టీ ఆసుపత్రుల నిర్మాణాలను 'యాన్యుటీ' విధానంలో చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీచేశారు. 'ఆసక్తి వ్యక్తీకరణ' విధానంలో అంతర్జాతీయ స్థాయి సంస్థల నుంచి ఏపీ వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ఈ నెల 20 నుంచి దరఖాస్తులను స్వీకరిస్తుందని అందులో పేర్కొన్నారు.

## వర్సిటీని తరలించొద్దు: అశోక్‌బాబు

**ఈనాడు, అమరావతి:** ప్రభుత్వం రాష్ట్రాన్ని పరిపాలిస్తుందో, నాశనం చేస్తుందో చెప్పడానికి ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని గుంటూరు నుంచి బాపట్లకు తరలించాలన్న నిర్ణయమే నిదర్శనమని తెదేపా ఎమ్మెల్సీ అశోక్‌బాబు వ్యాఖ్యానించారు. తరలింపు ప్రతిపాదన సరికాదని విశ్వవిద్యాలయం వీసీ లేఖలో చెప్పినా పెడచెవిన పెట్టడం బాధాకరమన్నారు.

# నన్ను చంపేస్తారనుకున్నా

● కమాండోల విన్యాసాన్ని ఉగ్రదాడిగా భావించా..
● డీజీపీకి బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ ఫ్లెమింగ్ ఫిర్యాదు

**ఈనాడు, విశాఖపట్నం:** 'కమాండోల నమూనా విన్యాసం చూసి తీవ్ర భయాందోళనకు గురయ్యా. నన్ను చంపేయబోతున్నారేమోనని భయపడి పరుగులు తీశా'నని బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ ఆండ్రూ ఫ్లెమింగ్ నేరుగా డీజీపీ గౌతంసవాంగ్‌కు ఫిర్యాదు చేశారు. విశాఖలోని ఓ అయిదు నక్షత్రాల హోటల్‌లో అతిథులకు ముందస్తు సమాచారం లేకుండానే నమూనా విన్యాసాలు నిర్వహించడంపై ఆయన ఆగ్రహం, అసహనం వ్యక్తం చేశారు. తనకు ఎదురైన చేదు అనుభవాన్ని వివరించారు. ఆండ్రూ ఫ్లెమింగ్ బుధవారం హోటల్‌కు వచ్చారు. గురువారం ఉదయం ఆయన రిసెప్షన్ వద్ద ఉండగా హఠాత్తుగా బాంబు పేలింది. వెంటనే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త నిర్వహణలో ఉన్న కమాండోలు ఆయుధాలతో హోటల్‌లోకి ప్రవేశించారు. ఈ హఠాత్పరిణామంతో కంగారుపడ్డ ఆండ్రూ ఫ్లెమింగ్ ఉగ్రదాడి అని భావించి భయాందోళనతో పరుగెత్తుతూ సమీపంలోని రిసెప్షన్ డెస్కు వెనక భాగంలో దాక్కున్నారు. తనకు గుండెదడ పెరిగిందని వాపోయారు. సమీపంలోనే ఉన్న మరికొందరు అతిథులు కూడా కంగారు పడ్డారు.



కాసేపటికి కొందరు హోటల్ సిబ్బంది ఆయన్ని, అతిథులను చూసి నవ్వడంతో అంతా విస్తుపోయారు. నమూనా విన్యాసమని చెప్పేసరికి ఫ్లెమింగ్ తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. తనకు గుండె సంబంధిత సమస్య ఉందని, తనకేమైనా అయితే బాధ్యత ఎవరిదని ప్రశ్నించారు. వాస్తవానికి నమూనా విన్యాసాలను ఉదయం పదింటికి నిర్వహిస్తారంటూ హోటల్ సిబ్బంది నోట్ పంపి 30 నిమిషాల ముందే చేయడంతో అంతా ఉగ్రదాడిగానే భావించారు. హోటల్ సిబ్బంది వైఖరి కూడా నిర్లక్ష్యంగా ఉందని, అతిథికి సమాచారం ఇవ్వాల్సిందిపోయి నవ్వి అవమానించారంటూ వెంటనే డీజీపీకి ఫోన్ చేసి ఆండ్రూ ఫ్లెమింగ్ ఫిర్యాదు చేశారు. విశాఖ సీపీ ఆర్.కె.మీనాను డీజీపీ అప్రమత్తం చేశారు. అప్పటికే ఆండ్రూ ఫ్లెమింగ్ హోటల్‌ను ఖాళీ చేసి మరో హోటల్‌కు వచ్చేశారు. సీపీ ఆర్.కె.మీనా అక్కడికి వెళ్లి ఆయన్ను కలిశారు. హోటల్ యాజమాన్యానికి హెచ్చరికలు జారీ చేస్తామంటూ సముదాయించారు. హోటల్ యాజమాన్యానికి వారం ముందే సమాచారమిచ్చామని. వారు అతిథులను అప్రమత్తం చేయకపోవటంతో కొందరు ఆందోళన చెందారని సీపీ వెల్లడించారు.



నమూనా విన్యాసాల్లో పాల్గొన్న కమెండోలు

★ విశాఖ జిల్లాలోని గిరిజన ప్రాంతాల నుంచి మహిళల అక్రమ రవాణా జరుగుతోందని తమ అధ్యయనంలో తేలిందని బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ ఆండ్రూ ఫ్లెమింగ్ చెప్పారు. విశాఖలో విలేకరులతో ఆయన మాట్లాడారు. బ్రిటిష్ రాయబార కార్యాలయం తరఫున సామాజికాభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా పాడేరులోని 'చైతన్య స్రవంతి' సంస్థతో ఈ అంశంపై అధ్యయనం చేయించామని తెలిపారు.

# నెహ్రూ కోసమే దేశాన్ని విభజించారు

(మొదటి పేజీ తరువాయి)
కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని ట్యూబులైట్‌తో పోల్చారు. ధన్యవాద తీర్మానాన్ని పార్లమెంటు ఉభయ సభలు ఆమోదించాయి. మోదీ ప్రసంగం వివరాలు ఆయన మాటల్లోనే...

### కాంగ్రెస్ అసలు రూపం తెలిసేది కాదు

"పౌరసత్వ సవరణ చట్టాన్ని (సీఏఏ) వ్యతిరేకించకపోయి ఉంటే కాంగ్రెస్ అసలు రూపం దేశానికి తెలిసేది కాదు. పార్టీల కోసం ఎవరున్నారు, దేశం కోసం ఎవరున్నారన్నది ఇప్పుడు దేశం గుర్తించింది. ప్రధానమంత్రి కావాలన్న కోరిక ఎవరికైనా ఉండొచ్చు. అందులో తప్పులేదు. కానీ ఎవరినో ప్రధానిని చేయడానికి భారత్ చిత్ర పటంపై సరళ రేఖ గీసి దేశాన్ని విభజించారు. ఆ తర్వాత పాకిస్థాన్‌లో హిందువులు, సిక్కులతోపాటు ఇతర అల్పసంఖ్యాకులు ఎదుర్కొంటూ వస్తున్న హింస ఊహకు అందనిది. దశాబ్దాల తర్వాతా పాకిస్థాన్ ఆలోచన మారలేదు. ఇప్పుడూ అక్కడ అల్పసంఖ్యాకులు వేధింపులకు గురవుతున్నారు. కాంగ్రెస్‌లాంటి పార్టీలు గాంధీజీ మాటలను దశాబ్దాల క్రితమే వదిలిపెట్టాయి. ముస్లిం సమరయోధుల్ని కేవలం ముస్లింలుగానే కాంగ్రెస్ చూస్తే, భాజపా మాత్రం భారతీయులుగా చూస్తుంది.

### నెహ్రూ ఆ పని ఎందుకు చేయలేదు?

నెహ్రూ గొప్ప లౌకికవాది, ఆలోచనపరుడు, దార్శనికుడు అని కాంగ్రెస్ నాయకులు చెబుతుంటారు. ఆయన అంత గొప్పవారే అయితే కేవలం మైనార్టీల గురించి కాకుండా అక్కడి (పాక్‌లో) మొత్తం ప్రజల గురించి ఎందుకు ఒప్పందం చేసుకోలేదు? నెహ్రూ ఇదే సభలో 1950 నవంబర్ 5న మాట్లాడుతూ అక్కడ ప్రభావితమైన వారు భారత్‌కు వస్తే ఇక్కడి పౌరసత్వం పొందడానికి హక్కుదారులేనని ప్రకటించారు. చట్టం దానికి అనుకూలంగా లేకపోతే మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉంటుందని స్పష్టంచేశారు. దస్త్రావేజులు, లేఖలు, స్టాండింగ్ కమిటీ నివేదికలు అన్నీ ఈ చట్టాన్ని బలపరిచాయి. ఈ నిజాలు చూసిన తర్వాతైనా నెహ్రూ మతతత్వవాదా? హిందూ-ముస్లింల మధ్య విభేదాలు సృష్టించిన వ్యక్తా, హిందూ దేశాన్ని ఏర్పాటు చేయాలనుకున్న నేతా? అన్న విషయాన్ని కాంగ్రెస్ నాయకులు చెప్పగలరా?

### తప్పుడు మార్గంలో కాంగ్రెస్..

సీఏఏ ద్వారా ఏ పౌరుడికీ ఎలాంటి ఇబ్బంది రాదని రాజ్యాంగానికి కట్టుబడిన వ్యక్తిగా 130 కోట్ల మందికి భరోసా ఇస్తున్నా. భారతదేశ మైనార్టీలకు ఎలాంటి నష్టం జరగదు. దేశ ప్రజల చేతిలో తిరస్కరణకు గురైన నాయకులు ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ఆటలాడుతున్నారు. 1984లో జరిగిన దిల్లీ అల్లర్లకు కారకులైన వారిని ఎలా ముఖ్యమంత్రులుగా చేయగలిగారు? మూడు దశాబ్దాలుగా న్యాయం కోసం ఎదురుచూస్తున్న సిక్కు మహిళలు మైనార్టీలేనన్న విషయం మరిచిపోయారా? ఏళ్లతరబడి దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీ తప్పుడు దారిలో నడవడం ఆవేదనకరం. ఆ దారి ఆ పార్టీకే ఇబ్బందులు సృష్టిస్తుంది. దేశాన్ని కష్టాల్లో పడేస్తుంది.

### మీ దారిలో మేం వెళ్తే ఇవన్నీ వచ్చేవా?

కాంగ్రెస్ దారిలోనే మేం నడిచి ఉంటే ఆర్టికల్-370 రద్దయ్యేది కాదు. ముమ్మారు తలాక్ కత్తి ముస్లిం మహిళలను భయపెడుతూనే ఉండేది. మైనర్ పిల్లలపై అత్యాచారాలకు పాల్పడే దోషులకు ఉరిశిక్ష విధించే చట్టం వచ్చి ఉండేది కాదు. రామ జన్మభూమి ఇంకా వివాదాల్లోనే ఉండేది. కర్తార్‌పూర్ కారిడార్, భారత్-బంగ్లాదేశ్ సరిహద్దు వివాదం ఎప్పటికీ తేలేదికాదు. బినామీ ఆస్తుల చట్టం వచ్చేది కాదు. త్రివిధ దళాల ఉమ్మడి అధిపతి నియామకం జరిగేది కాదు. రాజ్యాంగాన్ని రక్షించాలని కొందరు పదేపదే నినదిస్తున్నారు. ఆ నినాదాన్ని కాంగ్రెస్ రోజుకు వందసార్లు వల్లించాలని నేనూ కోరుకుంటున్నా. రాజ్యాంగాన్ని కాపాడాలన్న నినాదం కాంగ్రెస్‌కు ఒక మంత్రం కావాలి. అలాచేస్తే వారి తప్పులు కొన్నైనా మాసిపోతాయి. మోదీని 6నెలల్లో కర్రలతో కొడతామని విపక్ష ఎంపీ ఒకరు (రాహుల్) చెప్పినట్లు విన్నాను. ఇలాంటివి ఎదుర్కొనేందుకు సూర్య నమస్కారాల ద్వారా నా వీపును మరింత బలంగా మార్చుకుంటాను.

### రాజ్యాంగం అప్పుడెందుకు గుర్తుకు రాలేదు?

దేశంలో అత్యయిక పరిస్థితి విధించినప్పుడు, న్యాయ సమీక్ష అధికారాలను న్యాయవ్యవస్థ నుంచి లాక్కోడానికి ప్రయత్నించినప్పుడు కాంగ్రెస్‌కు రాజ్యాంగం ఎందుకు గుర్తుకు రాలేదు? అత్యధికసార్లు రాజ్యాంగ సవరణలు చేయడానికి ప్రయత్నించినప్పుడు, డజన్లసార్లు దేశంలో ప్రజా ప్రభుత్వాలను కూల్చినప్పుడు, రిమోట్ కంట్రోల్ ద్వారా ప్రభుత్వాన్ని నడపడానికి ప్రయత్నించినప్పుడు, జమ్మూకశ్మీర్‌లో భారత రాజ్యాంగాన్ని అమలు చేయనప్పుడు ఎందుకు గుర్తుకు రాలేదు? జాతీయ పౌర పట్టికపై సంకుచిత బుద్ధితోనే దేశ ప్రజల్ని కాంగ్రెస్ తప్పుదోవ పట్టిస్తోంది."

### తెలంగాణ బిల్లును ఎలా ఆమోదించారో గుర్తు చేసుకోండి

(మొదటి పేజీ తరువాయి)
చర్చకు అవకాశమే లేకుండాపోయింది. ఎలాంటి వాతావరణంలో దాన్ని ఆమోదించారనేది ఎవరూ మర్చిపోలేరు. సీనియర్ అయిన మిమ్మల్ని (ఆజాద్‌ని) విమర్శించడం లేదు. కానీ సత్యాన్ని స్వీకరించాలి. దశాబ్దాల తర్వాత మీకు ఓ కొత్త రాష్ట్రం ఏర్పాటుచేసే అవకాశం వచ్చింది. ఉత్సాహపూరితంగా మీరు అందర్నీ కలుపుకొని ఆ పని చేసి ఉండొచ్చు. జమ్మూ-కశ్మీర్ విషయంలో ఎవరెవర్ని మేం సంప్రదించామని మమ్మల్ని ప్రశ్నిస్తున్నారు. మీరు (కాంగ్రెస్ వారు) కనీసం ఆంధ్ర, తెలంగాణ వాళ్లను అడిగారా? కానీ విభజన జరిగిపోయింది. చరిత్రగా మిగిలింది. ఆనాటి ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ లోక్‌సభలో మాట్లాడుతూ తెలంగాణ అంశంపై సాగుతున్న నిరసన ప్రదర్శనలు భారత ప్రజాస్వామ్యానికి హాని చేస్తున్నాయని చెప్పిన విషయాన్ని మీకు గుర్తుచేయదలచుకున్నా."

**- రాజ్యసభలో ప్రధానమంత్రి మోదీ**



లోక్‌సభలో గురువారం మాట్లాడుతున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ

# కియాను బెదిరించారు

"ఈ భూమి, నీరు మావి. శ్రమ మాది. ఉద్యోగాలు కూడా మాకే ఇవ్వాలి.. అని కియా కంపెనీ సీఈవోను ఎంపీ వేలెత్తి చూపించారు. ఒక అంతర్జాతీయ సంస్థతో ప్రవర్తించే పద్ధతి ఇదేనా?"

"మా పార్టీ అధికారంలో ఉంది. మేం చెప్పినట్లే చేయాలి. మా వాళ్లనే ఉద్యోగాల్లోకి తీసుకోవాలి. మా వద్దే లారీలు అద్దెకు తీసుకోవాలి.. అని కియా కార్ల సంస్థ జీఎం సదాశివాన్ని స్థానిక వైకాపా నాయకులు గోవిందరెడ్డి, రామచంద్రారెడ్డి బెదిరించడం ద్వారా ఎలాంటి సంకేతాలు ఇస్తున్నారు?

"కియాకు 20 ఏళ్లపాటు రాయితీలివ్వడానికి మొత్తం రూ.20 వేల కోట్ల భారం పడుతుంది. పారిశ్రామిక ప్రోత్సాహకాలపై సమీక్షిస్తాం. మీకు రాయితీలివ్వం. అని మంత్రి, ఏపీఐఐసీ ఛైర్మన్ చెప్పారు"

(మొదటి పేజీ తరువాయి)
వైకాపా వాళ్లు కాదా? అని నిలదీశారు. వేలు చూపించిన వారిని అరెస్టు చేయాలని, రాయితీలు ఇవ్వబోమని చెప్పిన మంత్రుల్ని పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. అప్పుడే వారికి నమ్మకం కలుగుతుందని సూచించారు. గురువారం మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో చంద్రబాబు విలేకరులతో మాట్లాడుతూ.. కియా పరిశ్రమను తమిళనాడుకు తరలించే ఆలోచన చేస్తున్నారని రాయిటర్స్ వార్తాసంస్థలో వచ్చిన కథనాన్ని ప్రస్తావించారు. నిర్దిష్టంగా అందరితో మాట్లాడాకే ఈ కథనం ఇచ్చారని పేర్కొన్నారు. కియా తరలింపుపై ఆంధ్రప్రదేశ్, తమిళనాడు ముఖ్యమంత్రుల కార్యాలయాలను సంప్రదించినా సమాధానం రాలేదని రాయిటర్స్ కథనంలో పేర్కొందని చెప్పారు. దీన్ని మన ముఖ్యమంత్రి కార్యాలయం ఎందుకు ఖండించలేదని నిలదీశారు. ఒక అంతర్జాతీయ సంస్థ తమ పరిశ్రమను ఒక రాష్ట్రంలో ఏర్పాటు చేసి రెండేళ్లలోనే మరో రాష్ట్రానికి మార్చాలని ఆలోచిస్తుందంటే ఎంత వేధించి ఉంటారు? అని ప్రశ్నించారు. అనంతపురంలో పరిశ్రమ ఏర్పాటుకు కియా ముందుకొచ్చాక నాలుగు నుంచి అయిదు నెలల్లో గొల్లపల్లి జలాశయం పూర్తి చేసి నీళ్లిచ్చాం.. ఎత్తు పల్లాలు సరిచేయించి వారిలో నమ్మకం కలిగించామని చంద్రబాబు వివరించారు. వైకాపా ప్రభుత్వం వచ్చాకే వారికి కష్టాలు మొదలయ్యాయని చెప్పారు. "రాయిటర్స్‌కు ఆర్థిక అంశాలపై ప్రపంచస్థాయిలో ఎంతో విశ్వసనీయత ఉంది. అలాంటి సంస్థను ఎవరైనా ప్రభావితం చేయగలరా? అదేమైనా సాక్షి పత్రికా? మీ మనుషుల్ని వీధిరౌడీల్లా వదిలిపెడితే.. రాష్ట్ర ప్రయోజనాల కోసం మేం మాట్లాడకూడదా?" అని నిలదీశారు.

### కియా అనుబంధ పరిశ్రమలు వెళ్లిపోయాయి

"జగన్ గతంలో అనంతపురం వెళ్లి మీరు భూములివ్వవద్దు.. మీకు నష్టం వస్తుందని రెచ్చగొట్టారు. అయినా రైతులు వారి పిల్లలకు ఉద్యోగాలొస్తాయని కియాకు భూములు ఇచ్చారు. చైనాలో కియా ప్లాంటు మూతపడితే అనంతపురంలో ప్లాంటు పరిస్థితి ఏమిటని 2019 మార్చి 19న సాక్షి పత్రికలో అసత్య ప్రచారం చేశారు. కియాకు అనుబంధంగా రూ. 4,790 కోట్ల పెట్టుబడితో 6,583 మందికి ఉద్యోగాలు కల్పించేలా 17 సంస్థల ఏర్పాటుకు ఒప్పందం కుదిరింది. వైకాపా ప్రభుత్వ పెద్దలు.. గత ఒప్పందం ప్రకారం రాయితీలివ్వలేమని, భూములు ధరలు పెంచుతామని అన్నారు. దీంతో వారు ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోయారు. గతంలో ఫోక్స్‌వ్యాగన్ రాష్ట్రానికి వస్తే.. అప్పటి ప్రభుత్వం, మంత్రి బొత్స సత్యనారాయణ అవినీతికి పాల్పడ్డారు. దీంతో ఆ కంపెనీ సీఈవోను అరెస్టు చేశారు. ఫోక్స్‌వ్యాగన్ రాష్ట్రంలో పరిశ్రమ పెట్టలేమని పుణేకు వెళ్లిపోయింది. రాష్ట్రంలో పరిశ్రమలకు అనుకూల వాతావరణం లేదు. తుగ్లక్ చర్యలతో ఆదాయం తగ్గిపోయింది. సెప్టెంబరులో ఏకంగా 8సార్లు ఓడీకి వెళ్లారు' అని చంద్రబాబు మండిపడ్డారు.

### మిలీనియం టవర్స్ ఎవరి కోసం?

'ఐటీ రంగాన్ని ఆకర్షించేందుకు విశాఖపట్నంలో మిలీనియం టవర్స్ నిర్మాణం చేపట్టాం. అక్కడ కాండ్యుయెంట్‌కు చెందిన 2,500 మంది పనిచేస్తున్నారు. అక్కడ సచివాలయం పెడితే అదనంగా ఉద్యోగాలొస్తాయా? పరిశ్రమల్లో 75% ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలన్న నిర్ణయానికి మేం వ్యతిరేకం కాదు. అయితే పెట్టుబడులే రానప్పుడు పరిశ్రమలు ఎలా వస్తాయి? ఉద్యోగాలెవరిస్తారు? ఇతర రాష్ట్రాలు, దేశాల్లోనూ 75% నిబంధన అమలు చేసి మన యువతకు ఉద్యోగాలివ్వకపోతే చదువుకున్న వాళ్ల గతేం కావాలి?

### విధిలేని పరిస్థితుల్లో ఉండొచ్చు

విధిలేని పరిస్థితుల్లో కియా ఉంటే ఇక్కడే ఉండొచ్చు. మేం ఒత్తిడి పెంచాం కాబట్టి ప్రభుత్వం వారితో రాజీపడొచ్చు. చాలా పరిశ్రమలు ఖాయిలా స్థితికి చేరాయి. పారిశ్రామికవేత్తలు రాష్ట్రానికి వచ్చి పెట్టుబడులు పెట్టాలంటే భయపడుతున్నారు. జగన్ ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తుతో ఆడుకుంటున్నారు. విద్యుత్తు ఒప్పందాల రద్దుతో రాష్ట్రం, దేశం ప్రతిష్ఠ దెబ్బతీశారు'' అని చంద్రబాబు చెప్పారు.




కియా సీఈవోను వైకాపా ఎంపీ బెదిరించారంటూ మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో చంద్రబాబు నాయుడు చూపించిన క్లిప్పింగ్

### పౌరుషం ఉంటే ప్రత్యేక హోదా సాధించండి

లోక్‌సభలో ఎంపీ రామ్మోహన్‌నాయుడు ప్రసంగిస్తుంటే వైకాపా ఎంపీ మాధవ్ అడ్డుతగిలే ప్రయత్నం చేస్తున్న వీడియోను చంద్రబాబు విలేకర్లకు చూపించారు. "పౌరుషం ఉంటే ప్రత్యేక హోదా సాధించండి.. విభజన సమస్యలు పరిష్కరించండి'' అని సవాల్ చేశారు.

## కియా కలకలం

(మొదటి పేజీ తరువాయి)
సంస్థలతో వ్యవహరించే తీరు ఇదేనా అని ప్రతిపక్ష నేత చంద్రబాబు మండిపడ్డారు. పరిశ్రమలు తరలిపోతే ఉద్యోగాలు ఎక్కడి నుంచి వస్తాయని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి కియా పరిశ్రమను తరలిస్తే.. తమ రాష్ట్రానికి రావాలంటూ పంజాబ్ ప్రభుత్వం సాదరంగా ఆహ్వానం పలికింది. దీనిపై దేశవ్యాప్తంగా కలకలం రేగడంతో రాష్ట్ర ప్రభుత్వం ఆగమేఘాల మీద స్పందించింది. రాయిటర్స్ కథనం అవాస్తవమని మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, గౌతమ్‌రెడ్డి, శంకరనారాయణ, పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి రజత్ భార్గవ వేర్వేరు ప్రకటనల్లో ఖండించారు. కియా మోటార్స్ ఎండీతో తాను మాట్లాడానని, కంపెనీ తరలింపు అసత్యమని వైకాపా లోక్‌సభాపక్ష నేత పి.వి.మిథున్‌రెడ్డి పార్లమెంటులో వివరణ ఇచ్చారు. చివరకు తమిళనాడు ప్రభుత్వం కూడా కలగజేసుకుని.. కియాతో తమవైపు నుంచి ఎటువంటి సంప్రదింపులు జరగలేదని ప్రకటించడం విశేషం.

### కియా సంస్థ ఖండించింది: ఆర్థికమంత్రి బుగ్గన

'తరలింపువార్తను కియా ప్రతినిధులు ఖండించారు. తప్పుడు ప్రచారాల వల్ల రాష్ట్రానికి నష్టం వాటిల్లుతుంది. రూ.14వేల కోట్ల పెట్టుబడితో కియా ప్లాంటును ఏర్పాటుచేసింది. ప్రభుత్వ సహకారంపై కియా ప్రతినిధులు సంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఏర్పాటుచేసిన ప్లాంటుతో సమస్యలు లేకున్నా ఇలాంటి వార్త ఆశ్చర్యానికి గురిచేసినట్లు సంస్థ సేల్స్, మార్కెటింగ్ విభాగం జాతీయ అధిపతి మనోహర్ భట్ తెలిపారు.'

### పరిశ్రమల ఏర్పాటుకు రాష్ట్రం అనుకూలం: పరిశ్రమల శాఖ మంత్రి గౌతమ్‌రెడ్డి

'కియా మోటార్స్ తరలిపోతున్నట్లు వచ్చిన వార్త నిజం కాదు. వాళ్లు తమ యూనిట్‌ను త్వరలో విస్తరించే అవకాశం ఉంది. పరిశ్రమ రాష్ట్రంలోనే ఉంటుంది. దీనిపై కియా పరిశ్రమ యాజమాన్యంతోనూ చర్చించాను. ఈ వార్తలో వాస్తవం లేదని కియా మోటార్స్ చెప్పింది.'

### తరలింపు వార్త అవాస్తవం: పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి రజత్ భార్గవ

'కియా పరిశ్రమ తరలింపు గురించి తమిళనాడు పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శితో నేను మాట్లాడాను. కియాతో ఎలాంటి సంప్రదింపులు జరగలేదని ఆయన చెప్పారు. కియా మోటార్స్ కూడా తరలింపుపై వచ్చిన వార్తను ఖండించింది. పరిశ్రమలను ప్రోత్సహించేలా ప్రభుత్వ విధానాలు ఉన్నాయి. కియా పరిశ్రమ రాష్ట్రంలో ఏర్పాటుచేసిన యూనిట్ ద్వారా ప్రస్తుతమున్న ఉత్పత్తి సామర్థ్యాన్ని ఏడాదికి రెండు లక్షల నుంచి మూడు లక్షల యూనిట్లకు పెంచాలన్న ప్రతిపాదనలో ఉంది.'

### ప్రచారం వెనుక చంద్రబాబు హస్తం: శంకరనారాయణ

**పెనుకొండ, న్యూస్‌టుడే:** కియా కార్ల తయారీ పరిశ్రమకు అవసరమైన అన్ని రాయితీలను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోందని బీసీ సంక్షేమశాఖ మంత్రి శంకరనారాయణ పేర్కొన్నారు. కియా పరిశ్రమ తరలిపోతోందని ప్రచారం చేయడం వెనుక తెదేపా అధ్యక్షుడు చంద్రబాబు హస్తం ఉందని ఆరోపించారు.

### 'కియా'తో సంప్రదింపుల్లో వాస్తవం లేదు: తమిళనాడు

**ఈనాడు డిజిటల్, చెన్నై:** అనంతపురం జిల్లాలోని 'కియా' మోటార్స్ పరిశ్రమ తమిళనాడుకు వస్తోందన్న కథనాల్లో వాస్తవం లేదని ఆ రాష్ట్ర పరిశ్రమల శాఖ ప్రధాన కార్యదర్శి మురుగానందం తెలిపారు. కియా యాజమాన్యంతో తమ రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి సంప్రదింపులు జరపలేదని గురువారం ఆయన స్పష్టం చేశారు.

### మా రాష్ట్రానికి రండి: పంజాబ్

కియా సంస్థకు పంజాబ్ ప్రభుత్వం ఆహ్వానం పలికింది. స్థానికులకు 75 శాతం ఉద్యోగాలివ్వాలనే పరిమితులు తమ రాష్ట్రంలో లేవని చెప్పింది. కియా పరిశ్రమ ఆంధ్రప్రదేశ్ నుంచి తమిళనాడుకు వెళ్లే ఆలోచనలో ఉందని రాయిటర్స్ కథనాన్ని ఉటంకిస్తూ లైవ్‌మింట్ ఆంగ్ల దినపత్రికలో వచ్చిన కథనాన్ని ట్యాగ్ చేస్తూ 'ఇన్వెస్ట్ పంజాబ్' ట్విటర్ ఖాతా నుంచి ఈ మేరకు ట్వీట్ చేసింది. ప్రగతిశీల సంస్కరణల విధానాన్ని అమలుచేస్తున్న తమ రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చని పేర్కొంది.

## నేడు కోర్టుకు హాజరుకానున్న జగన్

**ఈనాడు, అమరావతి:** సీఎం జగన్ శుక్రవారం హైదరాబాద్ వెళ్లనున్నారు. అక్రమాస్తుల కేసు విచారణ నేపథ్యంలో నాంపల్లిలోని ప్రత్యేక కోర్టుకు హాజరుకానున్నారు. మధ్యాహ్నానికి ఆయన తిరిగి తాడేపల్లి చేరుకోనున్నారు. రాజమహేంద్రవరంలో 'దిశ' పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారమే ముఖ్యమంత్రి ప్రారంభించాల్సి ఉంది. అందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. హైదరాబాద్‌లో కోర్టుకు వెళ్లాల్సి ఉండటంతో రాజమహేంద్రవరం కార్యక్రమాన్ని వాయిదా వేశారు.

## తరలిపోతున్న పెట్టుబడులు

(మొదటి పేజీ తరువాయి)
రామ్మోహన్ నాయుడు మాట్లాడుతుండగా హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ ఆయన వద్దకు దూసుకొచ్చి, ప్రసంగాన్ని అడ్డుకునే యత్నం చేశారు. దీనిపై రామ్మోహన్ నాయుడు అభ్యంతరం వ్యక్తంచేశారు. 'మేం పార్లమెంట్‌లో ఉన్నామా.. లేమా.. ప్రతిసారీ ఇలానే చేస్తున్నారు' అని ఆవేదన వ్యక్తం చేశారు. మాధవ్ ప్రవర్తనపై తెరాస, బిజద, టీఎంసీ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. వెళ్లి కూర్చోవాలని.. తర్వాత అవకాశం ఇస్తానని సభాపతి కఠినంగా చెప్పడంతో మాధవ్ వెనక్కి వెళ్లారు.

### తప్పుడు ఆరోపణలు

కియా మోటార్స్ ఎండీతో తాను మాట్లాడానని, కంపెనీ తరలింపు అసత్యమని వైకాపా లోక్‌సభాపక్ష నేత పి.వి.మిథున్‌రెడ్డి తెలిపారు. మీడియాలో వచ్చినవి అసత్య వార్తలని ఎండీ చెప్పారన్నారు. మిలీనియమ్ టవర్స్‌లోని ఫ్రాంక్లిన్ టెంపుల్టన్ బోగస్ సంస్థ అని విమర్శించారు. రూ. 30 కోట్ల పెట్టుబడికి రూ. వెయ్యి కోట్ల భూమి ఇచ్చారని, అదో భూ కుంభకోణమని ఆరోపించారు. చంద్రబాబును, ఆయన కుంభకోణాలను రక్షించే మిషన్‌లో భాగమే అసత్య ప్రచారాలు జరుగుతున్నాయని ఆయన విమర్శించారు.

## గ్రహం అనుగ్రహం
**7-2-2020 శుక్రవారం**

శ్రీ వికారి నామ సం॥రం॥ ఉత్తరాయణం
శిశిర ఋతువు; మాఘ మాసం; శుక్ల పక్షం
త్రయోదశి: సా. 4.38 తదుపరి చతుర్దశి
పునర్వసు నక్షత్రం: రా.10.46 తదుపరి పుష్యమి
అమృత ఘడియలు: రా. 8.24 నుంచి 9.58 వరకు
వర్జ్యం: ఉ. 10.56 నుంచి 12.31 వరకు
తిరిగి తె. 6.30 నుంచి
దుర్ముహూర్తం: ఉ. 8.50 నుంచి 9.35 వరకు
తిరిగి మ. 12.36 నుంచి 1.22 వరకు
రాహుకాలం: ఉ. 10.30 నుంచి 12.00 వరకు
సూర్యోదయం: ఉ.6-34; సూర్యాస్తమయం: సా.5.54

## చలి-పులి

| ప్రాంతం | కనిష్ఠ | గరిష్ఠ |
|---|---|---|
| నల్గొండ | 16.0 | 30.6 |
| ఆదిలాబాద్ | 16.5 | 29.8 |
| గుంటూరు | 17.2 | 31.9 |
| మెదక్ | 17.9 | 31.0 |
| తిరుపతి | 19.3 | 33.4 |
| హైదరాబాద్ | 19.4 | 33.0 |
| తాడేపల్లిగూడెం | 20.0 | 31.0 |
| రాజమహేంద్రవరం | 20. | 34.0 |
| మహబూబ్‌నగర్ | 20.1 | 33.6 |
| విజయవాడ | 20.6 | 33.2 |
| కర్నూలు | 20.8 | 35.5 |
| నిజామాబాద్ | 20.9 | 31.5 |
| విశాఖపట్నం | 21.0 | 29.4 |
| కరీంనగర్ | 21.0 | 31.0 |
| కడప | 21.0 | 36.0 |
| నరసాపురం | 21.5 | 30.1 |
| ఒంగోలు | 21.6 | 31.1 |
| హన్మకొండ | 21.7 | 32.2 |
| శ్రీకాకుళం | 22.0 | 28.0 |
| సూర్యాపేట | 22.0 | 29.5 |
| నెల్లూరు | 22.0 | 32.0 |
| అనంతపురం | 22.3 | 35.5 |

## వేర్వేరుచోట్ల ఉంటే పనిపై ప్రభావం

(మొదటి పేజీ తరువాయి)
హర్‌దీప్‌సింగ్‌పూరీ తెలిపారు. 'సెంట్రల్ విస్టా' అభివృద్ధి కార్యక్రమం గురించి బుధవారం లోక్‌సభలో పశ్చిమబెంగాల్ సభ్యుడు సౌగత్‌రాయ్ అడిగిన లిఖితపూర్వక ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. 'పార్లమెంటు భవనం 1927లో పూర్తయింది. ప్రస్తుత అవసరాలకు అది సరిపోవడంలేదు'' అని వెల్లడించారు.

## వుహాన్ నుంచి వచ్చిన భారతీయులు క్షేమమే

**దిల్లీ, బీజింగ్:** కరోనా వైరస్ దెబ్బకు కుదేలవుతున్న వుహాన్ నుంచి స్వదేశానికి చేరుకున్న భారతీయులంతా స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకునే వార్త ఇది! రెండు ప్రత్యేక విమానాల్లో కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఆ నగరం నుంచి తీసుకొచ్చిన 645 మందిలో ఏ ఒక్కరికీ వైరస్ సోకలేదని పరీక్షల్లో తేలింది. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ గురువారం ఈ విషయాన్ని వెల్లడించింది.

# పంట కొన్న వెంటనే డబ్బు అందాలి

(మొదటి పేజీ తరువాయి)
కొనాలని ఆదేశించారు. ప్రభుత్వానికి ఆర్థికంగా నష్టం వచ్చినా ఫర్వాలేదని చెప్పారు. వచ్చే నెలలోగా పరిస్థితి మొత్తం మారాలని స్పష్టం చేశారు. సెనగలు, కందులు విపణిలోకి వస్తున్నందున కొనుగోలు ప్రక్రియలో రైతులు నష్టపోకుండా చూడాలన్నారు. ఇది ప్రాధాన్యతా కార్యక్రమమని ప్రకటించారు. అగ్రిమిషన్‌పై గురువారం సీఎం జగన్.. మంత్రులు, అధికారులతో సమీక్షించారు. రైతుభరోసా కేంద్రాల లోగోను ఆవిష్కరించారు. విత్తనాల కొనుగోలుకు బుకింగ్ చేసుకునే వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. సమీక్షలో సీఎం మాట్లాడుతూ.. పంట అమ్ముకునే సమయంలో రైతులకు చిన్న ఇబ్బంది రాకూడదని, అధికారులు దీన్నో సవాలుగా తీసుకొని పనిచేయాలని సూచించారు. 'కొనుగోలు కేంద్రాల్లో పంటలకు ప్రభుత్వ మద్దతు ధరల పట్టికను అందుబాటులో ఉంచాలి. మద్దతు ధర, కొనుగోలు కేంద్రాల వివరాలను గ్రామ సచివాలయాల్లోనూ ఉంచాలి. రైతు ఎక్కడ నష్టపోయినా ప్రభుత్వం జోక్యం చేసుకునేలా మార్కెటింగ్ వ్యవస్థను తీసుకురావాలి. శ్రీకాకుళంలో కొత్త గోదాములను నిర్మించేంత వరకూ ప్రత్యామ్నాయాలు చూడాలి. సరిపడా గోదాములు, శీతల గిడ్డంగుల ఏర్పాటుపై దృష్టి సారించాలి. వ్యవసాయశాఖ రైతు భరోసా కేంద్రాలను ఉపయోగించుకోవాలి. పశుసంవర్థకం, ఉద్యాన సాగు, మత్స్యరంగాలకు రైతు భరోసా కేంద్రాల ద్వారా ఊపు తీసుకొచ్చి వ్యవసాయాన్ని కొత్త పుంతలు తొక్కించాలి' అని సీఎం చెప్పారు.

### ఆర్గానిక్ పాలకు మరింత గిట్టుబాటు ధర

'మందులు వాడకుండా పాలను ఉత్పత్తి చేసే వారిని ప్రోత్సహించాలి. అలాంటి పాలకు గిట్టుబాటు ధర పెంచాలి. ఆర్గానిక్ పాల పేరుతో వీటిని అమ్మేందుకు చర్యలు తీసుకోవాలి. అన్ని పశువులకూ ట్యాగ్‌లు వేయాలి. రైతులు నాణ్యమైన విత్తనాలనే కోరుకుంటారు. నకిలీ విత్తనాల కేసులను అధికారులు తీవ్రంగా పరిగణించాలి. విత్తనాలు, ఎరువుల నాణ్యత పరీక్షలను పక్కాగా చేపట్టాలి. విత్తన కొనుగోళ్లలో అక్రమాలకు తావు లేకుండా చూడాలి' అని సీఎం చెప్పారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. వ్యవసాయ శాఖలో ప్రత్యేక న్యాయవిభాగాన్ని ఏర్పాటుచేస్తున్నామని తెలిపారు. సెనగ విత్తనాలను పూర్తి స్థాయిలో పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రభుత్వ నిర్ణయాలతో ప్రఖ్యాత సంస్థలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నాయని, ధరలు తగ్గించి ఎరువులు, విత్తనాలను అమ్మేందుకు సిద్ధంగా ఉన్నాయని వివరించారు. సమీక్షలో మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, బాలినేని శ్రీనివాసరెడ్డి, కె.కన్నబాబు, అనిల్‌కుమార్, కొడాలి నాని తదితరులు పాల్గొన్నారు.

## 21వేల కోట్ల రుణం

(మొదటి పేజీ తరువాయి)
ఉపాధ్యక్షులు, చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ అధికారి డి.జె. పాండియన్, డైరక్టర్ జనరల్ (ఇన్వెస్ట్‌మెంట్ ఆపరేషన్స్ డిపార్టుమెంట్) యీ ఎన్ పంగ్, ప్రిన్సిపల్ సోషల్ డెవలప్‌మెంట్ స్పెషలిస్టు సోమనాథ్ బసు తదితరులు ముఖ్యమంత్రి జగన్‌తో భేటీ అయ్యారు. ఏఐఐబీ ఇప్పటికే రాష్ట్రంలోని వివిధ ప్రాజెక్టులకు సహాయ సహకారాలు అందిస్తోందని, వీటితో పాటు మరిన్ని ప్రాజెక్టులకు ఆర్థిక సాయం చేస్తామని ఆ ప్రతినిధులు ముఖ్యమంత్రికి తెలిపారు. ఇది వ్యవసాయ ప్రధాన రాష్ట్రమని, 62% ప్రజలు ఈ రంగంపై ఆధారపడి ఉన్నారని, ఎక్కువ మందికి ఉపాధి కల్పించేది ఆ రంగమేనని జగన్ వారికి వివరించారు. అందుకే జలవనరుల ప్రాజెక్టులు తమకు కీలకమని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పలు ప్రాజెక్టులపై బ్యాంకు ప్రతినిధులు ఆరాతీశారు. అమ్మ ఒడి, మధ్యాహ్న భోజన పథకం మార్పులు, ఆంగ్ల మాధ్యమం తదితర అంశాలతో పాటు.. ప్రతీ లోక్‌సభ నియోజకవర్గానికీ ఒక బోధనాసుపత్రి ఉండేలా చర్యలు తీసుకుంటూ మరో 16 వైద్య కళాశాలల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు జగన్ వారికి వివరించారు. కొత్తగా నిర్మించబోయే పోర్టులపైనా చర్చ జరిగింది. శ్రీకాకుళం జిల్లా భావనపాడు, కృష్ణాజిల్లా మచిలీపట్నం, ప్రకాశం జిల్లా రామాయపట్నంలో పోర్టుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు ముఖ్యమంత్రి చెప్పారు. ఒక పోర్టుకు సహాయం చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని బ్యాంకు ప్రతినిధులు చెప్పారు. జలవనరుల ప్రాజెక్టులు, రహదారులు, విమానాశ్రయాలు, వాటర్‌గ్రిడ్ ప్రాజెక్టులకు తాము సహాయం చేయగలమన్నారు. గోదావరి-కృష్ణా అనుసంధాన ప్రాజెక్టు ప్రతిపాదనలనూ ముఖ్యమంత్రి వివరించారు. ఈ ప్రణాళికలు వివరించేందుకు బ్యాంకు ప్రధాన కార్యాలయానికి రావాలంటూ ముఖ్యమంత్రిని ఆహ్వానించారు.

## ట్రంప్‌పై వీగిన అభిశంసన తీర్మానం

**వాషింగ్టన్:** ట్రంప్‌పై అభిశంసన తీర్మానం వీగిపోయింది. అధికారాన్ని దుర్వినియోగం చేయడం, చట్టసభ అయిన కాంగ్రెస్ కార్యకలాపాలకు అడ్డుతగలడం అన్న రెండు ఆరోపణలపై ప్రతిపక్ష డెమొక్రాటిక్ సభ్యులు ఆయనపై అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ఈ తీర్మానాన్ని బుధవారం ఎగువ సభ సెనేట్ తిరస్కరించడంతో ఆ ఆరోపణల నుంచి ఆయన బయటపడినట్టయింది. రిపబ్లికన్లకు 53, డెమొక్రాట్లకు 47 స్థానాలు ఉన్నాయి. అధికార దుర్వినియోగం ఆరోపణపై పెట్టిన తీర్మానానికి వ్యతిరేకంగా 52, అనుకూలంగా 48 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ కార్యకలాపాలకు ఆటంకం కలిగించారన్న ఆరోపణపై పెట్టిన తీర్మానానికి వ్యతిరేకంగా 53, అనుకూలంగా 47 ఓట్లు వచ్చాయి.

# రాజధాని పరిధి నుంచి 5 గ్రామాలు బయటకు

(మొదటి పేజీ తరువాయి)
కమిషనర్ కార్యాలయం ప్రభుత్వానికి పంపింది. 2020 జనవరి 10న ప్రభుత్వ ఆదేశాలపై పది రోజుల వ్యవధిలో తాడేపల్లి పురపాలక సంఘ అధికారులు, 11 రోజుల వ్యవధిలో మంగళగిరి పురపాలక అధికారులు.. కౌన్సిల్ తీర్మానాలు చేసి (రెండూ ప్రత్యేక అధికారుల పాలనలో ఉన్నాయి) పంచాయతీల విలీనానికి సమ్మతిని తెలుపుతూ ప్రభుత్వానికి తిరిగి సమాచారాన్ని పంపారు. దీనిపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ అంతేవేగంగా స్పందించి పురపాలక సంఘాల్లో పంచాయతీల విలీనానికి ప్రకటన (డీ-నోటిఫైడ్) చేసింది.

**ఆ గ్రామాలివే..**

తాడేపల్లి మండలంలోని రాజధాని గ్రామాలైన పెనుమాక, ఉండవల్లితో పాటు ప్రాతూరు, వడ్డేశ్వరం, ఇప్పటం, మెల్లింపూడి, చిర్రావూరు, గుండిమెడ పంచాయతీలను తాడేపల్లి పురపాలక సంఘంలో, మంగళగిరి మండలంలోని రాజధాని గ్రామాలైన నవులూరు, బేతపూడి, ఎర్రబాలెంతో పాటు ఆత్మకూరు, చినకాకాని పంచాయతీలను మంగళగిరి పురపాలక సంఘంలో విలీనం చేస్తూ పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి గురువారం జీవోలు ఇచ్చారు.

# చాంపియన్స్

## రొనాల్డో, మెస్సి కన్నా కోహ్లి పరుగే ఎక్కువ!



దిల్లీ

టీమ్‌ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లి ఫిట్‌నెస్ ప్రమాణాలు అత్యున్నత స్థాయిలో ఉంటాయి. వికెట్ల మధ్య, ఫీల్డింగ్‌లో అతను ఎంత చురుగ్గా ఉంటాడో మనకు తెలిసిందే. అతని ఫిట్‌నెస్ సామర్థ్యానికి ఉదాహరణగా పేర్కొంటూ.. ఫుట్‌బాల్ మైదానంలో రొనాల్డో, మెస్సి కంటే క్రికెట్ పిచ్‌పై వికెట్ల మధ్య కోహ్లినే ఎక్కువగా పరుగెత్తుతాడని బీసీసీఐ సెలక్షన్ కమిటీ మాజీ ఛైర్మన్ ఎమ్మెస్కే ప్రసాద్ అంటున్నాడు. ఫుట్‌బాల్, రగ్బీ లాంటి ఆటల్లో శారీరక శ్రమ అధికంగా ఉంటుంది. ఆటగాళ్లు ఎక్కువగా పరుగెత్తాలి. ఫుట్‌బాల్‌లో అయితే ఓ మ్యాచ్‌లో సాధారణంగా ఆటగాళ్లు 8 నుంచి 13 కిలోమీటర్లు పరుగెత్తుతారు. అగ్రశ్రేణి ఆటగాళ్లైన మెస్సి, రొనాల్డోలు సగటున ఓ మ్యాచ్‌లో వరుసగా 7.6 కిలోమీటర్లు, 8.38 కిలోమీటర్లు పరుగెత్తుతూ ఉంటారు. కానీ కోహ్లి ఓ మంచి ఇన్నింగ్స్ ఆడినపుడు సగటున 17 కిలోమీటర్లు పరుగెత్తుతాడని ప్రసాద్ తెలిపాడు. జీపీఎస్ సాంకేతికత ద్వారా ఆటగాళ్ల ప్రదర్శనను ఎప్పటికప్పుడూ పర్యవేక్షిస్తూనే ఉన్నారని అతనన్నాడు. "బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్టు జాబితాలోని ప్రతి ఒక్క ఆటగాడి ప్రదర్శనను జీపీఎస్ సాయంతో పర్యవేక్షిస్తున్నారు. ప్రాక్టీస్ సమయంలోనూ వారి పని భారాన్ని అంచనా వేస్తున్నారు. కోహ్లి ఓ మంచి ఇన్నింగ్స్ ఆడినపుడు వికెట్ల మధ్య 17 కిలోమీటర్లు పరుగెడతాడు. ఇలా ఎప్పటికప్పుడు ఆటగాళ్ల ప్రదర్శనను సమీక్షిస్తూ ఉంటారు. విదేశీ జట్లు కూడా అలాగే చేస్తున్నాయి. ఆటగాళ్ల పని భారాన్ని ఫిజియో పర్యవేక్షిస్తాడు. ఈ విధానాన్ని ప్రవేశపెట్టిన శంకర్ బసు ఓ గొప్ప ట్రైనర్" అని ప్రసాద్ పేర్కొన్నాడు.

## సెమీస్‌లో బెంగళూరు రాప్టర్స్



సాయి ప్రణీత్ విజయం

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ (పీబీఎల్) అయిదో సీజన్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ బెంగళూరు రాప్టర్స్ సెమీస్‌లో అడుగుపెట్టింది. గురువారం గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి ఇండోర్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో ఆ జట్టు 5-0 తేడాతో అవధె వారియర్స్‌ను చిత్తుచేసింది. పురుషుల డబుల్స్‌లో హ్యాన్- చియోల్ 14-15, 15-7, 15-11తో జార్జ్- సప్రుత్రోపై గెలిచి అవధెకు శుభారంభం అందించింది. అయితే అవధె ట్రంప్ మ్యాచ్‌గా ఎంచుకున్న పురుషుల సింగిల్స్‌లో బ్రీస్ 15-9, 15-9తో ఆ జట్టు ఆటగాడు అజయ్‌కు షాకిచ్చాడు. మహిళల సింగిల్స్‌లో తై జు యింగ్ 15-12, 15-12తో బీవెన్‌పై నెగ్గి బెంగళూరుకు ఆధిక్యం అందించింది. బెంగళూరు ట్రంప్ మ్యాచ్‌గా ఎంచుకున్న మరో పురుషుల సింగిల్స్‌లో సాయి ప్రణీత్ 15-11, 15-13తో విన్సెంట్‌పై గెలిచి ఆ జట్టు విజయాన్ని ఖరారు చేశాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో పెంగ్- వాన్ జోడీ 7-15, 15-12, 15-11తో హ్యాన్- క్రిస్టినా జంటను ఓడించింది.

## జూనియర్ల కోసం హాకీ కేంద్రాలు

దిల్లీ: జూనియర్, సబ్ జూనియర్ హాకీ ఆటగాళ్లకు అత్యుత్తమ శిక్షణ కల్పించి, వారిని భవిష్యత్ ఛాంపియన్లుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో దేశంలోని ఏడు ప్రధాన నగరాల్లో హై పర్ఫార్మెన్స్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. భారత క్రీడా ప్రాధికార సంస్థ (సాయ్)తో కలిసి హాకీ ఇండియా గురువారం ఈ విషయాన్ని వెల్లడించింది. 2024, 2028 ఒలింపిక్స్‌ను దృష్టిలో ఉంచుకుని యువ క్రీడాకారులను సానబెట్టాలనే లక్ష్యంతో ఈ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. జాతీయ హాకీ అకాడమీ (దిల్లీ), సాయ్ సుందర్‌గఢ్ (ఒడిషా), సాయ్ యూడీఎంసీసీ (భోపాల్), సాయ్ బెంగళూరు కేంద్రాలు మరో మూడు నెలల్లోపు అందుబాటులోకి రానున్నాయి. మిగతా మూడు కేంద్రాలైన సాయ్ ఎన్ఎస్ ఎన్ఈసీ (ఇంఫాల్), బాలేవాడి స్పోర్ట్స్ కాంప్లెక్స్ (పుణె), సాయ్ సెంటర్ (రాంచి)లను వచ్చే ఏడాదిలోపు పూర్తి చేయనున్నారు.

## ఐపీఎల్ ఆరంభం.. ఆలస్యం?

ముంబయి: ఐపీఎల్ 13వ సీజన్ నిర్వహణ తేదీలపై సందిగ్ధత కొనసాగుతోంది. వచ్చే నెల 29న సీజన్ ఆరంభమై మే 24న ముగుస్తుందని బీసీసీఐ అధ్యక్షుడు సౌరభ్ గంగూలీ చూచాయిగా చెప్పాడు. దానిపై ఇప్పటివరకూ ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల కాలేదు. అయితే ఎక్కువ మంది విదేశీ ఆటగాళ్లు ఏప్రిల్ ఒకటి తర్వాతే భారత్‌కు రానున్నారు. ఈ నేపథ్యంలో ఆరంభ తేదీ మారే అవకాశం ఉంది. బీసీసీఐ నుంచి ఐసీసీ ప్రతినిధిగా ఎంపికైన జై షా.. ఐసీసీ సమావేశంలో పాల్గొన్న తర్వాత ఈ తేదీల విషయంపై ఓ నిర్ణయం తీసుకునే వీలుందని బీసీసీఐ వర్గాలు తెలిపాయి.

**ఆల్‌స్టార్స్ మ్యాచ్ సందేహమే:** వచ్చే ఐపీఎల్ సీజన్‌కు ముందు నిర్వహించాలనుకున్న ఆల్‌స్టార్స్ మ్యాచ్ నిర్వహణ అనుమానంగా మారింది. సీజన్‌కు ముందు ఎనిమిది ఫ్రాంఛైజీల ఆటగాళ్లను జట్లుగా విడదీసి ఆల్‌స్టార్స్ మ్యాచ్ నిర్వహిస్తామని గంగూలీ ఇదివరకే ప్రకటించాడు. అయితే తమ ఆటగాళ్లను ఆ మ్యాచ్‌కు అనుమతించే విషయంపై ఫ్రాంఛైజీలు ఆసక్తి చూపట్లేదు. "వ్యాపార కోణంలో ఆలోచిస్తే మా జట్టు ఆటగాళ్లు మా జెర్సీ వేసుకోకపోవడం మాకు సమ్మతం కాదు" అని ఓ ఫ్రాంఛైజీ యజమాని తెలిపారు. "ఐపీఎల్ సీజన్ ఆరంభానికి కొన్ని రోజుల ముందు ఆల్‌స్టార్ మ్యాచ్ కోసం ఆటగాళ్లను వదిలేయమనడంలో అర్థం లేదు. ఆటగాళ్లకు గాయాలయ్యే ప్రమాదముంది. జట్టుతో బంధం పెంచుకునే సెషన్స్, కలిసి ప్రయాణించే సమయాన్ని వాళ్లు కోల్పోతారు" అని మరో ఫ్రాంఛైజీ యజమాని పేర్కొన్నారు. ఐతే సీజన్ ముగిశాక ఈ మ్యాచ్ నిర్వహించే అవకాశాలనూ కొట్టిపారేయలేం.

**ఐపీఎల్‌కు ఆర్చర్ దూరం:** ఇంగ్లాండ్ స్టార్ పేసర్ జోఫ్రా ఆర్చర్ ఈ ఏడాది ఐపీఎల్‌కు దూరమయ్యాడు. కుడి మోచేతికి గాయం కావడంతో అతను ఈ టోర్నీ నుంచి తప్పుకున్నాడు. ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్‌కు ఆడుతున్న ఈ పేసర్.. శ్రీలంకతో పర్యటనకు కూడా దూరమయ్యాడు.



హసన్ జాయ్ 100

## భారత్ ఫైనల్ ప్రత్యర్థి బంగ్లా

# తుది పోరు పొరుగు జట్టుతోనే..

### తొలిసారి అండర్-19 ప్రపంచకప్ ఫైనల్లో బంగ్లాదేశ్ ● సెమీస్‌లో కివీస్‌పై ఘనవిజయం

**ఉత్కంఠకు తెరపడింది. అండర్-19 వన్డే ప్రపంచకప్‌లో భారత కుర్రాళ్ల ప్రత్యర్థి ఎవరో తేలిపోయింది. పొరుగు జట్టు బంగ్లానే భారత్‌కు, కప్పుకి మధ్య నిలిచింది. దక్షిణాఫ్రికాను అలవోకగా ఓడిస్తూ సెమీఫైనల్ చేరిన ఆ జట్టు.. జోరు కొనసాగిస్తూ శుక్రవారం న్యూజిలాండ్‌పై ఘన విజయంతో ఫైనల్లోకి దూసుకొచ్చింది. బంగ్లా అండర్-19 ప్రపంచకప్ ఫైనల్ చేరడం ఇదే తొలిసారి కావడం విశేషం. మరి ఈ జట్టును ఓడించి యువ భారత్ హ్యాట్రిక్ ప్రపంచకప్‌ను సొంతం చేసుకుంటుందా?**

పోచెఫ్‌స్ట్రూమ్

వరుసగా మూడో ప్రపంచకప్‌పై కన్నేసిన యువ భారత్.. ఆదివారం ఫైనల్లో బంగ్లాదేశ్‌ను ఢీకొనబోతోంది. శుక్రవారం ఆసక్తికరంగా సాగిన రెండో సెమీఫైనల్లో బంగ్లాదేశ్ 6 వికెట్ల తేడాతో న్యూజిలాండ్‌ను ఓడించింది. మొదట టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన కివీస్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 211 పరుగులే చేసింది. షోరిఫుల్ హుస్సేన్ (3/45) ధాటికి కివీస్ 25.4 ఓవర్లలో 74 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడగా.. లిడ్‌స్టోన్ (44)తో కలిసి వీలర్ గ్రీనల్ (75 నాటౌట్; 83 బంతుల్లో 5×4, 2×6) ఇన్నింగ్స్‌ను నిలబెట్టాడు. వీళ్లిద్దరూ అయిదో వికెట్‌కు 67 పరుగులు జోడించారు. అయితే చివర్లో వీలర్ ఎంత కష్టపడ్డా జట్టుకు భారీ స్కోరు అందించలేకపోయాడు. లిడ్‌స్టోన్ ఔటయ్యాక అతడికి సరైన సహకారం అందలేదు. క్రమం తప్పకుండా వికెట్లు పడటంతో స్కోరు ఆశించిన స్థాయిలో పెరగలేదు. అనంతరం బంగ్లా 32 పరుగులకే ఓపెనర్లు హసన్ ఇమాన్ (3), పర్వేజ్ హుస్సేన్ (14)ల వికెట్లు కోల్పోయినప్పటికీ.. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' మహ్మదుల్ హసన్ జాయ్ (100; 127 బంతుల్లో 13×4) అద్భుత శతకంతో జట్టును గెలిపించాడు. అతను తౌహిద్ హృదయ్ (40)తో మూడో వికెట్‌కు 77 పరుగులు, షాదత్ (40 నాటౌట్)తో నాలుగో వికెట్‌కు 101 పరుగులు జోడించాడు. విజయానికి 11 పరుగులే అవసరమైన దశలో మహ్మదుల్ ఔటయ్యాడు. బంగ్లా 44.1 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. తొలి సెమీఫైనల్లో భారత్.. పాకిస్థాన్‌ను ఓడించిన సంగతి తెలిసిందే.

**న్యూజిలాండ్:** 50 ఓవర్లలో 211/8 (వీలర్ గ్రీనల్ 75 నాటౌట్, లిడ్‌స్టోన్ 44; షోరిఫుల్ హుస్సేన్ 3/45, షమీమ్ హుస్సేన్ 2/31, హసన్ మురాద్ 2/34); **బంగ్లాదేశ్:** 44.1 ఓవర్లలో 215/4 (మహ్మదుల్ హసన్ జాయ్ 100; తౌహిద్ హృదయ్ 40, షాదత్ హుస్సేన్ 40 నాటౌట్; హాన్‌కాక్ 1/31)



## టోక్యో రియోలా కాదు

హైదరాబాద్: రియో ఒలింపిక్స్‌కు వెళ్లినప్పుడు తనపై ఎవరికీ పతక ఆశలు లేవని.. కానీ టోక్యో ఒలింపిక్స్‌లో అంచనాలు భారీగా ఉన్నాయని భారత స్టార్ షట్లర్ పి.వి.సింధు చెప్పింది. "టోక్యో ఒలింపిక్స్ కన్నా రియో చాలా భిన్నం. ఆట స్థాయి భిన్నం. ఇప్పుడు టాప్-1 నుంచి 10 వరకు ఒకే స్థాయిలో ఉన్నారు. అందులోనూ అప్పుడు నేను ఎవరికీ తెలియదు. నేను పతకానికి పోటీదారునని కూడా ఎవరూ అనుకోలేదు. కానీ టోక్యోలో పతకం కోసం పోటీపడే వాళ్లలో నన్ను ముందు వరసలో ఉంచుతారు. ఇది ఒకరకంగా బాధ్యత, ఒత్తిడిని పెంచేదే. అయితే ఒత్తిడికి గురి కాకుండా ప్రశాంతంగా ఆడి విజేతగా నిలవడమే నా ముందున్న లక్ష్యం. ఇది ఒలింపిక్ ఏడాది కావడంతో రాబోయే రెండు నెలలు ఎంతో కీలకం. ఒలింపిక్స్ కన్నా ముందు ఆరు టోర్నీలు ఉన్నాయి. వాటిలో కీలకమైన వాటిని ఎంచుకుని ఆడాలి. ఈ మెగా ఈవెంట్‌కు ముందు మానసికంగా, శారీరకంగా ఫిట్‌గా ఉండడం ముఖ్యం" అని సింధు చెప్పింది.

## క్రొయేషియాతో పోరుకు పేస్



దిల్లీ: పాకిస్థాన్‌తో డేవిస్‌కప్ సమరంతో పునరాగమనం చేసిన వెటరన్ టెన్నిస్ స్టార్ లియాండర్ పేస్.. వచ్చే నెల 6న క్రొయేషియాతో ఆరంభమయ్యే పోరుకూ భారత జట్టులో కొనసాగనున్నాడు. క్రొయేషియాతో డేవిస్‌కప్ ప్రపంచ గ్రూప్ క్వాలిఫయర్స్ సమరంలో పోటీపడే భారత జట్టును అఖిల భారత టెన్నిస్ సమాఖ్య గురువారం ప్రకటించింది. ఈ జట్టుకు పాక్‌తో పోరుకు నాన్ ప్లేయింగ్ కెప్టెన్‌గా ఉన్న రోహిత్ రాజ్‌పాలే సారథ్యం వహించనున్నాడు. పాక్‌తో సమరం నుంచి తప్పుకున్న డబుల్స్ స్పెషలిస్ట్ రోహన్ బోపన్న తిరిగి జట్టులోకి వచ్చాడు. అతనితో పాటు పేస్, దివిజ్ శరణ్ డబుల్స్ బృందంలో ఉన్నారు. ప్రజ్నేశ్ గుణేశ్వరన్, సుమిత్ నగాల్, రామ్‌కుమార్ రామనాథన్ సింగిల్స్ సభ్యులుగా ఎంపికయ్యారు. ఈ జట్టుకు జీషన్ అలీ కోచ్‌గా వ్యవహరించనున్నాడు.

## సచిన్ జట్టులో సభ్యులు వీళ్లే

సిడ్నీ: ఆస్ట్రేలియా కార్చిచ్చు బాధితుల సహాయార్థం ఆదివారం సిడ్నీ క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్న ఛారిటీ క్రికెట్ మ్యాచ్‌లో సచిన్ తెందుల్కర్ కోచ్‌గా ఉన్న పాంటింగ్ ఎలెవన్ జట్టు గిల్‌క్రిస్ట్ ఎలెవన్‌తో తలపడనుంది. పాంటింగ్ ఎలెవన్‌లో బ్రయాన్‌లారా, వసీం అక్రమ్, జస్టిన్ లాంగర్, మాథ్యూ హేడెన్ లాంటి స్టార్లు ఆడుతున్నారు. ఈ జట్టులో మహిళా క్రికెటర్ ఎలిస్ కూడా ఉండడం విశేషం. మొదట గిల్లీ ఎలెవన్‌కు వార్న్ కెప్టెన్ అనుకున్నా.. అతని స్థానంలో గిల్‌క్రిస్ట్‌కు బాధ్యతలు అప్పగించారు. ఈ జట్టులో యువరాజ్, వాట్సన్, హాడ్జ్, సైమండ్స్, వాల్ష్ తదితరులు ఆడనున్నారు.

## స్టార్లతో ఇలాగేనా?



కరాచి: పాకిస్థాన్ క్రికెట్ బోర్డు తీరుపై ఆ జట్టు మాజీ పేసర్ షోయబ్ అక్తర్ మరోసారి బాహాటంగా ఆగ్రహం వ్యక్తం చేశాడు. "భారత అండర్-19 జట్టుకు రాహుల్ ద్రవిడ్ రూపంలో ఉత్తమ ఆటగాడు కోచ్‌గా ఉన్నాడు. అదే పాకిస్థాన్‌లో అదే ఉద్యోగానికి యూనిస్‌ఖాన్ లాంటి ఆటగాడు వెళితే రూ.15 లక్షలు ఇమ్మంటే రూ.13 లక్షలకు బేరం ఆడారు. మీ స్టార్లను చూసుకునే పద్ధతి ఇదేనా? నాతో పాటు మహ్మద్ యూసుఫ్, యూనిస్‌ఖాన్ ఉన్నాం.. మమ్మల్ని అడిగితే అండర్-19 జట్టుకు సాయం చేస్తాం. భారత అండర్-19 జట్టు చాలా పరిణతితో కనిపిస్తోంది. ఎందుకంటే ఆ జట్టుకు అలాంటి కోచ్ ఉన్నాడు" అని అక్తర్ అన్నాడు.

# భలే అమ్మాయిలు

**మారుమూల ప్రాంతం నుంచి వచ్చి భారత ఫుట్‌బాల్ స్టార్‌గా ఎదిగి.. విదేశీ క్లబ్‌తోనూ ఒప్పందం చేసుకున్న ఘనత ఒకరిది! మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చి సెయిలింగ్ ప్రపంచకప్‌లో పతకం గెలిచి సత్తా చాటింది ఇంకొకరు. ఇటీవల చక్కటి ప్రదర్శనతో భారత క్రీడా రంగంలో ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తున్న ఆ ఇద్దరూ.. ఫుట్‌బాల్ స్టార్ బాలాదేవి.. సెయిలింగ్ కెరటం నేత్ర కుమనన్.**

### కెరటాలకు నిలిచి..



సెయిలింగ్.. సాహసోపేతమైన క్రీడ.. ఈ క్రీడలో భారత్ నుంచి రాణించేవాళ్లే తక్కువ. అందులోనూ అంతర్జాతీయ వేదికపై సత్తా చాటే వాళ్లను వేళ్ల మీద లెక్క పెట్టొచ్చు. ఇక అమ్మాయిల్లో ఈ క్రీడలో ఛాంపియన్లుగా నిలిచిన వాళ్లు అతి తక్కువమంది. అలాంటి క్లిష్టమైన క్రీడలో ఎంతోపోటీ ఉండే ప్రపంచకప్‌లో పతకం గెలవడం అంటే మాటలా! కానీ చెన్నై అమ్మాయి నేత్ర కుమనన్ ఈ ఘనత సాధించింది. ఇటీవల అమెరికాలోని మియామిలో జరిగిన ప్రపంచకప్ సెయిలింగ్ పోటీల్లో కాంస్యం గెలిచి ఔరా అనిపించింది. ప్రపంచకప్ సెయిలింగ్‌లో పతకం నెగ్గిన తొలి భారత మహిళగా ఆమె చరిత్ర సృష్టించింది. మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చిన నేత్రకు 2011లో వేసవి శిబిరం ద్వారా సెయిలింగ్ పట్ల ఆసక్తి ఏర్పడింది. అన్న సెయిలర్ కావడంతో ఈ క్రీడలో ఆమె వేగంగా ఎదగడానికి తోడ్పడింది. 2012లో జాతీయ జూనియర్ ఛాంపియన్‌షిప్‌లో పతకం గెలిచిన నేత్ర.. ఆ తర్వాత పలు జాతీయ పతకాలు ఖాతాలో వేసుకుంది. 2014, 2018 ఆసియా క్రీడల్లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన నేత్ర.. ప్రపంచకప్‌లోనూ మెరిసింది. ప్రపంచకప్‌లో లేజర్ రేడియల్ క్లాస్‌లో ఒక దశలో అగ్రస్థానంలో దూసుకెళ్లిన నేత్ర.. చివరికి కాంస్యంతో సరిపెట్టుకుంది. మార్చి 15న ఆరంభమయ్యే ఆసియా సెయిలింగ్ ఛాంపియన్‌షిప్‌లో రాణించడమే నేత్ర ముందున్న లక్ష్యం. ఇది ఒలింపిక్స్ క్వాలిఫయింగ్ ఈవెంట్ కావడంతో ఈ టోర్నీలో సత్తా చాటి టోక్యో బెర్తు సంపాదించాలని ఈ 22 ఏళ్ల సెయిలర్ భావిస్తోంది.

### మేరీ స్ఫూర్తితో..



మేరీకోమ్... దేశంలో ఎంతోమందికి స్ఫూర్తినిచ్చిన వనిత.. ఆరుసార్లు బాక్సింగ్ ఛాంపియన్‌గా నిలిచిన మేరీ స్ఫూర్తితోనే అదే మణిపుర్ నుంచి మరో మహిళ ఎదిగింది.. అయితే బాక్సింగ్‌లో కాదు ఫుట్‌బాల్‌లో! ఆమే నగోమ్ బాలాదేవి. భారత ఫుట్‌బాల్ జట్టులో కీలక క్రీడాకారిణిగా ఉన్న బాలాదేవి.. ఇటీవల స్కాట్లాండ్ జట్టు రేంజర్స్ ఎఫ్‌సీతో ఒప్పందం చేసుకుంది. ప్రొఫెషనల్ విదేశీ క్లబ్‌తో ఒప్పందం చేసుకున్న తొలి భారత ఫుట్‌బాల్ క్రీడాకారిణిగా దేవినే. మణిపుర్‌లోని బిష్ణుపుర్ జిల్లా నుంచి వచ్చి క్లిష్ట పరిస్థితులను తట్టుకుని ఈ క్రీడలో ఎదిగిన దేవికి తన రాష్ట్రం నుంచే వచ్చి దిగ్గజంగా అవతరించిన మేరీకోమే ఆదర్శం. కానిస్టేబులైన తండ్రి.. దేవి ఫుట్‌బాల్ క్రీడాకారిణి కావడంలో కీలకపాత్ర పోషించాడు. ఫుట్‌బాలరే అయిన ఆయన స్థానిక మ్యాచ్‌లకు కూతురుని తీసుకెళ్లి.. ఆటపై ఇష్టం ఏర్పడేలా చేశాడు. అలా ఈ ఆటలోకి వచ్చిన దేవి.. 2001-02లో అండర్-19 జాతీయ క్రీడల్లో రాణించడంతో పేరు తెచ్చుకుంది. భారత జట్టులో మిడ్‌ఫీల్డర్‌గా ముఖ్య పాత్ర పోషిస్తున్న బాలాదేవి ఇప్పటిదాకా 52 మ్యాచ్‌లు ఆడి 58 గోల్స్ చేసింది. 2015, 2016 ఏడాది మహిళల ఫుట్‌బాల్ క్రీడాకారిణి అవార్డు దక్కించుకున్న దేవి.. మహిళల ఫుట్‌బాల్ లీగ్‌లో గత రెండు సీజన్లలో టాప్ స్కోరర్‌గా ఉంది.

## అది నమ్మశక్యం కాని విషయం

వీవీఎస్ లక్ష్మణ్

న్యూజిలాండ్ వన్డేల్లో తమ అత్యధిక ఛేదనను పూర్తి చేసిన తీరును ఎంత పొగిడినా తక్కువే. తొలి వన్డేలో 347 పరుగుల లక్ష్యాన్ని కివీస్ చేరుకోవడం చారిత్రక మైలురాయి. నికోల్స్, లేథమ్ సహకారంతో టేలర్ జట్టును గెలిపించాడు. విలియమ్సన్ గైర్హాజరీలో కెప్టెన్‌గా లేథమ్ ఆకట్టుకున్నాడు. కొండంత లక్ష్యాన్ని చేరుకోవాలంటే త్వరగా వికెట్లు కోల్పోకూడదు.. సాధించాల్సిన రన్‌రేట్ కూడా అందుబాటులో ఉండేలా చూసుకోవాలి. గప్తిల్ త్వరగానే ఔటైనప్పటికీ నికోల్స్ రాణించడంతో ఆ జట్టు ఈ రెండు విషయాలను పాటించగలిగింది. 41 ఓవర్ వచ్చేసరికి సాధించాల్సిన రన్‌రేట్ 5.6గా మారిపోయింది. దాదాపు 350 పరుగుల ఛేదనలో అది నమ్మశక్యం కాని విషయమే. వరుసగా మూడో వన్డే సిరీస్‌లోనూ భారత్ తొలి మ్యాచ్‌లో ఓడింది. అయితే తిరిగి పుంజుకుని వెస్టిండీస్, ఆస్ట్రేలియాతో సిరీస్‌లు గెలిచినట్లుగానే కివీస్‌తో పోరులోనూ పైచేయి సాధిస్తుందనే నమ్మకం ఉంది. అలా జరగాలంటే ఫీల్డింగ్‌లో చురుకుదనం, బౌలింగ్‌లో క్రమశిక్షణ అవసరం. పది పరుగుల వద్ద టేలర్ క్యాచ్‌ను కుల్‌దీప్ వదిలేయడం మ్యాచ్‌ను మలుపు తిప్పింది. భారత బ్యాటింగ్ గొప్పగా సాగింది. అరంగేట్ర ఓపెనర్లు మయాంక్, షాతో పాటు కోహ్లి, శ్రేయస్, రాహుల్ మంచి ప్రదర్శన చేశారు. ఇన్నింగ్స్‌ను నిర్మించగలిగే సత్తాతో పాటు అవసరమైనపుడు గేర్లు మార్చే సామర్థ్యం కూడా ఉందని శ్రేయస్ చాటాడు.

ROYAL STAG CUP
INDIA vs NEW ZEALAND
ODI & TEST
*MEGA MUSIC CDs

Founder: Ramoji Rao. Editor: M Nageswara Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Pvt Ltd. Published and Printed at Eenadu Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna Dist -521 104, Andhra Pradesh. Phones:0866-2862389, 2862111. Regd. No. VJ/013/2018-20 RNI No. 32238/78, Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re.1.00, Portblair Rs.10.00.

